అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 16-07-2024

సంపుటి : 10 | సంచిక : 147 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

భగ్గుమన్న నిత్యావసరాల ధరలు

పెరిగిన టోకు ధరల ద్రవ్యోల్బణం

జూన్‌లో 16 నెలల గరిష్ట స్థాయికి చేరిక



న్యూఢిల్లీ : దేశంలో నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా ఆకాశాన్ని తాకుతున్నాయి. ద్రవ్యోల్బణ ఆధారిత టోకు (హోల్‌సేల్) ధరల సూచీ జూన్‌లో 16 నెలల గరిష్ఠ స్థాయి 3.36 శాతానికి చేరింది. మేలో హోల్‌సేల్ ద్రవ్యోల్బణ సూచీ 2.61 శాతం, ఏప్రిల్‌లో 1.26 శాతంగా మాత్రమే నమోదైంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం ఈ మేరకు వివరాలు విడుదల చేసింది. వరుసగా ఏడు నెలల పాటు తగ్గిన తర్వాత ...11లో



రాజ్యసభలో 86కు తగ్గిన బీజేపీ బలం

మిత్రపక్షాలతో కలిపి 101 మంది మద్దతు

ఇతరుల సాయంతో బిల్లులు గట్టెక్కే అవకాశం

వివరాలు 3లో

రేషన్ కార్డే ప్రామాణికం




రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల

- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాలకు వర్తింపు
- కుటుంబానికి గరిష్టంగా రూ.2లక్షల వరకు మాఫీ
- ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఆర్ఎంజీ, ఎల్ఈసీఎస్, రీ-షెడ్యూల్ రుణాలకు మాఫీ వర్తించదు.
- ఆరోహణ క్రమంలో నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ
- సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి యం.రఘునందన్‌రావు ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. "ప్రతి కుటుంబానికి గరిష్టంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ వర్తించనుంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్ కార్డును ప్రామాణికంగా పరిగణిస్తారు. రుణ ఖాతా లోని ఆధార్ సంఖ్య, పాస్‌బుక్‌ను ఆహారభద్రత కార్డుల డేటా బేస్‌కు అనుసంధానం చేసి, లబ్దిదారుల ను గుర్తిస్తారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయనున్నారు. రుణమాఫీ నగదు నేరుగా లబ్దిదారుల రుణ ఖాతాల్లోనే జమ కానుంది. ఆరోహణ క్రమంలో సొమ్ము విడుదల చేయనున్నారు. మహిళా సంఘాలు, జేఎల్‌జీ, ఆర్ఎంజీ, ఎల్ఈసీఎస్ రుణాలకు, రీ-షెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు. రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరిస్తారు. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్, లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించాలి" అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రుణమాఫీ మార్గదర్శకాలు

- తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుంది.
- ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు వర్తిస్తుంది.
- రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్ట్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు.. వాటి బ్రాంచ్‌ల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది.
- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాలకు వర్తింపు
- ఈ పథకం కింద ప్రతి రైతు కుటుంబం రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీకి అర్హులు. 09.12.2023 తేదీ నాటికి బకాయి ఉన్న అసలు, వర్తింపయ్యే వడ్డీ మొత్తం పథకానికి అర్హత కలిగి ఉంటుంది.
- రైతు కుటుంబాలను నిర్ధారించడానికి పౌరసరఫరాల శాఖ వారు నిర్వహించే ఆహార భద్రత కార్డు(రేషన్ కార్డు) డేటాబేస్ ప్రామాణికంగా పరిగణిస్తారు.
- అర్హత గల రుణమాఫీ మొత్తాన్ని డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్దిదారుల రైతు రుణఖాతాలకు జమ చేస్తారు. పీఏసీఎస్ విషయంలో రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీ లేదా బ్యాంకు బ్రాంచికి ...2లో

మోడీ నాయకత్వంలో బీజేపీ

మునిగిపోతుంది

సుబ్రమణ్యస్వామి విమర్శలు



న్యూఢిల్లీ : మోడీ నేతృత్వం కొనసాగితే బీజేపీ టైటానిక్ నావలా మునిగిపోతుందని ఫైర్‌బ్రాండ్ నేత సుబ్రమణ్య స్వామి వ్యాఖ్యానించారు. బీజేపీ ఓడ బీటలు వారుతోందని, అది మునిగిపోవడం ఖాయమని ఆయన చెప్పారు. వివిధ రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీకి చేదు అనుభవాన్ని మిగిల్చిన నేపథ్యంలో సుబ్రమణ్య స్వామి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. 'బీజేపీలో ఉన్న మనం టైటానిక్ నావ మాదిరిగా పార్టీ మునిగిపోవడం చూడాలంటే మోడీ నేతృత్వమే ఉత్తమం. బీజేపీ నావ బీటలు వారుతోంది. అది మరింత మునిగిపోతుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. సుబ్రమణ్య స్వామి ఇటీవలి కాలంలో ప్రధాని మోడీ, ...11లో

డీఎస్సీ నిర్వహణకు

సర్వంసిద్ధం

18 నుంచి ఆగస్టు 5 వరకు

ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు

2.79 లక్షల మంది దరఖాస్తు

15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేత

11లో..



మాకు తెలిసింది మీకు చెబుతాం

పీసీ ఘోష్‌తో సీనియర్ ఐఏఎస్‌లు

రామకృష్ణారావు, స్మితాసబర్వాల్,వికాస్‌రాజ్, సోమేష్‌కుమార్, రజత్‌కుమార్ హాజరు

పీపీటీ ఇచ్చిన జేపీఎస్ నేత రఘు

నోటీసులకు స్పందించని నాగిరెడ్డి

కాళేశ్వరం లోపాలపై కొనసాగుతున్న విచారణ

నేడు వెదిరె శ్రీరామ్ హాజరు

వివరాలు 11లో

బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ రూపొందించండి

మిగతా రాష్ట్రాల్లో అమలుపై అధ్యయనం చేయండి : సీఎం రేవంత్‌రెడ్డి

2లో..

పదికి చేరిన ఫిరాయింపులు

హస్తం గూటికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

10లో..



బోనాల్లో ప్రొటోకాల్ రగడ

చెక్కుల పంపిణీలో వివాదం

నేలపై కూర్చొని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిరసన

ప్రజాప్రతినిధులను గౌరవించే సంప్రదాయమిదేనా అంటూ విమర్శ



10లో..

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాపాడాలి

సీఎస్, కలెక్టర్లకు ఆదేశాలివ్వండి : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

11లో..

సైబరాబాద్ పరిధిలో.. డ్రగ్స్ పట్టివేత



రూ.35 లక్షల విలువైన మత్తుమందు స్వాధీనం

ఐదుగురు నిందితుల అరెస్టు

డ్రగ్స్ తీసుకున్న వారిలో ఓ ప్రముఖ హీరోయిన్ తమ్ముడు

వివరాలు వెల్లడించిన రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

10లో..

ఎస్‌బీఐ రుణాలు భారం

వడ్డీ రేట్ల పెంపు



ముంబయి : దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణాలు మరింత భారం కానున్నాయి. సోమవారం నుంచి వడ్డీ రేట్లను పెంచుతూ ఆ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది. కొన్ని కాలపరిమితులపై మార్జినల్ కాస్ట్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు లేదా 0.10 శాతం వరకు పెంచింది. ఏడాది కాలవ్యవధి గల ఎంసీఎల్ఆర్‌ను 8.75 శాతం నుంచి 8.85 శాతానికి చేర్చింది. ఆరు నెలల కాల వ్యవధికి 8.65 శాతం నుంచి 8.75 శాతానికి, రెండేండ్లకు 8.85 శాతం నుంచి 8.95 శాతానికి పెంచింది. మూడేండ్ల కాలపరిమితి ఎంసీఎల్ఆర్‌ను 8.95 శాతం నుంచి 9 శాతానికి చేర్చింది. దీంతో ...11లో

జీవో 10 రద్దు చేయాలి

ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించిన అంగన్‌వాడీలు

వర్షంలోనూ కొనసాగిన ఆందోళన

తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు

ములుగులో మంత్రి సీతక్కకు వినతి

కొత్త జీవో వచ్చే వరకు రిటైర్మెంట్ చేయొద్దని అధికారులకు మంత్రి ఆదేశం

అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యేల హామీ



నవతెలంగాణ- విలేకరులు

" ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాలకు నష్టం చేకూర్చే జీవో నెంబర్ 10 రద్దు చేయాలి.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి అమలు చేయాలి" అంటూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంలోనూ ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచుతూ కొత్త జీవో ఇవ్వాలని, హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయగా.. అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. ములుగులో మంత్రి సీతక్క క్యాంపు ఆఫీసు ముందు ధర్నా చేయకుండా ముందస్తుగా అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. అంగన్‌వాడీ ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన మంత్రి వెంటనే అధికారులకు ఫోన్ చేసి.. కొత్త జీవో వచ్చే వరకు ఎవరినీ రిటైర్మెంట్ చేయొద్దని ఆదేశించారు.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడారు. జీవో 10ని రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ పెంచుతూ వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం ...2లో

ప్రాజెక్టులకు చేరుతున్న వరద

జిల్లాల్లో మోస్తరు వర్షం | హుస్సేన్‌సాగర్ రెండు గేట్లు ఎత్తివేత

- జూరాలకు నీటి ప్రవాహం
- హైదరాబాద్‌లో పొద్దంతా జల్లులు
- రోడ్లపై నిలిచిన నీరు
- జీహెచ్ఎంసీ అధికారుల అప్రమత్తత



నవతెలంగాణ-సిటీబ్యూరో/ విలేకరులు

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు, రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు పడుతుండటంతో ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్‌లో సోమవారం పొద్దంతా ఆకాశం ముసుగేసింది. తెరపలు తెరపలుగా జల్లులు పడుతూనే ఉన్నాయి. హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. దాంతో అధికారుల రెండు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదిలారు. హైదరాబాద్ జంట నగరాలతో పాటు సంగారెడ్డి, భూపాపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షాలతో అక్కడక్కడా భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడి.. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరప్రదాయిని జూరాల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి నీటి ప్రవాహం మొదలైంది.గ్రేటర్‌లో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లపై వరదనీరు భారీగా నిలిచిపోతోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. చింతల్, సుచిత్ర, బాలానగర్, ఐడీపీఎల్, జీడిమెట్ల, సికింద్రాబాద్, బేగంపేట్, బోయిన్‌పల్లి, ...11లో

డిగ్రీలెందుకు

పంక్చర్ షాపులు పెట్టుకోండి

బీజేపీ ఎమ్మెల్యే

వివరాలు 3లో

ఎమర్జెన్సీలో తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తారా?

బీజేపీ ప్రభుత్వానికి తమిళనాడు సీఎం స్టాలిన్ సూటి ప్రశ్న



వివరాలు 3లో

డీఎస్సీ వాయిదా వేయాలి

సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగుల ఆందోళన..పలువురి అరెస్ట్



నవతెలంగాణ-ముషీరాబాద్

డీఎస్సీని వాయిదా వేయాలని, గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని, గ్రూప్-2ను డిసెంబర్‌లో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ వద్ద సోమవారం సాయంత్రం నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. పెద్దఎత్తున నినాదాలు చేస్తూ లైబ్రరీ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నం చేయగా.. పోలీసులు లైబ్రరీ గేట్లను మూసేశారు. దాంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అభ్యర్థులు లైబ్రరీలోనే ఆందోళన కొనసాగించారు. పలువురు గేటు తోసుకుంటూ బయటకు వచ్చే ప్రయత్నం చేయగా పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు నిరుద్యోగులకు మధ్య తోపులాట జరిగింది. భారీగా పోలీసులు మోహరించి నిరుద్యోగులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ.. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు వెనకడుగు వేసేది లేదని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జీవో 10 రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే పీఏకి వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని కాడ(కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. కాడ అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇండ్లు, క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఉట్నూర్ లోని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హయాంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. బోథ్ మండలంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆసిఫాబాద్‌లో భారీ ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే కోవలక్ష్మి ఇంటి వద్ద బైటాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఇండ్లను ముట్టడించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు క్యాంపు కార్యాలయాన్ని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ముట్టడించారు. వర్షంలో గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు. ఎమ్మెల్యే వెంకట్రావు వెంటనే అక్కడకు చేరుకొని అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు విన్నారు. ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కా రానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇల్లందులో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య వారి సమస్యలు విని అసెంబ్లీ సమావేశంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగూడెంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యాలయం ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేశారు. ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.భువనగిరి జిల్లా కేంద్రం, యాదగిరిగుట్ట పట్టణాల్లో ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసుల ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మిర్యాలగూడలో ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు, దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజే శారు.నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఇంటి వరకు అంగన్‌వాడీలు ర్యాలీగా వెళ్లి బైటాయించారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా.. అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీల సమస్యపై ప్రస్తావిస్తానని, అవసరమైతే



ధర్నా చేపడతామని హామీ ఇచ్చారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేయగా.. ఆయన సైతం అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. బాన్సువాడలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఎదుట నిరసన చేపట్టి వినతిపత్రం అందజేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పీఏకు వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేల ఇంటి ఎదుట ధర్నాలు చేపట్టి వినతిపత్రాలు అందజేశారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు అంగన్‌వాడీలు భారీ ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. అనంతరం ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు.మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు ర్యాలీగా వెళ్లారు. ఎమ్మెల్యే యన్నెం శ్రీనివాస్ రెడ్డి అంగన్వాడీలతో మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి సీతక్కతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడించారు. నారాయపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇంటి వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం ఇచ్చారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు నిరసనలు తెలిపారు.

మంత్రి సీతక్కకు వినతి..

మహబూబాబాద్ జిల్లాలో ఎమ్మెల్యే మురళినాయక్ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ములుగు జిల్లాలో జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఎమ్మెల్యేల ఇంటి ముట్టడి చేపట్టారు. మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయం ముందు ధర్నా చేయకుండా పోలీసులు ముందస్తుగా అంగన్వాడీలను ఎక్కడికక్కడా అరెస్టు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్‌ను ఆదివారం రాత్రే అరెస్టు చేయాలని ప్రయత్నించగా.. రాజేందర్ మంత్రికి ఫోన్ చేసి మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ ప్రతినిధి బృందం మంత్రి సీతక్కను కలిసి సమస్యలు వివరించారు. దాంతో డీడబ్ల్యూఓకు మంత్రి ఫోన్ చేసి.. కొత్త జీవో వచ్చేవరకు ఎవరినీ రిటైర్మెంట్ చేయొద్దని, ప్రిన్సిపల్ సెక్రెటరీతో మాట్లాడతానని చెప్పారు. హన్మకొండలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అంగన్‌వాడీలు కలిసి వినతిపత్రం అందించారు.

ఇంటర్నేషనల్ స్కూల్లో కీచక డ్యాన్స్ మాస్టర్ చిన్నారిపై లైంగికదాడి

- పోక్సో కేసు నమోదు



నవతెలంగాణ-బోడుప్పల్

ఇంటర్నేషనల్ స్కూల్లో కీచక మాస్టర్ బాగోతం బట్టబయలైంది.. ఐదేండ్ల చిన్నారిపై డ్యాన్స్ మాస్టర్ దారుణానికి ఒడిగట్టాడు. డ్యాన్స్ నేర్పించే క్రమంలో లైంగికదాడి చేశాడు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలో జరిగింది. మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి తెలిసిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఓ బాలిక చదువుతున్నది. అదే పాఠశాలలో పనిచేసే డ్యాన్స్ మాస్టర్ రవికుమార్ నాలుగు రోజుల కిందట డ్యాన్స్ నేర్పించే క్రమంలో బాలికపై లైంగికదాడి చేశాడు. జరిగిన విషయాన్ని చిన్నారి ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పింది. దాంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి డ్యాన్స్ మాస్టర్‌కు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు డ్యాన్స్ మాస్టర్‌ను, స్కూల్ ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు డ్యాన్స్ మాస్టర్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలి

- పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పౌరసరఫరాలశాఖలోని హమాలీలకు ఈ ఏడాది జనవరి నుంచి నూతన రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు, సివిల్ సప్లైస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు సివిల్ సప్లైస్ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంటనే సంఘ నాయకులతో చర్చలు జరపాలని వారు కోరారు. తెలంగాణ పౌరసరఫరాల సంస్థతో పాటు జీసీసీ హమాలీ దిగుమతి - ఎగుమతి నూతన రేట్ల ఒప్పందం కోసం హమాలీ కార్మిక సంఘాలతో చర్చలు జరిపి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 3,260 మంది హమాలీ కార్మికులకు 2022 సంవత్సరంలో జరిగిన రేట్ల ఒప్పందం 2023 డిసెంబర్‌తో ముగిసిందని గుర్తుచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏడు నెలలుగా నూతన రేట్ల ఒప్పందం అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు ఒప్పందాల్లో ప్రభుత్వ అధికారులు అంగీకరించిన ఈఎస్ఐ సౌకర్యం, జీసీసీ హమాలీలకు పీఎఫ్ సౌకర్యం, మహిళా స్వీపర్లకు కనీస వేతనాలు నేటికీ అమలు కావడం లేదని తెలిపారు. కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ పెట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. "సివిల్ సప్లై, జీసీసీ హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి. హమాలీలకు బయోమెట్రిక్ విధానంతో పెరిగిన పని భారానికి అనుగుణంగా ఎగుమతి-దిగుమతి రేట్లను రూ.26 నుంచి రూ.35కు పెంచాలి. పౌరసరఫరాల సంస్థలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను జీసీసీ హమాలీలకు వర్తింపచేయాలి. తక్షణమే పీఎఫ్ అమలు చేయాలి. వివిధ జిల్లాల్లో ప్రయివేటు గోదాముల స్థానంలో ప్రభుత్వ గోదాములు నిర్మించి పని భద్రత కల్పించాలి. ప్రమాదాలు జరిగి మరణిస్తే రూ.10 లక్షలు చెల్లించాలి. గత వేతన ఒప్పందంలో అంగీకరించిన ఈఎస్ఐ సౌకర్యాన్ని అమలు చేయాలి. దసరా సందర్భంగా స్వీట్ బాక్సుకు ఇచ్చే మొత్తాన్ని రూ.800 నుంచి రూ.1,200కు, బోనస్‌ను రూ.10 వేలకు పెంచాలి. 60 ఏండ్లు పైబడిన హమాలీ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలి. పెన్షన్ సౌకర్యం కల్పించాలి..." అని వారు డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ రూపొందించండి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్, బీసీసంక్షేమ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించడంపై కసరత్తు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని ఆయన అధికారులకు సూచించారు. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందనీ, అందుకు ఎంత సమయం తీసుకుంటారని అధికారుల నుంచి సీఎం ఆరా తీశారు. కర్నాటకలో 2015లో, బీహార్‌లో 2023లో కుల గణన చేశారనీ, ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేసినా వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కుల గణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందనీ, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కుల గణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర మాజీ మంత్రి కె.జానారెడ్డి, బీసీ కమిషన్ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను

మిగతా రాష్ట్రాల్లో అమలుపై అధ్యయనం చేయండి

- అవసరమైతే మాజీ మంత్రి జానారెడ్డి

సలహాలు తీసుకోండి : పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాల క్రమ పట్టిక రూపొందించాలని ఆదేశించారు. ఏవైనా సందేహాలుంటే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. చట్టపరమైన విషయాలను అడ్వకేట్ జనరల్‌తో చర్చించాలన్నారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విషయాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆయా అంశాలపై త్వరగా నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డీఎస్.లోకేష్ కుమార్, న్యాయ శాఖ కార్యదర్శి ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డే ప్రామాణికం

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేస్తారు. ఆ బ్యాంకు వారు రుణమాఫీ మొత్తాన్ని పీఏసీఎస్‌లో ఉన్న రైతు ఖాతాలో జమ చేస్తారు.

4ప్రతి రైతు కుటుంబానికి 09.12.2023 తేదీ నాటికి ఉన్న రుణ మొత్తం ఆధారంగా ఆరోహణ క్రమంలో రుణమాఫీ మొత్తాన్ని జమ చేయాలి.

4ప్రతి రైతు కుటుంబానికి 09.12.2023 నాటికి కలిగి ఉన్న మొత్తం రుణం కానీ లేక రూ. 2 లక్షల వరకు ఏది తక్కువ అయితే ఆ మొత్తాన్ని ఆ రైతు కుటుంబం పొందే అర్హత ఉంటుంది.

4ఏ కుటుంబానికి అయితే రూ. 2 లక్షలకు మించిన రుణం ఉంటుందో, ఆ రైతులు రూ. 2 లక్షలకు పైబడి ఉన్న రుణాన్ని మొదట బ్యాంకులకు చెల్లించాలి. ఆ తర్వాత అర్హత గల రూ. 2 లక్షల మొత్తాన్ని రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేస్తారు.

10). రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న పరిస్థితుల్లో కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేస్తారు. మిగులు మొత్తాన్ని దామాషా పద్ధతిలో కుటుంబంలో పురుషుల పేరు మీద తీసుకున్న రుణాలను మాఫీ చేస్తారు.

వీరికి వర్తించదు

1).స్వయం సహాయక బృందాలు, తాకట్టు, ఉమ్మడిగా తీసుకున్న రుణాలు, కౌలు రైతుల కార్డులపై అప్పుల బకాయిలు ఈ పథకం పరిధిలోకి రావు.

2).పునర్వ్యవస్థీకరించిన లేదా రీ-షెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు.

3).కంపెనీలు, ఫర్మ్ వంటి సంస్థలకు ఇచ్చిన రుణాలను పరిగణనలోకి తీసుకోరు.

4).కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం వద్దనున్న డేటా మేరకు పారదర్శకంగా అమలు చేయనున్నారు.

వ్యవసాయ శాఖకు బాధ్యతలు అప్పగింత

వ్యవసాయశాఖ కమిషనర్, సంచాలకులు (డీఓఏ) పంట రుణమాఫీ 2024 పథకాన్ని అమలు చేస్తారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పథకానికి భాగస్వామిగా ఉంటుంది. వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ కలిసి ఐటీ పోర్టల్ నిర్వహిస్తారు. ఆ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఐటీ పోర్టల్ ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌కి బిల్లులు సమర్పించడంతో పాటు పథకానికి సంబంధించిన భాగస్వాములతో సమాచారం పంచుకుంటుంది. రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అందులో ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయి. రుణ మాఫీకి సంబంధించి వచ్చిన ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరిస్తారు.

అర్హత లేకుండా రుణమాఫీ పొందితే రికవరీ

అర్హత లేకుండా, మోసపూరితంగా రుణమాఫీ పొందితే రికవరీ చేసే అధికారాన్ని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం అప్పగించింది. రుణమాఫీ అర్హుల వివరాలను బ్యాంకులు ఎలాంటి పొరపాట్లు లేకుండా, సమగ్రంగా డిజిటల్ సంతకాలతో వ్యవసాయ శాఖకు పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. వీరు బ్యాంకులకు, ఎన్ఐసీకి మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ క్రమంలో బ్యాంకులు సైతం పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘించిన బ్యాంకర్లపై సైతం చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేసింది.

ఆర్ఎంపీ వైద్యం వికటించి బాలుని మృతి..?

- సోషల్ మీడియాలో దుమారం
- సుమోటోగా ఫిర్యాదు స్వీకరించిన జిల్లా వైద్య మండలి
- వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో ఘటన

నవతెలంగాణ-నెక్కొండ

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండ గ్రామంలో ఓ ఆర్ఎంపీ వైద్యుడి వైద్యం వికటించి ఓ పదేండ్ల బాలుడు మృతి చెందినట్టు సోషల్ మీడియాలో దుమారం రేగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ముదిగొండకు చెందిన కోటేశ్వర్-సరిత దంపతుల కుమారుడు మణిదీప్(10) హసన్‌పర్తిలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులంలో ఐదో తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం జ్వరంతో మణిదీప్ ఇంటికి వచ్చినట్టు తల్లిదండ్రులు చెబుతున్నారు. సోమవారం ఉదయం బాలుడు అస్వస్థతతో ఇంట్లోనే పడిపోయాడని, ఒంటిపై దద్దుర్లు వచ్చాయని, వైద్యం కోసం ఎంజీఎంకు తరలించగా వైద్యులు పరీక్షించి మరణించినట్టు చెప్పారని కుటుంబ సభ్యులు చెబుతూ బోరున విలపించారు. బాలుని మృతిలో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని నెక్కొండ ఎస్ఐ మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ రవి పరిశీలించారు. కాగా, బాలుడు వారం క్రితం



కుక్కకాటుకు గురికాగా వ్యాక్సిన్ వేయిస్తున్న క్రమంలో గ్రామంలోని ఆర్ఎంపీ అశోక్ ఇంజక్షన్ వేయడంతోనే బాలుడు అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడని, వెంటనే బాలుడిని ఎంజీఎంకు తరలించగా మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతోంది. దాంతో జిల్లా వైద్య మండలిని విచారణకు ఆదేశించినట్టు వైద్య మండలి చైర్మెన్ డాక్టర్ మహేష్‌కుమార్, రిజిస్ట్రర్ లాలాయ్య ఆదేశాలు జారీ చేశారు. ఆరుగురు సభ్యులతో కూడిన వైద్య బృందం బాలుని కుటుంబాన్ని పరామర్శించడంతోపాటు వైద్యం చేసిన ఆర్ఎంపీ వైద్యుని ఆస్పత్రి, చికిత్సలపై నివేదిక సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది. బృందం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయని రిజిస్ట్రర్ లాలయ్య తెలిపారు.

కాళ్లకు తిమ్మిర్లు వస్తున్నాయని వెళ్తే...

- ఆపరేషన్ అనంతరం మహిళ మృతి
- ఆస్పత్రి ముందు బంధువుల ఆందోళన

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

కాళ్ల నరాల సమస్యతో ఆస్పత్రికొచ్చిన మహిళ ఆపరేషన్ అనంతరం పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటన హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని వెల్‌నెస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం జరిగింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం కృష్ణాపూర్ నివాసి విష్ణువర్ధన్‌రెడ్డి భార్య జయశ్రీ(35) కాళ్లకు తిమ్మిరి వస్తుందని మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రిలో చూపించుకుంది. నరాల వ్యాధితో బాధపడుతుందని తెలియగా.. మొదట అపోలో ఆస్పత్రికి రిఫర్ చేశారు. అనం తరం ఇన్సూరెన్స్ ఏజెంట్లు, వెల్నెస్ సెంటర్ ఆస్పత్రి యాజమాన్యం అమీర్‌పేట్‌లోని వెల్నెస్ హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆమెను ఆస్పత్రిలో అడ్మిట్ చేయగా, ఆదివారం సాయంత్రం ఆపరేషన్


(ఫైల్)

చేశారు. అనంతరం ఐసీయూకు తరలించారు. ఇదిలా ఉండగా, సోమవారం ఉదయం ఆమె మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆరోగ్యంగా వచ్చిన మహిళను డాక్టర్ల నిర్లక్ష్యంతో చంపేశారని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు, భర్త ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. అయితే, యాజమాన్యం వారితో చర్చలు జరిపి, అంబులెన్స్ ఇచ్చి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించింది. బాధితులు ఎలాంటి ఫిర్యాదూ చేయలేదని ఎస్ఆర్ నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అఖిల తెలిపారు. జయశ్రీ మృతికి గల కారణాలు తెలియరాలేదు.



పిరామిల్ పరిశ్రమలో సీఐటీయూ జయకేతనం

15 ఓట్ల మెజార్టీతో చుక్కరాములు గెలుపు

ఎన్నికల వరకే రాజకీయం.. ఆ తర్వాత కార్మికులందరూ సమానమే

వారందరి సంక్షేమానికి కృషి : చుక్క రాములు


నవతెలంగాణ-జహీరాబాద్, కోహిర్

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం దిగ్వాల్‌లోని పిరామిల్ ఫార్మా కంపెనీ కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ జయకేతనం ఎగురవేసింది. పరిశ్రమలో మొత్తం 137 ఓట్లు ఉండగా.. అందులో సీఐటీయూ తరపున నిలబడిన సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములుకు 68 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థికి 53 ఓట్లు రావడంతో 15 ఓట్ల మెజార్టీతో చుక్క రాములు గెలుపొందారు. దాంతో రాష్ట్రంలోనే మెజార్టీ పరిశ్రమల్లో ఎన్నికైన నాయకుడిగా చుక్క రాములు గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. గెలిచినా, ఓడినా కార్మికుల పక్షానే నిలబడుతామని తెలిపారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు ఉంటాయని.. ఎన్నికల అనంతరం పరిశ్రమలోని కార్మికులందరూ సమానమేనని అన్నారు. ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన ప్రతి హామీనీ నిలబెడుతామని కార్మికులకు హామీ ఇచ్చారు. కాగా సీఐటీయూ విజయకేతనం ఎగరవేయడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

రాజ్యసభలో 86కు తగ్గిన బీజేపీ బలం

మిత్రపక్షాలతో కలిపి 101 మంది మద్దతు

ఇతరుల సాయంతో బిల్లులు గట్టెక్కే అవకాశం



న్యూఢిల్లీ : రాజ్యసభలో బీజేపీ బలం మరింత తగ్గిపోయింది. ఆ పార్టీ పక్షాన ఉన్న నలుగురు నామినేటెడ్ సభ్యుల పదవీకాలం శనివారం ముగిసింది. దీంతో పెద్దల సభలో బీజేపీ బలం 86కు పడిపోయింది. దీంతో ఎన్డీఏ సభ్యుల సంఖ్య కూడా 101కి తగ్గింది. సభలో ప్రస్తుతం 226 మంది సభ్యులు ఉన్నారు. 19 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అయితే ఏడుగురు నామినేటెడ్ సభ్యులు, ఇద్దరు స్వతంత్రులు, అన్నా డీఎంకే, వైసీపీ వంటి స్నేహపూర్వక పార్టీల మద్దతు ఉన్న కారణంగా రాబోయే బడ్జెట్ సమావేశాల్లో కీలక బిల్లులు ఆమోదం పొందే అవకాశం ఉంది.

నామినేటెడ్ కేటగిరీలో ఖాళీగా ఉన్న స్థానాలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేస్తే బీజేపీకి మిత్రులు, ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. నామినేటెడ్ సభ్యులు రాకేష్ సిన్హా, రాం షకల్, సోనాల్ మాన్‌సింగ్, మహేష్ జెత్మలానీ శనివారం పదవీవిరమణ చేశారు. రాజ్యసభకు నామినేట్ అయిన తర్వాత వీరు బీజేపీకి చేరువయ్యారు. నామినేటెడ్ సభ్యుడైన గులాం అలీ కూడా బీజేపీకే మద్దతు ఇస్తున్నారు. ఆయన 2028 సెప్టెంబరులో రిటైర్ అవుతారు.

ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి 12 మంది సభ్యులను ఎగువ సభకు నామినేట్ చేస్తారు. వీరిలో ఏడుగురు సభ్యులు బీజేపీతో జట్టు కట్టనప్పటికీ తీర్మానాలు, బిల్లులు ఆమోదం పొందే సమయంలో పాలక పక్షం వైపే ఉంటారు. ప్రస్తుతం సభలో ఖాళీగా ఉన్న 19 స్థానాల్లో జమ్ముకాశ్మీర్ నుండి నాలుగు, నామినేటెడ్ స్థానాలు నాలుగు, అస్సాం, బీహార్, మహారాష్ట్ర నుండి రెండు చొప్పున, హర్యానా, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర నుండి ఒక్కో స్థానం చొప్పున ఉన్నాయి. జమ్ముకాశ్మీర్ మినహా మిగిలిన 8 రాష్ట్రాలకు చెందిన 11 స్థానాలు గత నెలలో ఖాళీ అయినవే. వీరిలో 10 మంది లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు చెందిన కె. కేశవరావు గత నెలలో రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు.

రాజ్యసభలో మొత్తం స్థానాల సంఖ్య 245. ఖాళీగా ఉన్న 19 స్థానాలు పోను ప్రస్తుతం సభలో 226 మంది సభ్యులు ఉన్నారు. మెజారిటీకి 114 సీట్లు అవసరం కాగా ఎన్డీఏకు 101, ప్రతిపక్ష ఇండియా కూటమికి 87 మంది సభ్యులు ఉన్నారు. అధికార, ప్రతిపక్ష కూటములకు దూరంగా ఉన్న సభ్యుల సంఖ్య 29. ఎన్డీఏకు ఇద్దరు స్వతంత్రులు, ఏడుగురు నామినేటెడ్ సభ్యుల మద్దతు ఉంది. పార్టీల వారీగా చూస్తే బీజేపీకి 86, కాంగ్రెస్‌కు 26, తృణమూల్ కాంగ్రెస్‌కు 13, వైఎస్సార్‌సీపీకి 11, ఆప్‌కు 10, డీఎంకేకు 10, బీజేడీకి 7, ఆర్జేడీకి 5, బీఆర్ఎస్, సీపీఐ (ఎం), జేడీయూ, అన్నా డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలకు నాలుగు చొప్పున, జేఎంఎంకు 3, స్వతంత్రులు 3, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), ఎన్సీపీ (శరద్ పవార్), ఎన్సీపీ, సీపీఐ, ఐయూఎంఎల్ పార్టీలకు రెండు చొప్పున స్థానాలు ఉన్నాయి. 13 పార్టీల నుండి ఒక్కొక్కరు చొప్పున ఎగువ సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరితో పాటు ఏడుగురు నామినేటెడ్ సభ్యులు కూడా ఉన్నారు.

గత నెలలో ఖాళీ అయిన 11 స్థానాలకు రాబోయే నెలల్లో ఎన్నికలు జరుగుతాయి. వీటిలో ఎన్డీఏకు 8, ఇండియా కూటమికి 3 స్థానాలు లభిస్తాయి. కాంగ్రెస్‌కు తెలంగాణ నుండి ఒక స్థానం దక్కుతుంది. దీంతో ఆ పార్టీ బలం 27కు పెరుగుతుంది. రాజ్యసభలో ప్రతిపక్ష నేత హోదాను నిలుపుకోవాలంటే ఆ పార్టీకి 25 స్థానాలు ఉంటే చాలు.

గుజరాత్ బొగ్గు గనిలో ముగ్గురు మృతి

- ఊపిరాడక చనిపోయిన కార్మికులు
- పరారీలో గని యజమానులు

గాంధీనగర్ : గుజరాత్‌లోని అక్రమంగా నిర్వహిస్తున్న ఒక బొగ్గు గనిలో ముగ్గురు కార్మికులు చనిపోయారు. గనిలోపల కార్మికులకు తగినంతగా ప్రాణవాయువు లభించకపోవటంతో ఊపిరాడక ప్రాణాలు విడిచారు. శనివారం రాత్రి ఈ ఘటన జరగగా.. మృతులను ఆదివారం బయటికి తీశారు. అయితే ఆ గనిలో పనిచేసే కార్మికులకు భద్రత విషయంలో గని యజమానులు నిర్లక్ష్యం వహించారనీ, దీంతో కార్మికులు తమ విలువైన ప్రాణాలను కోల్పోయారని పోలీసులు తెలిపారు. గుజరాత్ లోని సురేంద్ర నగర్ జిల్లా, థంగడక తాలూకా భేట్ గ్రామంలో ఉన్న బొగ్గు గనికి అనుమతి లేకుండా చట్టవ్యతిరేకంగా బొగ్గు తవ్వకాలు చేస్తున్నారని బొగ్గు గనికి సంబంధించిన నలుగురు యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బొగ్గు గని యజమానులంతా ప్రస్తుతం పరారీలో ఉన్నారు. గని యజమానులు జషాభాయ్ కేరాలియా, జనక్ అనియారియా, ఖీమ్ జీ భాయ్ సరాదియా, కల్పేష్ పర్మార్‌పై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. బొగ్గు గనిలో పనిచేసే లక్ష్మణ్ దాభి(35), ఖోడా భాయ్ మక్వానా(32) , విక్రమ్ కెరాలియా (35) శనివారం గనిలోపల పనిచేసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. గనిలోపల ప్రమాదకర గ్యాస్‌ని పీల్చుకున్నారనీ, వారికి గనిలో ఆ ప్రదేశంలో సరిపడా ప్రాణవాయువు లభించపోవటంతో ఈ దుర్ఘటన జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. గనిలో పనిచేసే కార్మికుల భద్రత కోసం ఎటువంటి హెల్మెట్లు, మాస్క్ లు ఇచ్చేవారు కాదని తెలిసింది. చనిపోయిన నలుగురు కార్మికుల మృతదేహాలు పోస్ట్-మార్టం కోసం పంపించారు. ఫిబ్రవరి నెలలో కూడా ముగ్గురు గని కార్మికులు జెలటిన్ బాంబు పేలి ఆ గ్యాస్ పీల్చుకోవడంతో చనిపోయారు. దీంతో రాష్ట్రంలోని గనుల్లో పని చేసే కార్మికుల భద్రత పట్ల ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్మికుల సంక్షేమం విషయంలో గనుల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మతోన్మాదుల అకృత్యాలను ప్రతిఘటించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ
- రాష్ట్రంలో దళితులపై పెరుగుతున్న దౌర్జన్యాలు : కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి. స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-సుబేదారి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారినప్పటికీ దళితుల బతుకులు మాత్రం మారడం లేదని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు అన్నారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రావడంతో ప్రజలు, దళితులపై అకృత్యాలు పెరుగుతాయని, వాటిని సామాజిక శక్తులు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా విద్యుత్ భవన్‌లో సోమవారం ప్రారంభమైన కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణా తరగతుల్లో జాన్‌వెస్లీ జెండా ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ పాలనతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై 300 రెట్లు దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని నీరుగార్చేలా వ్యవహరించిందన్నారు. దేశంలో 20శాతం ఉన్న దళితుల సంక్షేమానికి జనాభా దామాషాలో నిధులు కేటాయించలేదని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా వివక్ష పాటించిందన్నారు. ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పినప్పటికీ.. దేశ ప్రజలు సంఘటితంగా మతోన్మాదులను ప్రతిఘటించలేకపోవడం వల్ల దాని ప్రమాదం మరింత పొంచి ఉందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైందని, దళితుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే దళితులపై దాడులు పెరిగాయని అన్నారు. చట్టాలు అమలు చేయాల్సిన స్థానంలో ఉన్న ఒక దళిత ఎస్ఐ ఆత్మహత్య చేసుకునే దుస్థితి నెలకొందన్నారు. దానిమ్మ చెట్టును ముట్టుకున్నాడని దళిత మైనర్ బాలుడిని కట్టేసి కొట్టి కులం పేరుతో దూషించిన సంఘటన రాష్ట్రంలో జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం దళిత బంధువు ఇస్తే అది అవినీతిమయమైందని చెప్పిన కాంగ్రెస్, తాము మేము అధికారం చేపడితే రూ.12 లక్షలతో అంబేద్కర్ బంధు ప్రవేశపెడతామని చెప్పిన హామీ ఏమయిందని ప్రశ్నించారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. శిక్షణా తరగతులకు కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంద సంపత్, నందిపాటి మనోహర్, ఆరూరి కుమార్, దయ్యాపు రాధాకృష్ణ, టి సురేష్, కోట గోపి, మస్కు ప్రకాష్ కరత్, పల్లేర్ల లలిత, డి రామ్మూర్తి, దుర్గం దినకర్, హన్మకొండ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలెందుకు పంక్చర్ షాప్ పెట్టుకోండి

బీజేపీ ఎమ్మెల్యే



భోపాల్: డిగ్రీలతో ఏం ఉపయోగం లేదని, పంక్చర్ షాప్ తెరుచుకోండని ఓ బీజేపీ ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. ఈ ఘటన బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. గుణ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే పన్నాలాల్ షాక్యా ఆదివారం 'పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 'మేం ఈ రోజు పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తున్నాం. ఈ కాలేజీ డిగ్రీలతో ఏం ప్రయోజనం లేదు. నేను ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. డిగ్రీలకు బదులుగా, జీవనోపాధి కోసం కనీసం మోటార్‌సైకిల్ పంక్చర్ రిపేర్ షాప్‌ను తెరవండి' అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కాగా బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి.

ఎమర్జెన్సీలో తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తారా..?

బీజేపీ ప్రభుత్వానికి తమిళనాడు సీఎం స్టాలిన్ సూటి ప్రశ్న



చెన్నై : ఎమర్జెన్సీ సమయంలో విద్యపై కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తారా.. అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోమవారం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. విద్య అంశాన్ని రాష్ట్ర జాబితాలో నుంచి ఉమ్మడి జాబితాలోకి మార్చిన నిర్ణయాన్ని ఉపసంహరించుకునేందుకు ఇప్పటి బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తుందా అని స్టాలిన్ ప్రశ్నించారు. సోమవారం తిరువళ్లూరు జిల్లాలోని కీజాచేరిలో సెయింట్ అన్నస్ ప్రైమరీ స్కూల్‌లో తమిళ నాడు ప్రభుత్వ పథకమైన ముఖ్యమంత్రి అల్పాహార పథకం విస్తరణ ప్రారంభోత్స కార్యక్రమంలో ఎంకె స్టాలిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ ప్రసంగిస్తూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో విధించిన ఎమర్జెన్సీపై ఇప్పటికీ తీవ్రస్థాయిలో బీజేపీ చేస్తున్న విమర్శలను ప్రస్తావించారు. 'ఎమర్జెన్సీపై తీవ్ర స్థాయిలో అన్ని విమర్శలు చేస్తున్న బీజేపీ.. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసం హరించుకుని విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు మార్చడానికి ముందుకు వస్తుందా?' అని స్టాలిన్ ప్రశ్నించారు. అలాగే, నీట్‌ను తీవ్రంగా వ్యతిరేంచే తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని స్టాలిన్ మరోసారి పునరుద్ఘాటించారు. 'ఆకలిగా ఉండటం లేదా నీట్ అనేదే కేంద్ర ప్రభుత్వ యొక్క నూతన విద్యా విధానం. ఇలాంటి అడ్డంకులను ఛేదించడమే తమ ప్రాథమిక లక్ష్యం' అని స్టాలిన్ తెలిపారు. తమిళనాడు బాటలో ఇప్పుడు దేశం యావత్తు కూడా నీట్‌ను వ్యతిరేకిస్తుందని స్టాలిన్ గుర్తు చేశారు. కాగా, ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని విస్తరించడం ద్వారా రాష్ట్రం మొత్తంగా ఉన్న 3,995 ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లోని 2.23 లక్షల మంది చిన్నారులకు కూడా లబ్ధి కలుగుతుంది. ప్రస్తుతం పథకం ద్వారా రాష్ట్రంలోని 30,992 ప్రభుత్వ పాఠశాలల్లోని ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చదువుతున్న 18.50 లక్షల మంది చిన్నారులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి కె.కామరాజ్ జయంతి రోజున విస్తరించడం ద్వారా ఆయన్ను సత్కరిస్తున్నట్టు స్టాలిన్ సోషల్ మీడియా పోస్టు ద్వారా తెలిపారు.

అదేవిధంగా, సోమవారం రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన 10 కొత్త బస్సులను కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరువళ్లూరు ఎంపీ శశికాంత్ సెంథిల్, ఎమ్మెల్యేలు విజి రాజేంద్రన్, ఎస్ చంద్రన్; ఎస్ ఇనిగో ఇరుదయరాజ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ దాస్ మీనా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రైతుల డిమాండ్లపై నేటి నుంచి ఎంపీలకు వినతులు

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను సి2 ప్లస్ 50 శాతం ప్రాతిపదికన ఇచ్చేందుకు చట్టబద్ధత కల్పించాలనీ, పంటలను గ్యారెంటీగా సేకరించాలనే డిమాండ్లపై మంగళవారం నుంచి ఈ నెల 18 వరకు లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు వినతిపత్రాలు ఇవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు కన్వీనర్లు సోమవారం టి.సాగర్, పశ్య పద్మ, పి.ప్రభాకర్, పెద్దారపు రమేష్, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, కొండల్, మామిడాల భిక్షపతి, ఆర్ వెంకట్రాములు, ఎస్ బాల మల్లేశ్, పి రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. 'అన్ని పంటలకు గ్యారెంటీ సేకరణతో సి2ప్లస్50 శాతంతో కూడిన ఎంఎస్‌పీ చట్టబద్ధంగా హామీ ఇవ్వాలి. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణభారం నుండి విముక్తి కల్పించి రైతు ఆత్మహత్యలకు ముగింపు పలకడానికి సమగ్ర రుణమాఫీ చేయాలి. విద్యుత్ రంగం ప్రయివేటీకరణ ఆపాలి. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు. ప్రభుత్వ రంగం కింద అన్ని పంటలకు, పశుపోషణకు సమగ్ర బీమా కవరేజీ ఇవ్వాలి. రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పీఎంఎఫ్‌బీవై పథకాన్ని సవరణ చేయాలి. రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.10 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలి. భూసేకరణ, పునరావాస చట్టం-2013ను అమలు చేయాలి. దేశం అంతటా ప్రతి సంవత్సరం భూమి సర్కిల్ రేటును సవరించాలి. ప్రభుత్వ, ప్రయివేట్ రంగం ప్రాజెక్టుల కోసం అక్రమంగా సేకరించడం వల్ల భూమిని కోల్పోయిన వారందరికీ తగిన పరిహారం అందించాలి. బుల్డోజర్ రాజ్‌కు ముగింపు పలకాలి. ముందస్తు పునరావాస ఏర్పాట్లు చేయకుండా మురికివాడల, నివాసాల కూల్చివేతను ఆపాలి.

వ్యవసాయంలో కార్పొరేటీకరణ ఆపాలి. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యంలో బహుళజాతి కంపెనీలు వద్దు. వ్యవసాయంపై డబ్ల్యూటీవో ఒప్పందం నుండి భారత్ బయటకు రావాలి. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, విద్యుత్, నీటిపారుదల, పెట్రోలియం ఉత్పత్తులు, యంత్రాలు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ ఇన్‌పుట్‌లపై జీఎస్‌టీ ఆపాలి. రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాల ప్రకారం పన్ను విధించే రాష్ట్ర ప్రభుత్వాల హక్కును నిర్ధారించడానికి జీఎస్‌టీ చట్టాన్ని సవరించాలి. జీడీపీలో తగిన వాటాతో వ్యవసాయం కోసం ప్రత్యేక కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి.

కేంద్ర ప్రభుత్వంలో సహకార మంత్రిత్వశాఖను రద్దు చేయాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా సహకారాన్ని రాష్ట్ర అంశంగా ఉంచాలి. ఉత్పత్తి వర్గాలైన రైతులు, కార్మికుల ఖర్చుతో కార్పొరేట్ వర్గ ప్రయోజనాల కోసం అధికార కేంద్రీకరణను ప్రోత్సహించే బదులు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మద్దతు ఇవ్వాలి. వన్యప్రాణుల ముప్పు కోసం శాశ్వత పరిష్కారాన్ని నిర్ధారించాలి.

ప్రాణ నష్టానికి పరిహారంగా రూ.1 కోటి, పంటలు, పశువుల నష్టానికి తగిన పరిహారం అందించాలి. లఖింపూర్ ఖేరీ అమరవీరులతో సహా చారిత్రాత్మక రైతుల పోరాట అమరవీరుల కుటుంబాలకు పరిహారం అందించాలి. రైతుల పోరాటానికి సంబంధించిన అన్ని కేసులనూ ఉపసంహరించుకోవాలి. 736 మంది రైతు అమరవీరుల స్మారకార్థం సింగు, టిక్రీ సరిహద్దుల్లో అమరవీరుల స్మారకాన్ని నిర్మించాలి'అని డిమాండ్ చేస్తూ ఎంపీలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్టు తెలిపారు.

గిరిజన టీచర్లు, సిబ్బంది రిక్రూట్‌మెంట్ తీరును మార్చాలి

ఆదివాసీల సంస్కృతి, స్థానిక భాష తెలిసిన వారికే ఉద్యోగాలివ్వాలి : కేంద్రమంత్రికి బృందాకరత్ లేఖ



న్యూఢిల్లీ : గిరిజన విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసేలా వున్న ఇఎంఆర్ పాఠశాలల్లోని ప్రస్తుత కేంద్రీకృత రిక్రూట్‌మెంట్ ప్రకియలను మార్చే విషయంలో జోక్యం చేసుకోవాలని, తక్షణమే వాటిని మార్చాలని సీపీఐ(ఎం) కోరింది. ఈ మేరకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జ్యూయల్ ఓరమ్‌కు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ సోమవారం లేఖ రాశారు. గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలు, ముఖ్యంగా స్థానిక భాష తెలిసిన వారిని మాత్రమే అక్కడ రిక్రూట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

దేశవ్యాప్తంగా ఇఎంఆర్ పాఠశాలల్లో చదువుతున్న ఆదివాసీ విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆదివాసీ విద్యార్థులకు ఉత్తమ విద్యా పద్ధతులను, అవకాశాలను అందించేందుకు ఈ పాఠశాలలు ఉద్దేశించబడ్డాయి. ఆదివాసీ సంస్కృతులు, వారి భాషలు, అవసరాలను అర్థం చేసుకోవడానికి బోధనా సిబ్బంది నిబద్ధతతో, సున్నితత్వంతో పనిచేయడం ఎంతో అవసరం. కానీ దురదృష్టవశాత్తూ, ఈ ఇఎంఆర్ స్కూళ్ళ బోధనా, బోధనేతర సిబ్బంది అలాగే ప్రిన్సిపాల్ పదవులను భర్తీ చేయడానికి ప్రస్తుతం అనుసరిస్తున్న రిక్రూట్‌మెంట్ పద్ధతి లోపభూయిష్టంగా వుందని బృందాకరత్ ఆ లేఖలో పేర్కొన్నారు. దీన్ని సవరించని పక్షంలో ఈ పాఠశాలలు ఎందుకోసం ఏర్పాటు చేశారో ఆ ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జాతీయ గిరిజన విద్యార్థుల విద్యా సొసైటీ (ఎన్‌ఈఎస్‌టీఎస్) అనుసరిస్తోన్న కొత్త రిక్రూట్‌మెంట్ పద్ధతి గురించి ఆమె ప్రస్తావించారు. గతంలో రిక్రూట్‌మెంట్‌ను రాష్ట్ర అధికారులు జరిపేవారు. రాబోయే ఐదేండ్లలో ఈఎంఆర్ పాఠశాలలకు 38వేల మంది సిబ్బందిని కేంద్ర సంస్థ ఎన్‌ఈఎస్‌టీఎస్ రిక్రూట్ చేస్తుందని గత బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆదివాసీల సంస్కృతులు గురించి ఎవరికీ అవగాహన వుండనవసరం లేని రీతిలో ఈ కేంద్రీకృత పరీక్షను రూపొందించారు. పైగా ఆశ్చర్యం గొలిపే రీతిలో ఈ పరీక్ష రాసే అభ్యర్థులందరికీ ఇంగ్లీషు, హిందీల్లో ప్రావీణ్యత వుండడం తప్పనిసరి చేశారు కానీ రాష్ట్ర భాష గురించి అస్సలు పట్టించుకోకపోవడం విచారకరం. ఇక ఆదివాసీల కమ్యూనిటీల గురించి అస్సలు తెలియదు. రాష్ట్ర భాషను ఎందుకు ఇంతలా నిర్లక్ష్యం చేస్తున్నారు? ఆదివాసీ సంస్కృతులు, భాషల గురించి తెలిసి వుండాల్సిన నిబంధనలు ఎందుకు చేర్చలేదు? దక్షిణ లేదా తూర్పు, ఈశాన్య భారతాలకు చెందిన రాష్ట్రాల్లో మాట్లాడే భాష కాని హిందీని ఎందుకు రాష్ట్రాలపై రుద్దుతున్నారు? పైగా రిక్రూట్ అయినవారు రెండేళ్ళలోగా స్థానిక భాష నేర్చుకోవాలని కోరుతున్నారు. ఇది సాధ్యమేనా? ఒకవేళ సాధ్యమైతే పిల్లలకు విద్య నేర్పేటపుడు భాషే ప్రధాన అడ్డంకిగా మారుతున్నందున ఈ రెండేళ్ళలో జరిగిదేమిటి? నిజానికి, తమది కాని భాషకు సర్దుకుపోవాల్సిన పరిస్థితి పిల్లలకు ఏర్పడుతోంది. వారు నేర్చుకునే క్రమంలో అనేక తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటారు.

ఈఎంఆర్‌లు తరచుగా మారుమూల ప్రాంతాల్లో వుంటాయి. దీనివల్ల స్థానికేతరులైన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఏదో ఒక సాకుతో పాఠశాలలకు గైర్హాజరయ్యే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. ఇప్పటికే ఇది అనుభవంలోకి వచ్చింది. పైగా ఇలా రిక్రూట్ అయినవారిలో ఎక్కువమంది తమ స్వస్థలాలకు, తమ కుటుంబాలకు దగ్గరగా వుండే ప్రాంతాలకు బదిలీ చేయించుకోవాలని కోరుకుంటారు. నిజానికి, ఇలా బదిలీల కోసం చాలా అభ్యర్థనలు వచ్చాయని, అందువల్ల పోస్టింగ్‌లు ఇచ్చిన అభ్యర్థులందరూ తమ పోస్టింగ్‌ను మార్చాలని కోరుతూ ఎన్‌ఈఎస్‌టీఎస్ ఆఫీసుకు రావద్దని గిరిజన వ్యవహారాల వెబ్‌సైట్‌లోనూ మరీ ముఖ్యంగా ఎన్‌ఈఎస్‌టీఎస్ వెబ్‌సైట్‌లోనూ పేర్కొన్నారు. ప్రస్తుతం, పోస్టింగ్ మార్చాలని కోరుతున్న అభ్యర్థనలు వేటినీ పరిగణించడం లేదు. ఇది కాకుండా, ఒకవేళ జరిగితే బదిలీలు ఎన్‌ఈఎస్‌టీఎస్ వెబ్‌సైట్‌లోని ట్రాన్స్‌ఫర్ పోర్టల్ ద్వారా జరిగాలి. బదిలీ విధానం రూపొందించిన తర్వాత ఈ పోర్టల్ అందుబాటులోకి రావాలి. విద్యార్థుల ప్రయోజనాలకు హామీ కల్పించేందుకు అత్యుత్తమమైన మార్గం ఏమంటే, ఈఎంఆర్ స్కూళ్ళలోని బోధన, భోదనేతర సిబ్బందికి కచ్చితంగా విద్యార్థులు మాట్లాడే భాష తెలిసి వుండాలి. విద్యార్థులు నివసించే సాంస్కృతిక సమాజ కట్టుబాట్లు, ఆచార, సాంప్రదాయాలు తెలిసి వుండాలని బృందాకరత్ ఆ లేఖలో సూచించారు. అందువల్ల స్థానికులను మాత్రమే రిక్రూట్ చేసుకునే విషయాన్ని పరిశీలించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దీనికి సంబంధించిన ఉదాహరణ వుంది. గుణపాఠం కూడా వుంది. ఉమ్మడి ఆంధ్రాలో గిరిజనుల ప్రాబల్యం గల ప్రాంతాల్లో రెగ్యులర్ అటెండెన్స్‌కు, బోధనకు ఎస్‌టీ టీచర్లకు వంద శాతం రిజర్వేషన్ వుంది. జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని సుప్రీం బెంచ్ దీని కొట్టివేయడంతో, రిక్రూట్‌మెంట్ నిబంధనలను మార్చడంతో ఎస్‌టీయేతర కమ్యూనిటీలకు చెందిన కొత్తగా రిక్రూట్ అయినవారు స్కూళ్ళకు రెగ్యులర్‌గా వెళ్ళలేదని తేలింది. దానివల్ల పిల్లలు బాగా ఇబ్బందులు పడ్డారు. జెఎస్‌ఎల కోసం తెలంగాణాలో గల ఖాళీల్లో ఎన్‌ఈఎస్‌టీఎస్ కేంద్రీకృత రిక్రూట్‌మెంట్ పద్ధతి వల్ల 47మందిని నియమిస్తే 44మంది హర్యానా రాష్ట్రానికి చెందినవారే వున్నారు. ఒక్కరు కూడా తెలంగాణాకు చెందినవారు లేరు. తెలంగాణాకు చెందినవారికి హిందీలో ప్రావీణ్యత లేకపోవడమే కారణం. కానీ తెలుగులో వారికి వున్న ప్రావీణ్యత ఏ దశలోనూ ఎక్కడా పరిగణనలోకే తీసుకోలేదు. అందువల్ల ప్రస్తుతం అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ ఫెడరల్ స్వభావంపై దాడి చేయడమే కాకుండా ఈఎంఆర్‌ల ప్రయోజనాలనే దెబ్బతీస్తున్నాయని బృందా కరత్ ఆ లేఖలో పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు సాయం చేయడానికి ఈఎంఆర్‌లు చాలా ముఖ్యమైన సంస్థ. అయితే, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ప్రస్తుతమున్న రిక్రూట్‌మెంట్ పద్ధతిని మార్చాల్సిన అవసరం వుందని బృందాకరత్ స్పష్టం చేశారు. ఈ అంశంపై తగిన రీతిలో దృష్టి సారించి తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆమె కోరారు.

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిగా కొత్తగా బాధ్యతలు చేపట్టినందుకు అంతకుముందు ఆమె మంత్రికి అభినందనలు తెలియచేశారు.

ఇమ్రాన్ ఖాన్ పార్టీపై నిషేధం ?

- ఆయనతో సహా ముగ్గురిపై కేసులు
- ప్రకటించిన పాక్ సర్కార్

ఇస్లామాబాద్ : జాతి వ్యతిరేక కార్యకలాపాల్లో ప్రమేయమున్నందుకు మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పార్టీపై నిషేధం విధించనున్నట్లు పాక్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశ ద్రోహానికి పాల్పడ్డారంటూ ఆయనపై, ఇద్దరు సీనియర్ పార్టీ సహచరులపై కేసులు బనాయించింది.

విదేశీ నిధుల కేసు, మే 9 అల్లర్లు, సిఫర్ అధ్యాయం, అమెరికా సభలో తీర్మానం ఆమోదించడం ఇవన్నీ చూస్తుంటే ఖాన్ పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ)ని నిషేధించేందుకు విశ్వసనీయమైన సాక్ష్యాధారాలు వున్నాయని విశ్వసిస్తున్నట్లు సమాచార శాఖ మంత్రి అత్తుల్లా తరార్ పత్రికా సమావేశంలో ప్రకటించారు. 2022 ఏప్రిల్‌లో ప్రధాని పదవి నుంచి తప్పించినప్పటి నుండి ఆయనపై నమోదైన పలు కేసుల్లో ఖాన్ రావల్పిండిలోని అడియాలా జైల్లో వున్నారు. ఖాన్‌తో పాటు మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీలపై 6వ అధికరణ కింద కేసులు నమోదు చేసినట్లు జియో న్యూస్ తెలిపింది.

తమ సహనాన్ని, ఓపికను వారు బలహీనతగా పరిగణిస్తున్నారని తరార్ వ్యాఖ్యానించారు. దేశాన్ని రాజకీయంగా,ఆర్థికంగా సుస్థిరపరచాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ తరుణంలో పిటిఐ, పాకిస్తాన్ కలిసి వుండలేవని అన్నారు.పార్టీని నిషేధించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్ వేయనున్నట్లు చెప్పారు.

నవతెలంగాణ

రాజకీయ, ఆర్థిక, విద్యారంగాల్లో నిమ్న జాతులు అభ్యుదయాన్ని సాధించలేకపోతే సాంఘికంగా వారి పతనం తప్పదు - బి.ఆర్ అంబేద్కర్

మంగళవారం 16 జులై 2024
www.navatelangana.com

సంపాదకీయం

శృంగభంగం



సార్వత్రిక ఎన్నికలలో చావుతప్పి కన్ను లొట్టపోయిన బీజేపీకి నిన్నటి ఉపఎన్నికలు మరింత శృంగభంగం కలిగించాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికార ఎన్డీయే, ప్రతిపక్ష ఇండియా బ్లాక్‌కు తొలి పరీక్షగా భావించిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 'ఇండియా బ్లాక్' జయకేతనం ఎగురవేసింది. దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో ఇండియా బ్లాక్ 10 చోట్ల విజయం సాధించి, బీజేపీని రెండు స్థానాలకే పరిమితం చేసింది. మరో చోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. జులై10న పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు, హిమాచల్ ప్రదేశ్‌లోని మూడు, ఉత్తరాఖండ్‌లోని రెండు, పంజాబ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లోని ఒక్కొక్క స్థానానికి ఉపఎన్నిక జరిగిన విషయం విధితమే. శనివారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచే ఇండియా బ్లాక్ అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగారు. ఫిబ్రవరి 27న జరిగిన రాజ్యసభ ఎన్నికలలో హిమాచల్ ప్రదేశ్‌లో ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా అనైతిక విజయం సాధించిన బీజేపీకి ప్రస్తుతం జరిగిన ఉప ఎన్నికలలో ప్రజలు తగిన పాఠం చెప్పారు.

> రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు (హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ, బీహార్) ఒకరకంగా ఇది రిహార్సల్స్‌గా భావించవచ్చు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతిపక్షాలు మరింత ఐక్యంగా వ్యవహరించాలని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అనాలోచిత విధానాల వలన సార్వత్రిక ఎన్నికలలో ఇండియా బ్లాక్ తగిన ఫలితాలు రాబట్టలేకపోయింది. ఈ ఉపఎన్నికలలో వచ్చిన ఫలితాలతోనైనా కాంగ్రెస్ పార్టీ మేల్కొని ప్రతిపక్షాల మధ్య మరింత ఐక్యతకు కృషి చేయాలి. అవసరమైతే ఆ పార్టీ కొన్ని త్యాగాలకు కూడా సిద్ధపడాలి.

ఇందులో నాలుగు రాష్ట్రాల్లో ఇండియా బ్లాక్ అధికారంలో ఉండగా, మూడుచోట్ల ఎన్డీయే ప్రభుత్వం ఉంది. పశ్చిమబెంగాల్‌లో రాయ్‌గంజ్, రాణాఘాట్, బాగ్దా, మాణిక్తలా నాలుగు స్థానాల్లోనూ తృణమూల్ అభ్యర్థులు విజయం సాధించారు. సార్వత్రిక ఎన్నికలలో ఉత్తరాఖండ్‌లో ఐదు ఎంపీ స్థానాలను గెలుచుకున్న కాషాయ పార్టీకి ఇప్పుడు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మంగలౌర్, బద్రీనాథ్ స్థానాలలో కాంగ్రెస్ విజయం సాధించింది. మొన్న అయోధ్యలో...నిన్న బద్రీనాథ్‌లో సైతం కాషాయ పార్టీని ప్రజలు ఓటు ఆయుధంతో తిప్పికొట్టారు. ప్రఖ్యాత హిందూ దేవాలయాలు ఉన్న చోట కూడా బీజేపీ ఓటమిపాలవడం గమనార్హం. ఇది దాని ' హిందూత్వ' భావజాలాన్ని హిందువులు కూడా ఆమోదించడం లేదనడానికి నిదర్శనం. బద్రీనాథ్ కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీలోకి మారారు. ఈ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా ఆయనకి తగిన బుద్ధి చెప్పారు.

తాజాగా ఇద్దరి గెలుపుతో 68 మంది సభ్యులున్న హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 40కి చేరింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 40 సీట్లు నెగ్గి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే రాజ్యసభ ఎన్నికల్లో ఏకంగా ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీకి క్రాస్ ఓటింగ్ వేయడంతో సుఖు ప్రభుత్వాన్ని అస్థిరత వెంటాడింది. లోక్‌సభ ఎన్నికలతో పాటే 6 స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగు నెగ్గింది. ఇప్పుడు మరో రెండు స్థానాలు గెలవడంతో కాంగ్రెస్ బలం మళ్లీ 40కి చేరింది. రాజీనామాచేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్న ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో భారీ మూల్యమే చెల్లించుకున్నారు. దేహ్రాలో సీఎం సతీమణి కమలేశ్ ఠాకుర్ బీజేపీపై విజయం సాధించారు. నాలాగఢ్ స్థానంలో కాంగ్రెస్ గెలుపొందగా... హమీర్‌పూర్ స్థానంలో మాత్రమే బీజేపీ గెలుపొందింది.

పంజాబ్ జలంధర్ స్థానంలో ఆప్ అభ్యర్థి మోహిందర్ భగత్ బీజేపీపై ఏకంగా 37వేల ఓట్ల మెజారిటీతో విజయం నమోదు చేశారు. తమిళనాడులోని విక్రావండి స్థానంలో డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివ విజేతగా నిలిచారు. మధ్యప్రదేశ్‌లోని అమర్వాడాలో బీజేపీ అభ్యర్థి కమలేశ్ షా గెలిచారు. బీహార్‌లోని రూపాలి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి శంక్ సింగ్ జయకేతనం ఎగురవేశారు. మొత్తంగా ఈ ఫలితాలు మసకబారుతున్న "బ్రాండ్ మోడీ" ఇమేజీన్‌ను ఎత్తిచూపుతున్నాయి.

రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు (హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ, బీహార్) ఒకరకంగా ఇది రిహార్సల్స్‌గా భావించవచ్చు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతిపక్షాలు మరింత ఐక్యంగా వ్యవహరించాలని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అనాలోచిత విధానాల వలన సార్వత్రిక ఎన్నికలలో ఇండియా బ్లాక్ తగిన ఫలితాలు రాబట్టలేకపోయింది. ఈ ఉపఎన్నికలలో వచ్చిన ఫలితాలతోనైనా కాంగ్రెస్ పార్టీ మేల్కొని ప్రతిపక్షాల మధ్య మరింత ఐక్యతకు కృషి చేయాలి. అవసరమైతే ఆ పార్టీ కొన్ని త్యాగాలకు కూడా సిద్ధపడాలి. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న సీట్ల సంఖ్యతో నిమిత్తం లేకుండా అన్ని పార్టీలకు సీట్లను కేటాయించాలి. అప్పుడే ఇండియా బ్లాక్ ఓట్లు చీలిపోవు. కేంద్రంలో ప్రస్తుతం ఉన్నది సంకీర్ణ ప్రభుత్వం అన్న మాట మరిచి తన సొంత పార్టీ ప్రభుత్వంగా వ్యవహరిస్తూ మోడీ చేసే ప్రయత్నాలను తిప్పికొట్టే విధంగా ఉద్యమించాలి. మోడీ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాలి. కార్మికులు, రైతులు, దళితులు, గిరిజనులు సమాజంలోని అణగారిన వర్గాలలో చైతన్యానికి కృషి చేయాలి. ప్రతిపక్షం ఐక్యంగా చర్చించి సమష్టి వ్యూహంతో వ్యవహరించకపోతే మోడీ మరింత దుష్పరిపాలన సాగించే అవకాశముందన్న విషయాన్ని కాంగ్రెస్ గమనంలో ఉంచుకోవాలి.

యూరప్‌లో ఫాసిజం దూకుడుకు కళ్లెం



ప్రభాత్ పట్నాయక్

ప్రపంచంలోని చాలా దేశాల్లో ఫాసిస్టు శక్తులు అధికారాన్ని చేపట్టడమో లేక చేపట్టే ప్రమాదం పొంచి వుండడమో ప్రస్తుతకాలంలో మనం చూస్తున్నాం. యూరప్‌లో చాలా దేశాల్లో ఫాసిస్టులు అధికారాన్ని చెలాయి స్తున్నారు. ఈ జాబితాలో ఫ్రాన్స్ దేశం పేరు కూడా చేరే ముప్పు దాదాపు ముంచుకొచ్చేసింది. అదే గనుక జరిగి వుంటే, ఇటలీ తర్వాత ఫాసిస్టు ప్రభుత్వాన్ని కలిగి వుండే రెండో ప్రధాన శక్తిగా ఫ్రాన్స్ అయి వుండేది. అప్పుడు అదొక చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని వుండేది. గతంలో ఫ్రాన్స్‌లో మార్షల్ పెటైన్ నాయకత్వంలో విచీ ప్రభుత్వం అడ్డగోలుగా హిట్లర్‌తో ముఠా కట్టి వ్యవహరించింది. ఆ కాలంలో ఫ్రాన్స్‌ను ఆక్రమించుకున్న నాజీ సైన్యాలను ఫ్రాన్స్‌లోని వామపక్షాలు, కార్మికవర్గం వీరోచితంగా సాయుధ ప్రతిఘటన ద్వారా తిప్పికొట్టాయి. అటువంటి బలమైన కార్మికోద్యమ వారసత్వాన్ని, వామపక్ష వారసత్వాన్ని కలిగి వున్న ఫ్రాన్స్‌లో ఇప్పుడు గనుక మళ్లీ ఫాసిస్టు శక్తుల చేతుల్లోకి అధికారం వచ్చి వుంటే అది అత్యంత విషాదకర సంఘటన అయి వుండేది. అయితే ఆ విధంగా జరగలేదు. ఫాసిస్టు దూకుడుకు ఫ్రాన్స్‌లో కళ్లెం వేశారు. అంతేగాక ఎన్నికల నిర్ణయాత్మక తుది రౌండ్‌లో న్యూ పాపులర్ ఫ్రంట్ (వామపక్ష కూటమి) గెలుపు సాధించింది.

ఫాసిజం ఒక సవాలుగా ముందుకు రావడం అంతగా అంతు పట్టని విషయం ఏమీ కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు బడా పెట్టుబడి తన ఆధిపత్యానికి వచ్చే ముప్పు నుండి తప్పించుకోడానికి ఫాసిస్టు శక్తులతో చేతులు కలుపుతుంది. ఆ ఫాసిస్టు శక్తులు ప్రజల దృష్టిని ప్రధాన సమస్యల నుండి పక్కకు మళ్ళించి ఏదో ఒక నిస్సహాయ స్థితిలో ఉన్న మైనారిటీ తరగతి ప్రజలకు వ్యతిరేకంగా తక్కినవారిలో ద్వేషాన్ని రెచ్చగొడుతుంది. ప్రజల దృష్టిని ఆవిధంగా పక్కకు మళ్లించడం ద్వారా బడా పెట్టుబడి తన పెత్తనాన్ని కాపాడుకుంటుంది, తన దోపిడీని కూడా మరింత ముమ్మరం చేస్తుంది.

1930 దశకంలో మహా మాంద్యం కాలంలో జరిగింది ఇదే. ప్రస్తుతం నయా ఉదారవాద విధానాలు ఆర్థిక వ్యవస్థను ఒక సుదీర్ఘ మాంద్యంలోకి, సంక్షోభంలోకి నెట్టాయి. 2008 నాటికి యూరప్ దేశాల్లో సగటున ఒక కుటుం బం తన ఆదాయంలో వెచ్చించగలిగిన సొమ్ముతో పోల్చితే 2023 నాటికి అది కేవలం 6.4 శాతం మాత్రమే పెరిగింది. ఈ పెరుగుదల చాలా తక్కువ. పైగా ఇందులో అతి ధనవంతుల ఆదాయాలు కూడా కలిసి వుంటాయి. ఈ కాలంలో ధనిక పేదల నడుమ ఆదాయాల అంతరాలు బాగా పెరిగాయి. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నప్పుడు సామాన్యుల కుటుంబ ఆదాయాల్లో పెరుగుదల దాదాపు లేనట్టే అనుకోవాలి. అంతేగాక చిన్న పెట్టుబడిదారుల సంస్థల్లో ఉపయోగించే యంత్రాల, పరికరాల అరుగుదలను (దానిని డిప్రిసియేషన్‌గా లెక్కిస్తారు) ఈ లెక్కలు పరిగణనలోకి తీసుకోలేదు. చాలా పరిశ్రమలు పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో పని చేయగలిగిన స్థితి లేదు. దానికి మాంద్యం కారణం. అందుచేత ఆ డిప్రిసియేషన్ కూడా ఎక్కువగానే ఉంటుంది. అప్పుడు ఆ చిన్న, మధ్య తరహా పరిశ్రమల యజమానుల కుటుంబాల ఆదాయాలు కూడా నికరంగా తగ్గుతాయి. మొత్తంగా అతి సంపన్నుల కుటుంబ ఆదాయాలు మినహా తక్కినవారి నిజ ఆదాయాలలో పెరుగుదల ఏమీ లేదని బోధపడుతోంది. ఇటువంటి పరిస్థితులను అనుభవించవలసి వస్తున్నందుకు ప్రజల్లో ఆగ్రహం పెరుగుతుంది. ఈ ఆగ్రహాన్ని ఫాసిజం అదే ప్రజల్లోన్ని ఒక మైనారిటీ భాగం మీదకు మళ్లిస్తుంది. తద్వారా బడా పెట్టుబడిని కాపాడుతుంది.

అయితే బడా పెట్టుబడికి, ఫాసిస్టు శక్తులకు మధ్య చెలిమి రకరకాల మార్గాల్లో పెంపొందుతుంది. ఉదాహరణకు, ప్రజల్లో బడా పెట్టుబడిదారుల పట్ల ఉన్న ఆగ్రహాన్ని తమకు అనుకూలంగా ఉపయోగించుకోడానికి ఫాసిస్టులు ముందు తాము బడా పెట్టుబడిదారులకు వ్యతిరేకమే అన్న అభిప్రాయాన్ని కలిగించే విధంగా వ్యవహరిస్తారు. అప్పట్లో హిట్లర్ చేసిందిదే. అటువంటి సందర్భంలో కూడా వాళ్ళకి కొంతమంది గుత్త పెట్టుబడిదారులు చాటు మాటుగా సహకరిస్తారు. ఒకసారి ఫాసిస్టులు అధికారం చేజిక్కించుకున్నాక ఇక బాహాటంగానే వారికి బడా పెట్టుబడి దారులతో ఉన్న భాగస్వామ్యం బైట పడుతుంది. తమకు మొద ట్లో మద్దతుదారులుగా ఉంటూ అధికా రంలోకి వచ్చాక కూడా బడా పెట్టుబడి దారులకు వ్యతిరేక వైఖరిని పాటించే వారినందరినీ నిర్మొహమా టంగా పార్టీ నుండి బయటకు తోలేస్తారు.

మన దేశంలో ఈ విషయంలో కొంత తేడా ఉంది. మైనారిటీ మతస్తుల పట్ల విద్వేషాన్ని రెచ్చగొట్టే తొలి దశలో కూడా ఇక్కడి ఫాసిస్టులు తమకు బడా పెట్టుబడిదారులతో ఉన్న చెలిమిని ఎక్కడా దాచిపెట్టలేదు. ప్రత్యేకించి కొంతమంది బడా పెట్టుబడిదారులతో బాగా సన్నిహితంగా మెలుగుతూ వచ్చారు. ఐతే ఫ్రాన్స్‌లో నయా ఫాసిస్టులు మాత్రం ముందు దశలో గుత్త పెట్టుబడికి తాము వ్యతిరేకం అన్నట్టు కొంత హడావుడి చేశారు. ఫ్రెంచి ఫాసిస్టు నాయకురాలు మెరైన్ లీపెన్ నయా ఉదారవాద విధానాలకు తాను వ్యతిరేకం అన్నట్టు వ్యవహరించింది. గ్రీస్‌లో సిరిజా పార్టీ ఎన్నికల సమయంలో నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేస్తానని ప్రకటించి ఎన్నికల్లో గెలిచిన తర్వాత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒత్తిళ్ళకు లొంగిపోయింది. ఆ సందర్భంలో లీపెన్ సిరిజా పార్టీ ద్రోహం చేసిందంటూ విరుచుకుపడింది. కాని ఆమె పార్టీకి ఫ్రెంచి మీడియా గుత్తాధిపతి. శత కోటీశ్వరుడు అయిన విన్సెంట్ బొల్లొరె పూర్తి అండదండలందించాడు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ ఆ పార్టీ ప్రధానమంత్రి అభ్యర్థి జోర్డాన్ బార్డెల్లా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి వ్యతిరేకంగా మాట్లాడడం తగ్గించివేశాడు. మొదట్లో తమ పార్టీ ప్రకటించిన వైఖరికి ఇది భిన్నమైనది.

ఇటలీలో కూడా ఇదే విధంగా జరిగింది. అక్కడ ఫాసిస్టు నాయకురాలు జార్జియా మెలోనీ ముందు తమ ఆర్థిక ఎజెండా నయా ఉదారవాద విధానాలకు భిన్నంగా ఉంటుందని ప్రకటించారు. అప్పటికి అధికారంలో ఉన్న మారియో డ్రాఘీ ప్రభుత్వం సూటిగా నయా ఉదారవాద విధానాలనే అమలు చేస్తోంది. మెలోనీ ప్రకటించిన వైఖరిని నమ్మి ప్రజలు ఆమెకు పట్టం కట్టారు. కాని ఒకసారి అధికారం చేతికి వచ్చాక తాను అంతకు ముందు ప్రకటించిన దానికి భిన్నంగా బడా పెట్టుబడికి అత్యంత విశ్వసనీయమైన మిత్రురాలిగా మెలోనీ మారిపోయారు.



> యూరప్‌లోని వామపక్షాలు బూర్జువా పార్టీకి తోకల్లా వ్యవహరించడం అనేది చాలాకాలం నుండి కొనసాగుతున్నదే. యుగోస్లేవియా మీద బాంబులు వేసినప్పటి నుంచీ వారిది అదే వైఖరి. ఇలా సామ్రాజ్యవాదులకు తోకల్లా వ్యవహరించడం అనేది ఇప్పుడు ముదిరిపోయి ఉక్రెయిన్ యుద్ధానికి, నయా ఉదారవాదానికి పూర్తి మద్దతు తెలిపేదాకా వాళ్లుపోయారు. దాంతో ఫాసిస్టులు తామే శాంతిని పరిరక్షించేవాళ్లమని, తామే ప్రజల్ని బాధల నుండి విముక్తి చేయగలం అని పోజు పెట్టడానికి అవకాశం వచ్చింది. ఆ పోజు ఒకసారి వాళ్లు అధికారంలోకి రాగానే మారిపోతుంది. అటువంటి ఫాసిస్టు శక్తుల ఆటలు కట్టించే దారి ఫ్రాన్స్‌లోని వామపక్షాలు చూపుతున్నాయి. నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ ఎజెండాను రూపొందించి ప్రజల్లోకి దానిని తీసుకుపోవడమే ఆ మార్గం.

ఉక్రెయిన్ యుద్ధం విషయంలో కూడా చాలామంది యూరోపియన్ ఫాసిస్టులు ఇదే విధంగా తమ తమ పూర్వపు వైఖరులను మార్చుకున్నారు. యూరోపియన్ కార్మికవర్గం స్పష్టంగా ఉక్రెయిన్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తోంది. రష్యా మీద విధించిన ఆంక్షల కారణంగా పెరిగిపోయిన ఇంధన ధరల భారాన్ని వారు భరించలేక పోతున్నారు. తిరిగి శాంతి నెలకొనాలని వారంతా కోరుతున్నారు. ఫాసిస్టులు మొదట్లో కార్మికుల మద్దతు పొందడం కోసం యుద్ధం పట్ల కొన్ని అభ్యంతరాలను ప్రకటించారు. కాని అధికారంలోకి వచ్చాక వారంతా అమెరికా విధించిన ఆంక్షలను పూర్తిగా బలపరచం ప్రారంభించారు. తమకన్నా ముందు పాలించిన ఉదారవాద బూర్జువా పార్టీలు అనుసరించిన వైఖరికి వీరు అనుసరించే వైఖరికి తేడా లేకుండా పోయింది.

క్లుప్తంగా చెప్పాలంటే ఫాసిస్టు శక్తులు ఒక మైనారిటీ భాగపు ప్రజలమీద ద్వేషాన్ని రెచ్చగొట్టడం మాత్రమే కాకుండా శ్రామిక వర్గాన్ని సైతం మోసం చేస్తారు. ఉదారవాద బూర్జువా పార్టీకన్నా తాము భిన్నంగా పాలిస్తామని చెప్పుకున్నా ఆచరణలో ఆ ఉదారవాద బూర్జువా పార్టీకన్నా కూడా మితవాద వైఖరులను పాటిస్తారు. అది ఆర్థిక విధానాలైనా లేక ఉక్రెయిన్ యుద్ధం విషయం అయినా అంతే. ఇస్లాం మతం పట్ల విద్వేషాన్ని, భయాన్ని రెచ్చగొట్టడంలో గాని, బతుకుదెరువు కోసం వలసలు వచ్చే కాందిశీకుల పట్ల శత్రుత్వాన్ని కలిగించడంలోకాని, ఆ ఉదారవాద బర్జువా పార్టీలను మించి మితవాద వైఖరిని ప్రదర్శిస్తారు. ఆర్థిక విధానాలలో, యుద్ధం పట్ల వైఖరిలో ఆ ఉదారవాద బూర్జువా పార్టీల అడుగుజాడల్లోనే నడుస్తారు. అధికారంలోకి వచ్చేంత వరకూ, కార్మిక వర్గపు ఓట్ల కోసం దొంగనాటకం ఆడతారు.

వీళ్ల నాటకాలు ఇలా సాగడానికి అవకాశం ఇచ్చింది వామపక్షాలే. వామపక్షాలలోని ప్రధాన శక్తులు కార్మికవర్గ ప్రయోజనాలను పరిరక్షించే బాధ్యతను వదిలిపెట్టి బూర్జువ వర్గానికి తోకలుగా తయారయ్యారు. జర్మనీలో ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా మీద విధించిన ఆంక్షల ఫలితంగా ద్రవ్యోల్బణం బాగా పెరిగింది. దీనివలన అక్కడి కార్మికవర్గం బాగా దెబ్బ తింటోంది. అందుచేత జర్మన్ కార్మికవర్గం యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కాని అక్కడ సోషల్ డెమొక్రాట్లతోబాటు వామపక్షాలు సైతం అమెరికన్ సామ్రాజ్యవాదానికి మద్దతుగా నిలబడ్డాయి. ఆ వామపక్షాల నుండి చీలిపోయిన సహ్రా వేగెన్‌నెక్ట్ గ్రూపు గట్టిగా యుద్ధాన్ని వ్యతిరేకించే వైఖరి తీసుకుంది. అందుచేత ఆ గ్రూపునకు కార్మికుల్లో ఆదరణ బాగా పెరుగుతోంది. జర్మనీలోని వామపక్షాల మాదిరిగానే యూరప్‌లోని చాలా వామపక్షాలు నయా ఉదారవాదాన్ని బలపరిచేవారుగా తయారయ్యారు. ఈ వైఖరి వలన ఫాసిస్టుల పని తేలికైంది. వాళ్లు కార్మికవర్గాన్ని తేలికగా మోసగించగలుగుతున్నారు.

సరిగ్గా ఇక్కడే ఫ్రాన్స్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వామపక్షాలు న్యూ పాపులర్ ఫ్రంట్ అనే ఒక కొత్త కూటమిని కూర్చడంలో జయప్రదం అయ్యారు. అంతేగాక ఆ కూటమి నయా ఉదారవాద విధానాలకు భిన్నమైన ఆర్థిక కార్యక్రమాన్ని ఆమోదించేలా చేయగలిగారు. అంత వరకూ ఫాసిస్టులను అధికారం నుండి దూరంగా ఉంచాలని కోరుకున్నవారు చాలా మంది ఉన్నప్పటికీ, వారి వద్ద నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ కార్యక్రమం అంటూ ఏదీ లేదు. ఈ పరిస్థితిని మాక్రాన్ బాగా ఉపయోగించుకున్నాడు. నయా ఉదారవాద విధానాలను వేగంగా అమలు చేశాడు. దానిని కార్మికవర్గం రానురాను తీవ్రంగా వ్యతిరేకించడం జరుగుతున్నా అతడు పట్టించుకోలేదు. మాక్రాన్ పలుకుబడి తగ్గుతున్న కొద్దీ ఆ మేరకు ఫాసిస్టులు బలపడడం ప్రారంభించారు. ప్రజల్ని ఆకట్టుకోవడం కోసం వాళ్ళు అతడి ఆర్థిక విధానాలను విమర్శించడం చేశారు. ఐతే ఈ వ్యవహారానికి ఇప్పుడు తెర పడింది. న్యూ పాపులర్ ఫ్రంట్ ఫాసిజాన్ని వ్యతిరేకించడమే గాక, ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యక్రమాన్ని కూడా రూపొందించడమే దీనికి కారణం.

రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో ఫాసిస్టు వ్యతిరేక కార్యక్రమం ఒక్కటే. యుద్ధాన్ని వెంటనే నిలుపు చేయాలన్నదే ఆ కార్యక్రమం. వేరే ఆర్థిక ఎజెండా ఏదీ అవసరం లేకపోయింది. అప్పటి మాదిరిగానే ఇప్పుడు కూడా కేవలం ఫాసిస్టు వ్యతిరేకతను ఒక్కదానినే కార్యక్రమంగా పెట్టుకుని, నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించ కుండా ముందుకు పోవాలనుకుంటే ప్రస్తుత పరిస్థితుల్లో అది ముందుకు సాగదు. కేవలం ఫాసిస్టు వ్యతిరేకత ప్రాతిపదికగా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులు కలిస్తే అది సామాన్య ప్రజల ఆర్థిక స్థితిగతుల్ని ఏమాత్రమూ మెరుగుపరచలేదు. సరికదా ఫాసిస్టు శక్తుల విజయావకాశాలను అది మరింత పెంచుతుంది.

యూరప్‌లోని వామపక్షాలు బూర్జువా పార్టీకి తోకల్లా వ్యవహరించడం అనేది చాలాకాలం నుండి కొనసాగుతున్నదే. యుగోస్లేవియా మీద బాంబులు వేసినప్పటి నుంచీ వారిది అదే వైఖరి. ఇలా సామ్రాజ్యవాదులకు తోకల్లా వ్యవహరించడం అనేది ఇప్పుడు ముదిరిపోయి ఉక్రెయిన్ యుద్ధానికి, నయా ఉదారవాదానికి పూర్తి మద్దతు తెలిపేదాకా వాళ్లుపోయారు. దాంతో ఫాసిస్టులు తామే శాంతిని పరిరక్షించేవాళ్లమని, తామే ప్రజల్ని బాధల నుండి విముక్తి చేయగలం అని పోజు పెట్టడానికి అవకాశం వచ్చింది. ఆ పోజు ఒకసారి వాళ్ల అధికారంలోకి రాగానే మారిపోతుంది. అటువంటి ఫాసిస్టు శక్తుల ఆటలు కట్టించే దారి ఫ్రాన్స్‌లోని వామపక్షాలు చూపుతున్నాయి. నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ ఎజెండాను రూపొందించి ప్రజల్లోకి దానిని తీసుకుపోవడమే ఆ మార్గం.

(స్వేచ్ఛానుసరణ)

అంకురిస్తున్న ఇరాన్ ప్రజాస్వామ్యం!

ఇరాన్ దేశాధ్యక్షునిగా ఉదారవాది మసూద్ పెజిష్కియన్ ఎన్నిక కావడం చాలామందిని ఆశ్చర్యచకితుల్ని చేసింది. ప్రజాస్వామ్యం అంకురించి విరబూయడానికి ఈ ఎన్నిక విజయం ఎంతో కొంత దోహదపడగలదని పలువురు రాజకీయ పరిశీలకులు నేడు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకే సర్వత్రా హర్షామోదం వెల్లడవుతున్నది.

ఇరాన్‌లో రాజరికం కుప్పకూలి 45 ఏండ్లు కావస్తున్నది. 1979లో ఇరాన్ రాజు షా మహ్మద్ రెజా పెహ్లవి రాజరికం కూలిపోయిన తర్వాత అయితుల్లా ఖోమైనీ నాయకత్వంలో అక్కడ ఇస్లామిక్ ప్రభుత్వం ఏర్పడింది. ఆసియా ఖండంలో ఇరాన్ ఓ మధ్య ప్రాచ్యదేశం. జనాభా దాదాపు ఏడుకోట్లు, గతంలో ఇరాన్‌ను ప్రష్యా అని కూడా పిలిచేవారు. ఇరాన్ పేరుకు అర్థం స్థలి ఆర్యన్. అంటే ఆర్య భూమి. ఆర్యులు మన భారత దేశానికి అక్కడినుండే తరలి వచ్చారనే వాదన లేకపోలేదు.

ప్రస్తుతం ఆదేశంలో పేరుకు ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం అని ఉన్నా... అది గతంలోని మత రాజరిక ప్రభుత్వాలకంటే భిన్నమైనది కాదనే వాస్తవం ఎప్పటికప్పుడు వెల్లడవుతూనే ఉంటుంది.

2022లో మెహసా అమినీ అనే యువతి హిజాబ్ వస్త్రధారణ సరిగా పాటించలేదనే నెపంపై పోలీసులు నిర్బంధించారు. ఆ నిర్బంధంలో చిత్రహింసలు పెట్టిన కారణాన ఆమె మరణించడంతో ప్రజా నిరసన మిన్నంటిందప్పుడు. నిరసనను అణచేందుకు ప్రభుత్వం రకరకాల చర్యలకు ఒడిగట్టింది. నిరసన చెలరేగుతున్న ప్రాంతాలను గుర్తించి నెట్ బంద్ చేసింది. సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించింది. ఉద్యమకారులపై పోలీసుల దమనకాండ నిత్యకృత్యమైంది. వేల సంఖ్యలో ప్రజలు జైళ్ల పాలయ్యారు. చిత్రహింసలకు గురయ్యారు. అమాయకులు బలైపోయారు.

అయినా యువతులు, మహిళలు పెద్ద సంఖ్యల్లో అప్పుడు వీధుల్లోకి వచ్చి హిజాబ్ వస్త్రధారణను బాహాటంగా ఉల్లంఘించడం వెల్లువెత్తింది. అధికారులనే కాక మతఛాందసులకు సైతం ఏం చేయాలో పాలు పోలేదు.

'మహిళల జీవితం మహిళలదే. మతం ముసుగులో మగ పెత్తనమేంటి? అంటూ మహిళా ధిక్కారస్వరం దిక్కులు పిక్కటిల్లేలా మార్మోగింది. చాపకింద నీరులా సాగిన ఆ ప్రజాస్వామ్య ఉద్యమ హోరు ఈ మార్పునకు ఇప్పుడు నాంది పలికినట్టు వారు భావిస్తున్నారు. యుద్ధవీరుడు సయ్యద్ జలీలీ మీద సంస్కరణ వాది పెజిష్కియన్ మంచి మెజారిటీతో గెలవడం సామాన్య విషయంకాదనేవి ఆ పరిశీలకుల అభిప్రాయం.

'సంప్రదాయాలను గౌరవిస్తానే. ఆధునికతకు చోటివ్వక తప్పదని' పెజిష్కియన్ ఇప్పుడు అంటు న్నాడు, స్త్రీలను రెండో తరగతి పౌరులుగా చూడటం ఇక ఎంతమాత్రం తగదని కూడా చెబుతున్నాడు.

ఇరాన్‌లోని అల్పసంఖ్యాక వర్గాలతో పాటు సంస్కరణ వాదులు, ప్రజాస్వామ్యవాదుల ఆదరణ సైతం పొందడం వల్లనే పెజిష్కియన్‌కు 53 శాతం ఓట్ల ఘన విజయం లభించినట్టు బొగట్టా.

గత అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మే నెలలో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడం వల్లనే ఇప్పుడు ఈ అధ్యక్షుని ఎన్నిక జరిగింది. కాగా ఈ ఎన్నికల బరిలో నిలవడానికి షియా మతాచార్యుల మండలి అనుమతి లభించిన ఏకైక సంస్కరణ వాది పెజిష్కియన్ మాత్రమే.

పెజిష్కియన్ గెలుపును ఇరాన్ మిత్రదేశం రష్యా వెంటనే స్వాగతించింది. వృత్తి రీత్యా హృదయ శస్త్ర నిపుణుడై పెజిష్కియన్ ఇరవైయేండ్ల క్రితం ఆరోగ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్నది.

అగ్రరాజ్యం అమెరికా ఆంక్షల కారణంగా ఇరాన్ నేడు ఉక్కిరి బిక్కిరవుతున్నది. ఇరాన్ అణ్వస్త్ర తయారీని విరమిస్తే తప్ప ఆర్థిక ఆంక్షలు సడలించమని అమెరికా బెదిరిస్తున్నది. అయితే గాజాలో ఇజ్రాయిల్ సైన్యాలతో పోరాడుతున్న పాలస్తీనా సాయుధ బృందాలకు ఇరాన్ అండగా నిలుస్తున్నది. ఇజ్రాయిల్‌కు అడుగడుగునా వత్తాసు పలుకుతున్నది. అమెరికా అనేది జగమెరిగిన సత్యం.

అమెరికా - ఇజ్రాయిల్ యుద్ధోన్మాద చర్యలకు వ్యతిరేకంగా ఎర్రసముద్రంలో చమురు రవాణాకు ఆటంకం కలిగిస్తున్న హైతీ తిరుగుబాటు దార్లకూ ఇరాన్ మద్దతునిస్తున్నది. ఈ కారణాల రీత్యా ఇజ్రాయిల్ - ఇరాన్‌ల మధ్య క్షిపణుల యుద్ధం (మిస్సైల్ వార్) ఢీ అంటే ఢీ అంటున్నది.

ఈ నేపథ్యంలో ఎన్నికల పెజిష్కియన్ ఓ సంస్కరణవాదిగా అటు అంతర్గతంగానూ, ఇటు బహిర్గతంగానూ ఎలాంటి చర్యలు చేపడతాడా? అని లోకం ఎదురు చూస్తున్నది. ఆయన చేపట్టే పాలనా చర్యలకు మతాచార్యుల మండలి మరి తోడ్పాటునందిస్తుందా..? ఎందుకంటే ఆ మండలి సర్వాధికారి ఇప్పటికీ అయితుల్లా ఖొమైనీనే.

దేశం లోపల మతఛాందసత్వం, వెలుపల అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఏకకాలంలో ధిక్కరిస్తూ ముందుకు సాగడం అత్యంత సాహసోపేతమైన కృత్యం. నిజంగా కత్తిమీద సాములాంటిదీ. అయితే ప్రజల ఆకాంక్షలు, ఆదరణ, ప్రజాఉద్యమాలు పెజిష్కి యన్ వెన్నంటి ఉన్నాయి. అదే ఆయన అద్వితీయ బలం.

ప్రజాస్వామ్యం బలోపేతం కావడానికి ఎక్కడైనా పునాదిగా నిలిచేది ప్రజల చొరవేనని, ప్రజల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని థోరో చెప్పిన మాటలు రుజువు కావడమే ఆ హర్షాతిరేకం.

- కె.శాంతారావు, 9959745723

మట్టిరాసిన 'మరణశాసనం'



షేక్ కరిముల్లా
9705450705

మూఢ నమ్మకాల పునాదుల మీద అసత్యాల సమాజం నిలిపి అమాయకుల నెత్తురుతో హోలీ ఆడుకుంటున్న దగుల్బాజీల్లారా! సత్యం ఏదో ఒక రోజు కారుమబ్బుల చీకటిని చీల్చుకొని ప్రచండ ఉసస్సుతో ఈ సమాజం మీద పరుచుకుంటుంది. జ్ఞానం చేతిలో కాగడా వచ్చి మొత్తం ప్రపంచాన్ని కాంతిమయం చేస్తుంది. అప్పుడు ఈ దోపిడీ సమాజం కూలి పోయి సత్యం అధారంగా ప్రకృతిని ప్రేమించే ఓ సమాజం నిర్మిత మౌతుంది. అంతదాక మా ఈ పోరా టం కొనసాగుతుంది.

దేశంలో నకిలీ బాబాలకు కొదువేలేదు. వీరి లీలలు, అఘాయి త్యాలు, చీకటి వ్యాపారాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. మరి ముఖ్యంగా గడిచిన పదేళ్లుగా బీజేపీ అధికారం లోకి వచ్చినప్పటి నుండి వీరి ఆగడాలు ఎక్కువ య్యాయి. రాజ్యం అండదండలు వీరికి పుష్క లంగా ఉండడమే దీనికి కారణం. ఈ నకిలీ బాబాలు సహజంగా నేర స్వభావం కలిగి ఉంటారు. బాబాలుగా అవతారమెత్తి నేర వ్యాపార సామ్రాజ్యాలు నిర్మించుకుంటారు. ప్రజల బలహీనతలను ఆసరా చేసుకొని అంధ, మూఢవిశ్వాసాలను ప్రజల్లో నింపుతూ లక్షల కోట్ల ఆస్తులు దోచుకుంటారు. ఘరానాగా బతుకుతుం టారు. ఇలాంటి దొంగబాబాలకు అపారమైన రాజకీయ పలుకుబడి ఉంటుందని అనేకసార్లు రుజువైంది. సమాజంలో డబ్బున్న పెద్ద మనుషులు, రాజకీయ నాయకులు పార్టీలతో నిమిత్తం లేకుండా బాబాలను, మూఢ నమ్మకాలను విశ్వసించటంలో పోటీ పడుతుంటారు. మరీ విచిత్రం ఏమంటే చదువుకున్న మూర్ఖులు, సైన్సు చదువుకొని, ఏ మాత్రం శాస్త్రీయ దృక్పథం లేని సైంటిస్టులు అనబడే వారు కూడా ఈ బాబాల చుట్టూ తిరుగుతుంటారు. అంటే జ్ఞానానికి- చదువుకు లింకు ఎప్పుడో తెగిపోయిందని అర్థం చేసుకోవాలి. గతంలో అనేక నేరాలు చేసిన ఆశారామ్బపు, డేరా బాబా తదితర 15మంది వరకు బాబాలు జైళ్లలో ఉన్నారు. దేశంలో నూటికి 80శాతం తొక్కిసలాటలు ధార్మిక సమ్మేళనాలు, తీర్థ యాత్రలలో జరుగుతున్నవేనని ఆధ్యయనాలు చెబుతు న్నాయి.

ఉత్తరప్రదేశ్ లోని హత్రాస్‌లో జులై రెండున స్వయం ప్రకటిత దేవునిగా ప్రకటించుకున్న బోలేబాబా 'సత్సంగ్' పేరిట నిర్వహించిన కార్యక్రమానికి 2.50 లక్షల మంది హాజరయ్యారు. బాబా పాదధూళి తాకితే సకల పాపాలు, రోగాలు పోతాయని, బాబా మహిమగల వ్యక్తి అని ఆయన శిష్యగణం ప్రచారం చేయడంతో ఆయన పాదధూళి కోసం అమాయక జనం పోటీ పడగా తొక్కిసలాట చోటుచేసుకుంది. 121 మంది మరణించారు. మరణించిన వారిలో 112 మంది మహిళలు, పిల్లలే ఉన్నారు. వీరందరూ పేదబడుగు జీవులే. ఈ ఘోరానికి కారకుడైన బాబా తొక్కిసలాట జరిగిన ప్రదేశం నుంచి తన మనుషులతో కలసి దర్జాగా ఉడాయించాడు. ప్రభుత్వం విచారణకు ఆదేశించి చేతులు దులుపుకుంది. 855 పేజీల సిట్ నివేదికలో బోలేబాబా పేరులేదు. కనీసం ఎఫ్ఐఆర్‌లో ఇతని పేరే లేదు. అంటే రాజ్యానికి బాబాలకు మధ్య బంధం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఈ నకిలీ బాబా ఒక నేరస్తుడు. ఇతనిపై గతంలోనే అనేక కేసులున్నాయి. స్త్రీలపై లైంగిక దాడుల కేసులో జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. బాబాగా కొత్త అవతారమెత్తి రూ.100కోట్ల వరకు ఆస్తులు కూడబెట్టాడు.



దేశవ్యాప్తంగా 24 ఆశ్రమాలు నెలకొల్పాడు. హంగు ఆర్భాటాలతో విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు.

హత్రాస్ ఘటన లాంటివి మనకు కొత్తకాదు. గతంలోనూ ఇలాంటివి అనేకం జరిగాయి. 2005లో మహారాష్ట్రలోని వాయిలో మంద రరాదేవి గుడివద్ద తొక్కిసలాటలో 340 మందికి పైగా చనిపోయారు. 2008లో రాజస్థాన్లోని చామండదేవి ఆలయం వద్ద 250 మంది, హిమాచల్‌ప్రదేశ్‌లోని నైనాదేవి గుడివద్ద 162 మంది, ఇంకా వెనక్కి వెళితే 1954లో అలహాబాద్‌లో జరిగిన తొలి కుంభమేళాలో 800 మంది, మన రాష్ట్రంలో 2015లో గోదావరి పుష్కరాలలో జరిగిన తొక్కిసలాటలో 20మందికి పైగా చనిపోయారు. ఇవన్ని గుండెల్ని మెలిపెట్టే విషాదాలు. ఇలాంటి దుర్ఘటనలు తరుచూ జరుగుతున్నా నివారించాల్సిన ప్రభుత్వాలు చేష్టలూడిగి చూస్తుండటం బాధాకరం. సైన్స్ అండ్ టెక్నాలజీ ఊహించనంత స్థాయికి ఎదిగినా అదేస్థాయిలో దొంగ బాబాలు కూడా ఎక్కువైపోతున్నారు. మానవ సమాజాన్ని ఎంతో వెనుకకు తీసుకెళ్తూ నష్టం చేస్తున్నారు. అయినా పాలకులు నిమ్మకు నిరెత్తినట్లు ఉంటున్నారు. ప్రజలు కూడా వాస్తవ ప్రపంచాన్ని గురించిన శాస్త్రీయ అవగాహన కలిగి ఉన్నట్లు కనిపించటం లేదు. మతాలు, దేవుళ్ల, సాంప్రదాయలు అంటూ మధ్యయుగాల్లో జీవిస్తున్నవారే ఎక్కువ. ఎవరి నమ్మకాలు వారివి అని మర్యాదగా సమర్థించుకొని పోతున్నామేగాని ప్రజల్లో శాస్త్రీయ అవగాహనను కల్పించటంలో పాలకుల వైఫల్యం మెండుగా ఉంది. రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఏ ప్రకారం రాజ్యం ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని రాసుకున్నామేగాని, చిత్తశుద్ధిగా ఆచరించటం లేదు. గత కొంతకాలంగా రోజురోజుకూ మార్కెట్లోకి కొత్త బాబాలు పుట్టుకొస్తున్నారు. వీరు ప్రజల బలహీనతలను, అమాయకత్వం, అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని వేలకోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంతటితో ఆగకుండా స్త్రీల మానప్రాణాలు హరించి వేస్తున్నారు. చివరకు ఈ ప్రక్రియ ప్రాణాంతకంగా మారిపోయినప్పుడు చూస్తూ సహించలేం. ఇంత జరుగుతున్నా మన పాలకులకు చీమ కుట్టినట్టు కూడా లేదు. పైపెచ్చు రాజకీయ నాయకుడు, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారు సైతం దొంగబాబాల చెంతకుపోయి పొర్లు దండాలు పెడుతూ, వారికి పాదదాసులుగా మారిపోతు న్నారు. ఇక సామాన్య ప్రజలకు శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన ఎలా ఏర్పడుతుంది?

ఏ జీవన సంక్షోభాల నుంచి ప్రజలు బాబాలను ఆశ్రయిస్తున్నారు? అవధులు దాటిన ఈ బాబాభక్తి వెనుక ఉన్న సామాజిక, మానసిక వెనుకబాటు తనాన్ని శోధించాలి. పేదరికం, దారిద్రం నుండి అమాయక ప్రజలు బయటపడే మార్గం ఈ వ్యవస్థలో లేకనే ప్రజలు దేవుడు, దెయ్యం, మంత్రాలు, తంత్రాలు అంటూ మూఢాచారాలను నమ్ముతూ ఈ దొంగ బాబాల మోసాల బారిన పడుతున్నారు. అందుకే మూఢాచారాలు, దొంగ బాబాలను నిషేదిస్తూ ఓ ప్రత్యేక చట్టం తేవాలి. ఈ ప్రకృతిని ఏ దేవుడు సృష్టించలేదని, ఈ ప్రకృతి అంతా స్వతహాగా భౌతిక పదార్థాలతో నిండి ఉంటుందని, పదార్థాలకు పదార్థ ధర్మాలేగాని మహిమలు ఉండవని ప్రజలు గ్రహించాలి. ప్రకృతి, సామాజిక పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో విద్యాలయాల్లో మొదటి నుంచి వివరిస్తూ, ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేస్తూ తీసుకువెళ్లాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. అంధ మూఢత్వానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచటానికి ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యతనివ్వాలి.



ముగిసిన ప్రజానాట్యమండలి రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు

నవతెలంగాణ- ఖమ్మం

ఈ నెల 12, 13, 14 తేదీలలో ఖమ్మం నగరంలో సుందరయ్య భవనంలో నిర్వహించిన ప్రజానాట్య మండలి రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయని ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ తెలిపారు. సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ తరగతులకు మొత్తం 20 జిల్లాల నుండి సుమారు 150 మంది ఎంపిక చేసిన ప్రతినిదులు హాజరయ్యారని అన్నారు. ఈ మూడు రోజులు 6 క్లాసులు బోధించడం జరిగిందని తెలిపారు. భావజాల రంగంలో టీవీ, సినిమా ఇతర సాంస్కృతిక రంగంలో సమాజ తిరోగమన మూడత్వ, మతోన్మాద భావజాలంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వేగంగా అడుగులు ముందుకు పడుతున్న సందర్భంలో మనమున్నామని అన్నారు. వీటిని తిప్పికొట్టే విధంగా భావజాల రంగంలో కలిసివచ్చే శక్తులన్నింటితో విశాల వేదికను ఏర్పాటు చేసి ప్రజా కవులూ, రచయితలూ, కళాకారులు పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మూడు రోజులపాటు విజ్ఞాన దర్శిని రమేష్, సోమయ్య, బండారు రమేష్, రైతునేత సాగర్, ప్రజా నాట్య మండలి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి కె.శాంతారావు తరగతులు బోధించారు. ఈ తరగతులకు హాజరైన ప్రతినిధులు క్లాసులు, భవిష్యత్తు కర్తవ్యలపై చర్చించి జిల్లాల వారీగా రిపోర్టు ప్రవేశ పెట్టారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సాంస్కృతిక రంగంలో వారు చేసిన కృషిని ప్రతినిధులకు తెలియపరుస్తూ వారి నుండి స్ఫూర్తి పొందాలని, వారిని ఆదర్శంగా తీసుకొని భావజాల రంగంలో మరింత కృషి చేయాలని, కళాకారులకు పిలుపునిచ్చారు. ఈ తరగతుల నిర్వహణకు సహకరించిన అందరికీ రాష్ట్ర కమిటీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రజా క్షేత్రంలో విశేష కృషి చేసిన సాంస్కృతిక రంగ సీనియర్ కళాకారులు 1976 ప్రజానాట్యమండలి పున ప్రారంభం నుండి పనిచేసిన జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన కోండ్రు జానకిరామయ్య, నూతలపాటి అప్పారావు, గాయకులు మేకల శేశిరెడ్డి, డప్పు మాస్టర్ లాల్ సింగ్, ఆంజనేయులు, మరియు సోదర సాంస్కృతిక సంఘం అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షులు నాగన్న తదితరులను రైతు సంఘం రాష్ట్ర నేతలు టీ సాగర్, నున్నా నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి రచయితల బృందం శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు అవ్వారీ గోవర్ధన్, వేల్పుల వెంకన్న, వేముల సదానంద్, కుమ్మరి శంకర్, ఎం.జె వినోద్‌కుమార్, నాగభూషణం, ఆశన్న, సంఘం ఖమ్మం జిల్లా నాయకులు నామ లక్ష్మీనారాయణ, నందిగామ కృష్ణ, మారుతి కొండల్‌రావు, పాపాచారి, చెరుకుమల్లి వేంకటేశ్వర్లు, ఉపేందర్, వీరబాబు, లింగయ్య జ్యోతి, సుమతీ తదితరులు పాల్గొన్నారు .

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ - బోనకల్



కడుపునొప్పి తాళలేక ఓ విద్యార్థిని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రావినూతల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై కడగండ్ల మధుబాబు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బోయినపల్లి అచ్యుతరావు, నాగేంద్ర దంపతుల పెద్ద కుమార్తె రిషిత (16) మధిర మండల పరిధిలోని కృష్ణాపురం గురుకుల పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసింది. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో చేరేందుకు గురుకుల పాఠశాలకు దరఖాస్తు కూడా చేసుకుంది. కానీ సీటు రాలేదు. అయితే గత కొంతకాలంగా రిషిత కడుపునొప్పితో బాధపడుతుంది. ఈ క్రమంలో తల్లిదండ్రులు సోమవారం వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రిషిత పురుగుల మందు తాగింది. మధ్యాహ్న సమయంలో ప్రస్తుతం రావినూతల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రిషిత చెల్లెలు ప్రవల్లిక తన స్నేహితురాలి ఫంక్షన్ ఉండటంతో అక్కడకు వెళ్ళింది. భోజనం చేసిన అనంతరం తమ ఇంటికి వెళ్ళింది. ఆ సమయంలో రిషిత స్పృహ లేకుండా పడిపోయి ఉంది. వెంటనే స్థానికులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తండ్రి అచ్యుతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుబాబు తెలిపారు.



పాఠశాల పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలి : ఎంపీడీవో

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని వివిధ పాఠశాలలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద జరుగుతున్న పనులను తక్షణమే పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం.ఎర్రయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల ప్రత్యేక అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనకు సంబంధిత అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలలో మంచినీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, మధ్యాహ్న భోజనం, కాంపౌండ్ వాల్ తదితర సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలలలో ప్రతి విద్యార్థికి అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిమిత్తం నాణ్యమైన బియ్యాన్ని అందించేలా చూడాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చలపతిరావు, ఏపీఎం అశోక్ రాణి, ఏఈ దేవేందర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. మామునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంబాబు ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, ప్రమోషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులకు శాలువా కప్పి సన్మానించారు. తొలుత విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల చైర్మన్ డొక్కా సత్యవతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంబాబు, ఉపాధ్యాయలు ఇస్రావత్తు బద్రు, నరసింహారావు, రమాదేవి, సునీత, వెంకమ్మ శైలజకుమారి, పుల్లయ్య మారబత్తుల జమల య్య, భూమయ్య, రామకృష్ణంరాజు, కాంతమ్మ సిఆర్పి లింగయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

'న్యూఇరా'లో బోనాల పండుగ

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని న్యూఇరా పాఠశాలలో ఆషాఢ మాసంలో జరుపుకునే, గ్రామదేవతకు సమర్పించే బోనాల పండుగను పాఠశాల యాజమాన్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో విద్యార్థినీ, విద్యార్థులు, వివిధ వేషధారణతో, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులతో, భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఐ.వి.రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయమే మనిషి నడవడికి తార్కాణం అని ఉద్ఘాటించారు. ఈ పండుగలోని ఔన్నత్యాన్ని వివరిస్తూ ఇందులో శాస్త్రపరమైన, ఆరోగ్యపరమైన అనేక అంశాలను వివరించారు.

మతోన్మాదం ప్రమాదకరం

- సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు, పి.సోమయ్య

నవతెలంగాణ-మధిర



మతం వల్ల ఎవరికీ ప్రమాదం ఉండదని కానీ మతోన్మాదం ప్రమాదకరమని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. మధిర మండల పరిధిలోని దెందుకూరులోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో రెండవ రోజు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. 'మతం -మతోన్మాదం' అంశాన్ని సోమవారం మిరియం వెంకటేశ్వర్లు బోధించారు. ఈ శిక్షణా తరగతులను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రారంభించారు. కష్టాలు, కన్నీళ్లతో నిండిన పేదలకు, సాధారణ ప్రజలకు ఊరట కలిగించే సాధనం మతం అని అన్నారు. ప్రేమ, పరమత సహనం, సమానత్వాన్ని బోధిస్తూ ప్రకృతిని ఆరాధించే స్థితి నుండి మతం ప్రారంభమైనట్లు చరిత్ర చెబుతుందన్నారు. భారతీయ సమాజంలో ప్రజల మొదటి నుండి తమకు నచ్చిన ప్రకతి శక్తులను, అతీత శక్తులను ఆరాధించేవారన్నారు. పరమత సహనం వల్ల విభిన్న జాతులు, విభిన్న మతాలు, విభిన్న భాషలు, విభిన్న సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు కలిగిన భారత ఉపఖండంగా భారతదేశం చరిత్ర కెక్కిందన్నారు. మతాలు రాజకీయాలకు ఆలంబనగా మారడం వల్ల మత వ్యత్యాసాలు సృష్టించి మతోన్మాదానికి దారితీస్తుందన్నారు. రాజకీయ అధికారం, వ్యాపార లావాదేవీల కోసం దేశ సంపదలను లూటీ చేయడం కోసం లక్షల కోట్ల సంపదలను పోగేయడం కోసం మతం ఉపయోగపడు తుందన్నారు. మతాన్ని రాజకీయ అధికారం కోసం ఉపయోగించే క్రమంలో అనేకమంది పేద ప్రజలు మతోన్మాదానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారని, తమకున్న సమస్యలను మరచి తోటి మనుషులను మతం పేరుతో దూషించటం, దాడి చేయడం చేస్తున్నారన్నారు. ప్రతి మనిషి తనకు నచ్చిన మతంలో ఉండవచ్చని, ఎవరి మతం వారికి గొప్పదనని, ఎదుటివారి మతాన్ని కించపరచడం ద్వారా మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా రాజకీయాలు నడపడం దేశ భవిష్యత్తుకు, ప్రజలకు తీవ్రమైన ప్రమాదం అని, దీనిని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు. కమ్యూనిస్టులు మతానికి వ్యతిరేకం కాదని, మతం పేరుతో జరిగే ఉన్మాదానికి మాత్రమే వ్యతిరేకులని అన్నారు.



దేశంలో పార్టీ కార్యక్రమం ఉన్న ఏకైక పార్టీ సీపీఐ(ఎం) మాత్రమేనని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య అన్నారు. పార్టీ కార్యక్రమం ద్వారానే పార్టీ విశిష్టత తెలియజేస్తుందన్నారు. కార్యక్రమం లేకుండా కేవలం బూర్జువాపార్టీలు అధికారం కోసమే పనిచేస్తాయన్నారు. కానీ సీపీఐ(ఎం) అధికారం కోసం కాకుండా పార్టీ కార్యక్రమం అమలు కోసమే పనిచేస్తుందన్నారు. ప్రతి కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం గురించి తెలుసుకోవాలన్నారు. పార్టీ కార్యక్రమమే సిపిఎంకు ఆయుధం అన్నారు. ప్రిన్సిపాల్‌గా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, పూర్తి కాలం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





'సర్వజ్ఞ'లో మాక్ పోలింగ్

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని వీడియోస్ కాలనీలోని సర్వజ్ఞ స్కూల్లో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థి నాయకుడు, ఉప నాయకుడు, తరగతి విద్యార్థి నాయకులను ఎన్నుకోడానికి సర్వజ్ఞ స్కూల్ యాజమాన్యం ఈ పోలింగ్ నిర్వహించారు. తొలుత ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్లను జారీ చేయడం, నామినేషన్లు వేయడం...గుర్తులు కేటాయించడం...ప్రచారం చేయడం...ఓట్లు వేయడం... ఓట్ల లెక్కింపు... గెలుపొందిన వారు విజయోత్సవం చేయడం వరుసగా ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులను ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్ర కుమార్, ఆర్.వి నీలిమ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడానికి ఈ మాక్ పోలింగ్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు . సోమవారం మొత్తం 27 వినతులు రాగా అవి త్వరగా పరిష్కరించవలసిందిగా ఆదికారులను ఆదేశించారు .మొత్తం రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, బర్త్ అండ్ డెత్, శానిటేషన్ మీద వినతులు రాగా ఆ వినతులని సంబంధిత అధికారులకు ఇచ్చి త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో విషజ్వరాలతో బాధపడుతున్న వారిని జిల్లా కలెక్టర్ ముజ్జమిల్ ఖాన్‌తో కలసి మంత్రి పరామర్శించారు. వారికి మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. గత పది సంవత్సరాలు పాలించిన ప్రభుత్వం కనీస మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. ఏ గ్రామానికి వెళ్లినా మౌలిక వసతులపై



దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయని, ఇచ్చిన మాట ప్రకారం పేద వారికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం వీలైనంత తొందరగా నిధులు మంజూరు చేయిస్తానని, గ్రామాలను తీర్చిదిద్దే బాధ్యత ఈ ప్రభుత్వం కచ్చితంగా చేస్తుందని మంత్రి తెలిపారు. గ్రామంలోని వీధుల్లో మంత్రి అధికారులు తిరిగి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. వానాకాలం సీజన్ ప్రారంభంలో జ్వరాలతో పాటు ఇతర జబ్బులు వస్తాయని, కనీస జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. మంత్రి వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మాలతీ, పంచాయతీ రాజ్ ఇఇ వెంకటరెడ్డి, మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఓ కె.శేషాద్రి, ఎంపీపీ బోడ మంగీలాల్, జడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ, పోట్ల కిరణ్, మాజీ సర్పంచి బానోత్ వెంకన్న, అధికారులు, మెడికల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధనలు తొలగించాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవ తెలంగాణ-మధిర



రైతు రుణమాఫీలో రేషన్‌కార్డు నిబంధన తొలగించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం మధిరలో జరిగిన రైతు సంఘం సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన రుణమాఫీ నిబంధనలు వల్ల అనేక మంది రైతులు రుణమాఫీకి అర్హత కోల్పోతారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, ఈ పది సంవత్సరాలలో వివాహం అయ్యి వేరే కుటుంబాలుగా ఉంటూ వ్యవసాయం చేస్తున్న యువ రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఉన్న రద్దు అయ్యే పరిస్థితి లేదని, వెంటనే రేషన్ కార్డు నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టాదార్ పాస్ పుస్తకం కలిగిన రైతులకు రుణమాఫీ అంటే ధరణి పాసుపుస్తకాలు కంటే ముందు చేతి రాత పహణి నకలు, మీ పహణి ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు వర్తించకుండా పోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతు కుటుంబాల వారసులకి ధరణి పాస్ పుస్తకాలు మంజూరు కాక పెండింగ్లో ఉన్నాయని, అలాంటి రైతులకు కూడా రుణమాఫీ వర్తించే అవకాశం లేదని అన్నారు. 2018 డిసెంబర్ 12 గడువు లేకుండా రైతు రుణమాఫీ వర్తింపు చేయాలన్నారు. ప్రభుత్వం జీవోలో పేర్కొన్న నిబంధనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి బ్యాంకులో అప్పు ఉన్న రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, మధిర మండల అధ్యక్ష కార్యదర్శులు పాపినేని రామనర్సయ్య, మందా సైదులు, జిల్లా కమిటీ నాయకులు ఎస్‌కె మీరా, మద్దినేని బసవయ్య, ఓట్ల శంకర్‌రావు, వీరయ్య వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందీ రానీయం

- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి
- అంబేద్కర్ కళాశాల, గిరిజన హాస్టల్‌లో తనిఖీ
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ

నవతెలంగాణ- ఖమ్మం



తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ బిడ్డలు ఉన్నత స్థితికి చేరుకోవాలని, చదివిస్తుంటారని, అలాంటి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఖమ్మంలోని కేంద్రీయ విద్యాలయం, ఎన్ఎస్పీ నగర్లోని అంబేద్కర్ కళాశాల, గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి విద్యార్థులతో ఆత్మీయంగా పలకరించారు. కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అక్కడి ప్రాంగణంలో మొక్క నాటారు. బోధన, బోధనేతర సిబ్బందితో కలిసి సమావేశమై పలు అంశాలు చర్చించారు. నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్తు అని.. బోధనలో రాజీ పడకుండా తీర్చిదిద్దాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా.. ఇబ్బంది రానీయకుండా.. పరిష్కరిస్తామని అభయమిచ్చారు. చక్కగా చదువుకోవాలని.. రేపటి ఉద్యోగులుగా నిలవాలని ఆకాంక్షించారు. నీటి, భవన సదుపాయ లోటుపాట్లు లేకుండా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్, ఖమ్మంరూరల్ మండల అధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు కొప్పుల చంద్రశేఖరరావు, కూర్మారావు, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు మహేష్, కాకి శ్రీను, నగేష్, ఆయా సంస్థల బోధనా, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి జీప్లస్-2... నిర్మాణం జీప్లస్-5

- గంగారంలో అనుమతిలేని నిర్మాణాలు
- అసైన్‌మెంట్ భూమిలోనూ నిర్మాణాలు
- అక్రమ నిర్మాణాలపై ఎంపీడీవోకు గ్రామస్తుల ఫిర్యాదు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో అనుమతులు లేని అక్రమ నిర్మాణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇదేగాక అసైన్‌మెంట్ భూముల్లో సైతం వ్యాపార సముదాయ నిర్మాణాలు చేపట్టి వ్యాపారులకు బాడుగకు (అద్దె) ఇచ్చుకోవడం కూడా జరుగుతోంది. గంగారం గ్రామంలో సుమారుగా 1200 ఇండ్లకు పైగా ఈ గ్రామంలో సుమారుగా 100 ఇండ్లకు పైగా నిర్మాణాలకు కనీస అనుమతులు లేవని తెలుస్తోంది. ఇదిలా ఉంటే సెంటు భూమిలేని పేద వర్గాలకు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు మాత్రమే ప్రభుత్వం అసైన్‌మెంట్ భూములను పంపిణీ చేస్తూ పట్టాలు ఇస్తారని సాధారణంగా అందరికి తెలిసిన విషయం. కాని అసైన్‌మెంట్ భూములు అగ్రవర్ణాల వారి పేరున ఉండటమే గాక వారి కులం కాలమ్‌లో బీసీ–సీ అని ధరణి పోర్టల్ ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ రికార్డుల్లో నమోదు కావడం విశేషం. మరొక విశేషమేమిటంటే ప్రభుత్వం పంపిణీ చేసే అసైన్‌భూములను కేవలం వ్యవసాయ ఆధారిత పంటలకు మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. అదీను పైన తెలిపిన వర్గాలు మాత్రమే దీనిని ఉపయోగించుకుంటారు. అయితే రామగోవిందాపురం సమీపంలో అసైన్‌మెంట్ భూమిలో అగ్ర వర్ణానికి చెందిన ఒకరు వ్యాపార సముదాయాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చుకుంటూ వస్తున్నారు.

జీప్లస్ టూ అనుమతులు పొంది అదనపు అంతస్తుల నిర్మాణం

గంగారం సెంటరుకు అతి సమీపంలో మాజీ సర్పంచ్ కుమారుడి పేరున జీప్లస్ టూ అనుమతి పొంది పెంట్‌హౌస్‌తో కలిపి అదనపు అంతస్తులతో అపార్టుమెంట్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి జీప్లస్ టూ వరకు అనుమతి ఉంటుంది. ఇంకను 15 అడుగుల ఎత్తు వరకు నిర్మాణాలు చేపట్టినా అధికారికంగా అనుమతులు ఉండవని మండల పంచాయతీ అధికారి త్యాగరాజన్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. అయితే గంగారంలో నిర్మాణం జరిగిన అపార్టుమెంట్‌కు మాత్రం జీప్లస్–2 వరకు మాత్రమే అనుమతి ఉందని వారు స్పష్టం చేశారు.





అక్రమ నిర్మాణాలపై ఎంపీపీవోకు ఫిర్యాదు చేసిన గంగారం ప్రజలు

గంగారంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయమై ఆ గ్రామానికి చెందిన కొందరు సోమవారం సత్తుపల్లి ఎంపీడీవో ఆర్.సిహెచ్. నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేస్తూ దీనికి సంబంధించి చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం అందించారు.

అనుమతులు లేని నిర్మాణాలపై విచారణ జరుగుతోంది...

ఆర్.సిహెచ్. నాగేశ్వరరావు, ఎంపీడీవో, సత్తుపల్లి

గంగారం గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన విషయం తమ దృష్టికి వచ్చిందని ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. ఏ నిర్మాణం చేపట్టాలనుకున్నా అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో తమ పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీవో నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-మధిర



మధిర ట్యాంక్ బండ్‌పై నిదానపురం గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై మధిర వస్తున్న వ్యక్తిని మద్యం మత్తులో కారును నడుపుతూ ఢీకొనడంతో వ్యక్తికి మోకాళ్లపై తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తుల కార్ డ్రైవర్ ఆపకుండా వెళ్లడంతో నిదానపురం గ్రామస్తులు పట్టుకున్నారు. క్షతగాత్రుడు నిదానపురం గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి మధిర మిడ్ స్ట్రీట్ బేకరీలో విధులు నిర్వహిస్తున్నాడు. కార్ డ్రైవర్ ఆత్కూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిపారు. స్థానికులు ఆర్కే ఫౌండేషన్‌కు సమాచారం అందించడంతో ఆ ఫౌండేషన్ రెస్క్యూ టీం దోర్నాల రామకృష్ణ జ్యోతి హుటాహుటిన క్షతగాత్రుని ఆస్పత్రికి తరలించారు.

అఖిల భారత గిరిజన ఉద్యోగస్తుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గరిక శ్రీనివాస్, భూక్యా శోభన్






ఖమ్మం : నగరంలోని బంజారా భవనంలో అఖిల భారత గిరిజన ఉద్యోగస్తుల సంఘం జాతీయ అధ్యక్షులు పీవీ.రమణ సమక్షంలో సోమవారం జిల్లా అధ్యక్షులుగా గరిక శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూక్యా శోభన్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చాట్ల చంద్రయ్య, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ శంకర్, జిల్లా ట్రెజరర్‌గా పుట్టబంతి బాలస్వామి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మేచర్ల రాధ, జిల్లా ఉపాధ్యక్షులుగా జరుపుల వీరన్న, నల్లగొండ శివకోటి, ధరావత్ రాములు నాయక్, మొగిలి రఘు, కిన్నెర కార్తిక్, మొగిలి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిలుగా పుట్టబంతి శ్రీనివాస్, బానోత్ ముత్తయ్య, పూనం నాగేశ్వరరావు, దుగ్గిరాల శ్రీనివాస్, లచ్చు నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గరిక సాంబశివరావు, భుక్య దేవానాయక్, బీ.దేవేందర్, ఎర్రబడి ఇసాక్, మేడ నాగ ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మొగిలి నాగేశ్వరరావు, బాలాజీ, అంగిడి రాంబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రావూరి రాజు, పుట్టబంతి బాలస్వామి, బానోత్ మంగ్య నాయక్‌లను నియమించారు.

జమలాపురం చెరువుకు జలకళ

- 2000 ఎకరాలకు నీటి పారుదల
- రైతులకు కల్పతరువు పెద్ద చెరువు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో 100 ఎకరాల పైబడి విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువుకు పైన కురుస్తున్న వర్షానికి చెరువులోకి నీరు చేరి నీటితో కళకళలాడుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడితే కాలువల ద్వారా అడవి ప్రాంతంల నుండి చెరువులోకి నీరు చేరటానికి అనుకూలమైన వనరులు పుష్కలంగా ఉన్నాయి. చెరువు నిండి అలుగు పారితే మండలంలోని జమలాపురం, వెంకటాపురం, ఎర్రుపాలెం, బంజర, కంద్రిక, పెద్ద గోపవరం, రేమిడిచర్ల, ఏడు గ్రామాలకు ఆయకట్టు విస్తరించి ఉండటం వలన మాగాణి భూములకు వరి పంట పండించడానికి ఎటువంటి దిగులు ఉండదు. ఈ చెరువు కింద పారే నీటితో సుమారు రెండు



వేల ఎకరాల వరకు రైతులు సేద్యం చేసి వరి పంటను పండిస్తారు. ఈ చెరువుపైన ఆధారపడిన రైతులు ప్రస్తుతం చెరువులో ఉన్న నీటితో వరి నార్లు పోసి చెరువు నిండితే దమ్ము చేసి నాట్లు వేయటానికి సంసిద్ధంగా ఉన్నారు. 7 మీటర్ల పొడవు వరకు చెరువు నీరు కాలువల ద్వారా పారుతుందని రైతులు తెలిపారు. నీరు పారే కాలువలను సిమెంటు కాలువగా నిర్మాణం చేపడితే పారే నీరువృథా కాకుండా ఉంటుందని రైతులు తెలిపారు. వేసవి కాలంలో సాగర్ జలాలు విడుదల చేసినప్పుడు చెరువుకు నీరు చేరుతుంది. జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలలో జరిగే తెప్పోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ఈ చెరువులో నిర్వహిస్తారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జమ లాపురం చెరువును పర్యాటక కేంద్రంగా చేపడతామని ప్రకటించారు. పర్యాటక కేంద్రంగా మార్చితే ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచినట్లు అవుతుందని భక్తులు తెలిపారు. దేవాలయాన్ని టూరిజం క్రింద ఎంపిక చేసి చెరువులో బోట్ షికారు తోపాటు హోటల్స్, భక్తులు సేద తీరేందుకు షెడ్లు, భక్తులకు అవసరమైన వసతులను ఏర్పాటు చేస్తే ఆలయానికి ఆదాయం పెరుగుతుంది వ్యాపారస్తులకు జీవనోపాది కల్పించినట్లు అవుతుందని భక్తులు తెలిపారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వెను వెంటనే దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఎంతో దూరం నుంచి సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తూ వస్తున్న బాధితులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశం మదిరంలో ఆయన అధికారులతో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించారు. స్వయంగా ఒక్కొక్కరీ దరఖాస్తులను పరిశీలించి అప్పటికప్పుడే అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు పరిష్కరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని పెండింగ్‌లో పెట్టవద్దని, వార వారం ఫిర్యాదులు పరిష్కరించి సంబంధిత అధికారులు ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కమిటీ డిమాండ్

నవతెలంగాణ-వైరాటౌన్



జ్యోతిబాపూలే హాస్టల్లో సమస్యలు పరిష్కరిచాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కోటా ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రెబ్బవరంలోని జ్యోతిబాపూలే హాస్టల్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని ముసలిమడుగు హాస్టల్‌తో కలిపి ఇక్కడ విద్యార్థినులు బస చేయాల్సి వస్తుందని, దీనికనుగుణంగా మౌలిక వసతులు లేకపోవడం వలన తీవ్రమైన ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే ఆర్‌సీఓ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ముసలిమడుగు హాస్టల్ తరలించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తంగా 750 మంది విద్యార్థినీలకు సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రభావంతో విద్యార్థినీలు అస్వస్థతకు గురవుతున్నారని, వెంటనే ఆరోగ్యశాఖ అధికారిని ఆధ్వర్యంలో మెడికల్ చెక్ అప్ చేపట్టాలని కోరారు. స్థానికంగా వీధిలైట్లు వెలగకపోవడంతో విద్యార్థినిలు రాత్రిపూట క్యాంపస్‌లో తిరగాలన్నా భయాందోళనలకు గురవుతున్నారని, అధికారులు వెంటనే వీధి లైట్ల సౌకర్యం కల్పించడానికి తగిన చర్యలు చేపట్టాలని, భోజనంలో సరిపడా పౌష్టికాహారం లేక వంట నాసిరకంగా ఉండడం వలన విద్యార్థినీలు సరైన తిండి దొరకక అనారోగ్యం పాలవుతున్నారని, ప్రిన్సిపల్, వార్డెన్ నిర్లక్ష్యం మూలంగా చదువుకోలేని పరిస్థితిలో విద్యార్థినిలు మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృత్తం అయితే తల్లిదండ్రులను కలుపుకుని ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పానుగంటి హేమంత్, మహేష్, ఉమేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి వర్షం నీరు

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలో పోచారం కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం నీటితో మునిగింది. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షపు నీరు వలన అంగన్‌వాడీ భవనం జలదిగ్బంధనం కావడంతో పాఠశాల నిర్వహణ కష్టతరంగా మారింది. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం నిర్వహణ కష్టతరంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో వర్షం నీరు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న కార్యదర్శి తన నిర్వహణలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుంది. ఐదు రోజులుగా అంగన్‌వాడీ భవనం జలదిగ్బంధనం కావడంతో పాఠశాల నిర్వహణ ఏ విధంగా జరుగుతుందన్న ఆలోచన అధికారులకు లేకపోవడం ఎంతవరకు సమంజసం అని గ్రామస్తులు ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో సమస్యలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవట్లేదని ప్రజల ఆరోపిస్తున్నారు.

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్‌రెడ్డికి అభినందనలు

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా నియామకమైన సుంకేట అన్వేష్ రెడ్డి సోమవారం హైదరాబాదులో హాకా భవన్లో పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మొక్క శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి కిసాన్ కాంగ్రెస్ తరపున తన వంతు కృషి చేసినందుకు ఈ పదవి వరించిందని, రాష్ట్రంలో రైతులందరికీ మంచి విత్తనాలు అందించేలా చర్య తీసుకోవాలని, రైతులకు ఏ విధమైన లోటు రాకుండా చూసుకోవాలని కోరారు. ముందు ముందు ఇంకా పదవులు అలంకరించాలని, కష్టపడ్డ వారికి పదవులు ఇచ్చినందుకు కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొంటెముక్కల నాగేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చీమలధర్ గోపి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ఐలయ్య, కూసుమంచి మండల అధ్యక్షులు బాదావత్ నరేష్, వైరా మండల అధ్యక్షులు చింతనిప్పు మాధవరావు, కల్లూరు మండల అధ్యక్షులు శీలం బ్రహ్మారెడ్డి, ముదిగొండ అధ్యక్షులు వల్లూరి భద్రారెడ్డి, చింతకాని అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజని తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీలు

నవతెలంగాణ - బోనకల్

జిల్లావ్యాప్తంగా సోమవారం జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీలను జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ చేపట్టారు. మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 22 గ్రామపంచాయతీలకు ప్రస్తుతం 21 మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. అయితే తూటికుంట్ల గ్రామపంచాయతీ కార్యదర్శి తాళ్లూరు గోపికి మరొక ఉద్యోగం రావడంతో గ్రామపంచాయతీ కార్యదర్శి ఉద్యోగానికి రాజీనామా చేశారు. దీంతో అక్కడ గ్రామపంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. మిగిలిన ఇరవై ఒక్క గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. 40 శాతం సర్వీస్ ఎక్కువగా ఉన్నవారిని, అదేవిధంగా నాలుగు సంవత్సరాలు కాలం దాటిన వారిని బదిలీ చేశారు.

మండల పరిధిలోని చొప్పకట్లపాలెం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బోయినపల్లి శ్రీనివాసరావు చింతకాని మండలం సీతంపేటకు, రాయన్నపేట కార్యదర్శి ఆకుల రేణుక చింతకాని మండలం బొప్పారంకు, రావినూతల పంచాయతీ కార్యదర్శి జొన్నలగడ్డ అశోక్ కుమార్ ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు, లక్ష్మీపురం పంచాయతీ కార్యదర్శి బానోత్ శివుడు ఎర్రుపాలెం మండలం మీనవోలుకు, పెద్ద బీరవల్లి పంచాయతీ కార్యదర్శి గుడికందుల కోటేశ్వరరావు కొణిజర్ల మండలం లింగగూడెంకు, సీతానగరం పంచాయతీ కార్యదర్శి చావా తులసి ఎర్రుపాలెం మండలం పెగళ్లపాడుకు, బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యదర్శి కాంపల్లి ఆదాం రఘునాధపాలెం మండలం రేగులచిలకకు, కలకోట పంచాయతీ కార్యదర్శి బుద్దుల లక్ష్మి ముదిగొండ మండలం కమలాపురానికి, చిరునోముల గ్రామపంచాయతీ కార్యదర్శి బంధం అర్జున్ చింతకాని మండలం నేరడకు బదిలీ అయ్యారు. జానకిపురం పంచాయతీ కార్యదర్శి పరుగు గోపీచంద్ ఎర్రుపాలెం మండలం గోసవీడుకు, ఆళ్లపాడు పంచాయతీ కార్యదర్శి జొన్నలగడ్డ పరశురాములు తల్లాడ మండలం మంగాపురానికి బదిలీ అయ్యారు. ఖాళీగా ఉన్న తూటికుంట్ల గ్రామపంచాయతీకి కూసుమంచి మండలం పెరిక సింగారం నుంచి బి. సురేష్ బదిలీపై వస్తున్నారు. బదిలీ అయిన వారందరూ రెండు రోజులలో తమకు కేటాయించిన ప్రాంతాలలో జాయిన్ కావాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది.

అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి

- ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ఆఫీస్ సిబ్బందికి వినతి

నవతెలంగాణ-మధిర



సర్కారుతో మాట్లాడి ఏండ్లతరబడి నుండి శ్రమిస్తున్న అంగన్‌వాడీ టీచర్స్‌కు, హెల్పర్‌లకు రిటైర్మెంట్ సమయంలో ఇచ్చే సొమ్మును పెన్షన్, గ్రాట్యూటి చట్టం ప్రకారం ఇవ్వాలని, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని ఇతర సమస్యలు పరిష్కారం చేసి న్యాయం చేయాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పిన్నింటి రమ్య అన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా సోమవారం ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందించే కార్యక్రమంలో భాగంగా మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 19 న చలో హైదారాబాద్, మహిళా శిశు సంక్షేమ కమిషనర్ కార్యాలయం ముట్టడి జరుగుతుందని రాష్ట్రంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు బంద్ చేసి హైదారాబాద్‌కు తరలి వెళ్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు, బేతూ శ్రీను, చావా పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవి అయినాల రాంబాబు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఖమ్మం రీజియన్ సహాయ కార్యదర్శి అయినాల రాంబాబు ధన్యజీవి అని సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి అన్నారు. సోమవారం ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో దివంగత అయినాల రాంబాబు దశదినకర్మలు కుటుంబ సభ్యులు, బంధువులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు చిత్రపటానికి సీఐటీయూ, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు పూలమాలలతో ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆర్టీసీ వర్కర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ జయప్రదం కావడంలో అయినాల రాంబాబు కీలక పాత్ర పోషించారని, ఒక మంచి సహచరుడిని కోల్పోయామని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు



తుమ్మ విష్ణువర్ధన్, ఖమ్మం డిపో అధ్యక్ష, కార్యదర్శులు పగిళ్లపల్లి నరసింహారావు, గుగ్గిళ్ళ రోశయ్య, నాయకులు తోకల బాబు, రంగా రామారావు, ఏ. కిరణ్, డీ.శంకర్, ఆర్టీసీ ఉద్యోగుల పొదుపు పరపతి సహకార సంఘం (సిసిఎస్) ప్రతినిధి గుండు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత'

నవతెలంగాణ-పెనుబల్లి

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నదని ఎంఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పెనుబల్లి మండలం సర్వసభ్య సమావేశం ఎంపీపీ లక్కినేని అలేఖ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ అలేఖ్య మాట్లాడుతూ ఐదేళ్లపాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తన పదవీకాలం మంచి సంతృప్తిని ఇచ్చిందన్నారు. ప్రతినిధులు నిర్వహించిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు పెండింగ్ ఉన్నాయని, వాటి సమస్య పరిష్కరించేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సంయుక్తంగా కృషి చేయాలన్నారు. మండలంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని, గతంలో వీఆర్వోల ద్వారా



కట్టడికి తమ వంతు తీసుకున్నామని, ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా, అక్రమ బియ్యం తరలింపుపై తమకు తగిన సమాచారం అందిస్తే అదుపు చేస్తామని తహసీల్దార్ ప్రతాప్ పేర్కొన్నారు. విద్యుత్తు శాఖమండలంలో రైతులకు, వినియోగదారులకు విద్యుత్ కొరత తలెత్తకుండా పూర్తిస్థాయిలో పనిచేయడం పట్ల జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు అభినందనలు వ్యక్తం చేశారు. పశువుల ఆస్పత్రి అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతి సంవత్సరం నిధులు మంజూరవుతున్నాయని, నిధులు ఆస్పత్రి అభివృద్ధి పనులకు వినియోగం జరగకపోవడం, అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతాంగానికి సంబంధించిన పంట నమోదు సంబంధిత శాఖ అధికారులు చేపట్ట డంలేదని జెడ్పీటీసీ పేర్కొన్నారు. ఈ సమావేశ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి వారి సందేశాన్ని ఇచ్చి వెంటనే వెళ్ళిపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీ.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై ఎటూ తేల్చని పోలీసులు

- సీపీకి బాధితుడి ఫిర్యాదు
- విచారణ చేయాలని ఏసీపీకి ఆదేశం

నవతెలంగాణ-ఖమ్మంటౌన్

తన కుమారుడి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని..దీనిపై పోలీసులు సరైన రీతిలో విచారణ చేయడం లేదని మృతుడి తండ్రి బండారు బాబు సోమవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ విచారణకు ఖమ్మం నగర ఏసీపీని ఆదేశించారు. ఈ సందర్భంగా బండారు బాబు మాట్లాడుతూ.. తన కుమారుడు రమణగుట్టలో నివాసం ఉంటున్నాడు. జూన్ 4న ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయినట్లుగా మాకు సమాచారం ఇచ్చారు. కాని నా కుమారుడి మృతిపై మాకు పలు అనుమానాలు ఉన్నాయి. ఇదే విషయమై జూన్ 11న పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కేసు విషయాన్ని సంబంధిత పోలీస్ అధికారులు పట్టించుకోకుండా రోజురోజు ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. అంతే కాక ఖమ్మంలో నా కుమారుడు నివాసం ఉంటున్న ఇల్లు ఆ ఇంటి ఓనర్ ఖాళీ చేయమని చెప్పారు. ఖాళీ చేద్దామని వెళ్లి నా కుమారుడు బైక్ పేపర్లు వెతుకుతున్న సందర్భంలో నా కోడాలి బీరువాలో దాచుకునే చోట ఎలుకల మందు కనిపించింది. ఈ విషయం సంబంధిత కేసు ఆఫీసర్‌కు తెలిపాము. దానిని ఎవిడెన్స్‌గా కలెక్ట్ చేయకుండా ఏముంది.. ఏమైనా పోస్టుమార్టం రిపోర్టులో వస్తుందిగా.. అందులో తేలిద్దిగా ఏమి చేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడో అని చాలా నెగ్లి జెన్సీగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. కనీసం ఆ ఎలుకల మందు ఎందుకువాడారు ఎందుకు అంత భద్రంగా దాచారు అనే కోణంలో విచారణ చేయండం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాక గత నెల 14 పోస్టుమార్టం నిర్వహించారు. కాని ఆ సీరమ్సును ఈనెల 2వ తేదీ వరకు కూడా ల్యాబ్‌కు పంపకుండా ఉంచారని, అడిగితే గదాయించి సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. మా కోడలి తరుపువారు స్థానిక రాజకీయ నాయకులతో మాట్లాడి పైరవి నడిపిస్తున్నట్టు కొంత మంది మాకు తెలిపారు. అందుకే పోలీసులు కేసుపై శ్రద్ధ వహించడం లేదని మాకు అనుమానంగా ఉందని వివరించారు. మేము కేసు పెట్టడానికి ముందు నా కోడలు వారి తల్లిదండ్రులు తప్పు అయిందని, పలుమార్లు పెద్ద మనషులను తీసుకుని వచ్చి కేసు పెట్టవద్దని పలుమార్లు మమల్ని బ్రతిమాలారు. అంతే కాదు మాకు పిల్లగాడికి ఉన్న ఆస్తులు ఏమి వద్దు మేమే మొత్తానికి ఎంతో ఖర్చు అయిందో అంతా మేమే ఇస్తాము కేసు పెట్టవద్దని చెప్పారు. కేసు పెట్టిన తరువాత పోలీసులు రెండుసార్లు వారిని పిలిచి మాట్లాడారు. ఆ తరువాత నుండి వాడే ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు తేల్చి చెప్పారని చెబుతున్నారు. రిపోర్టులు రాకుండా పోలీసులు అలా చెప్పడం పై మాకు పలు అనుమానులు వ్యక్తం అవుతున్నాయని తెలిపాడు. తన కోడలు వేరే వారితో రిలేషన్లో ఉందని స్థానికంగా ఉన్న వారు తెలుపుతున్నరని, అదే వ్యక్తి తన కుమారుడు చనిపోయే రోజు ఒక గంట ముందు ఇంటికి వచ్చి వెళ్లారనే విషయాన్ని స్థానికులు తెలిపారని చెప్పారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాక అమ్మాయి తరుపువారు టూటౌన్ స్టేషన్లో ఆరు లక్షల వరకు డబ్బులు పెట్టినట్టు పలువురు ఆ ఊరిలో ఆరోపిస్తూ మాకు తెలిపారు. వాళ్ల డబ్బులు పెట్టారు మీరు ఇంకా వారిని ఏమి చేయాలేరని అంటున్నారని తెలిపారు.

అంగన్‌వాడీలో ఆట పాటలతో విద్యను అందిస్తాం

నవతెలంగాణ-తల్లాడ



అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్యను అందిస్తామని, రెండున్నర సంవత్సరాలలోపు పిల్లలందరినీ కేంద్రంలో నర్సరీ క్లాస్‌లో చేర్పించాలని సూపర్వైజర్ రోజా కరుణ సూచించారు. సోమవారం తల్లాడ ఎన్టీఆర్ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్వాడి బాట, ప్రత్యేక డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీచర్ శైలజ, చల్లా రమాదేవి, తల్లులు, పిల్లలు, పాల్గొన్నారు.

కోరట్లగూడెంలో 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట'

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని కోరట్లగూడెం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్లో టీచర్ బచ్చలకూర నిర్మల ఆధ్వర్యంలో సోమవారం అమ్మ మాట బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పిల్లలు, తల్లులతో ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీ బడిబాటపై ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమంలో టీచర్ బచ్చలకూరి నిర్మల, పిల్లల తల్లులు మోదుగు ఉమారాణి, బచ్చలకూరి రజిత, మోదుగు భవాని, బచ్చలకూరి కమలమ్మ, కనకం సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి కిరీటాలు అందజేత

నవతెలంగాణ-పెనుబల్లి

మండలంలోని ముత్తగూడెం గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలోని ఉత్సవమూర్తులకు వేమిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, పద్మావతిల దంపతులు సోమవారం రూ. 1.20 లక్షలు విలువ కలిగిన వెండి కిరీటాలను సమర్పించారు. శ్రీ సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో వేద మంత్రోచ్చరణాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి వెండి కిరీటాలను బహూకరించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, పద్మావతి వారి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'30 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలి'

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి పిలుపు మేరకు జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పెన్షనర్లతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా జేఏసీ నాయకులు కల్యాణం నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ ముజిమ్మిల్ ఖాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు గోపీచంద్, పరిశా పుల్లయ్య, ఉమా మహేశ్వరరావు, మహేశ్వరుడు, మధుసూదనరావు, జెల్లా వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, కృష్ణమూర్తి, సీతారాములు, వైకుంఠరావు, మీరాఖాన్, భాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీధర్, ఝాన్సీ, రాములమ్మ కుటుంబరావు, కృష్ణారావు, వీరబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

- 40 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-వేంసూరు

ఆదివారం రాత్రి మండల పరిధిలోని మొద్దులగూడెం, అడసర్లపాడు గ్రామాలలో టాస్క్‌ఫోర్స్ అధికారులు రేషన్ షాపులో దాడులు నిర్వహించారు. అడసర్లపాడులో 20 క్వింటాలు, మొద్దులగూడెంలో ఓ వ్యక్తి వద్ద నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

ట్రైకోడెర్మా విరిడీని తప్పనిసరిగా వాడాలి

- మండల వ్యవసాయ అధికారి వాణి

నవతెలంగాణ-కూసుమంచి

మిరప పంట వేసే రైతులందరూ ట్రైకోడెర్మా విరిడీని తప్పనిసరిగా వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.వాణి తెలిపారు. సోమవారం మండలంలోని లోక్యాతండా గ్రామంలో భీమా నాయక్ అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో ట్రైకోడెర్మా విరిడి వాడకంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వాణి మాట్లాడుతూ...ఎకరానికి 90 కేజీల పశువుల ఎరువులో రెండు కేజీలు ట్రైకోడెర్మా విరిడి, 5 కేజీల వేప పిండి కలిపి పది రోజులు మాగ పెట్టి ఆఖరి దుక్కిలో చల్లడం వలన మిరపలో వచ్చే వేరు కుళ్ళు వంటి తెగుళ్లను అరికట్టవచ్చని సూచించారు. అదేవిధంగా మిరప నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

రాఘవులు కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు మండలపరిధిలోని కొర్లగూడెం గ్రామానికి చెందిన మట్టా రాఘవులు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, పీ. నగేష్, పరిమి భరత్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | జులై 16, 2024 | www.navatelangana.com


కొత్తగూడెం : ప్రదర్శనగా వస్తున్న దృశ్యం


భద్రాచలం రూరల్ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ప్రయివేట్‌కు దీటుగా ఫ్రీ స్కూల్ విద్య...

- నూతన విద్యావిధానం
అమ్మ మాట-అంగన్వాడీ బాట లక్ష్యం
- సీడీపీఓ రోజా రాణి



నవతెలంగాణ-అశ్వారావుపేట

ప్రయివేట్‌కు దీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యను అందించడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యం అని, అందుకు అనుగుణంగానే ఐసీడీఎస్ (మాతా శిశు సంక్షేమ శాఖ) అమ్మ మాట-అంగన్వాడీ బాట అనే కార్యక్రమానికి రూపకల్పన చేసిందని సీడీపీఓ రోజా రాణి అన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం నియోజక వర్గ కేంద్రం మండలం అయిన అశ్వారావుపేట, జమ్మి గూడెం సెక్టార్‌లో గల జమ్మి గూడెంలో ప్రారంభించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుండి 20 వరకు ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టినట్టు తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చొరవతో యూనిఫాం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్‌లు నాదేండ్ల సౌజన్య, వరలక్ష్మి, పద్మావతి, అంగన్వాడీ టీచర్ డి.నర్సమ్మలు పాల్గొన్నారు.

అశ్వపల్లి : మండల పరిధిలోని రామాంజిగూడెం గ్రామ పంచాయతీలో 'అమ్మ మాట-అంగన్వాడీ బాట' కార్యక్రమం స్థానిక ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.విజయ కుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..2 సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని ప్రజలకు తెలిపారు. దీనికి ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎం.సుజాత, కె.కళావతి, యు.సుజాత, ఈ.భారతి, ఎఎస్ హెచ్ వీవోలు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : అమ్మ మాటలతో చిన్న పిల్లలను అంగన్వాడీ బాట పట్టించాలని మండల పరిధిలోని పెద్దిరెడ్డి గూడెం గ్రామ పంచాయితీలో అంగన్వాడీ సూపర్వైజర్ అరుణ ఆధ్వర్యంలో అమ్మ మాట బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ టీచర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మి, జ్యోతి, అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి, వాణి, కుమారి, పుష్ప, ఆశావర్కర్లు లలిత, వెంకటలక్ష్మి, సీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



వాతావరణం మార్పు, వర్షాకాలం నడుస్తున్నందున ఆశ్రమ పాఠశాల గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు వైరల్ ఫీవర్ వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడవలసిన బాధ్యత సంబంధిత ఉపాధ్యాయులపై ఉందని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేనందున వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులు పంపుతూ సాధ్యమైనంత తొందరగా అర్హులైన ప్రతి గిరిజనులకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. గిరిజన దర్బార్లో భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, పోడు భూముల పట్టాలు అసైన్ చేయుట కోసం, వ్యవసాయానికి సంబంధించి కరెంటు మోటారు బోరు ఇప్పించుట, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి సబ్సిడీపై రుణాలు ఇప్పించుట, గిరిజన గ్రామాలలో నూతనంగా మత్య సొసైటీలు ఏర్పాటు, తదితర సమస్యలపై గిరిజనులు అర్జీలు పెట్టుకున్నరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, యస్డీసీ ట్రైబల్ వెల్ఫేర్ రవీంద్రనాథ్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, డీటీఆర్ఓ ఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏసీఎంఓ రమణయ్య, ఉద్యానవనాధికారి అశోక్, కొండరెడ్ల అధికారి నరేష్, ఏపీవో పవర్ మునీర్ పాషా, మిషన్ భగీరథ ఏఈ నారాయణరావు, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సావిత్రి, మేనేజర్ ఆదినారాయణ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ, హెచ్ఈఓ దుర్గయ్య సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి ఆలయ అర్చకుల బదిలీల ప్రక్రియను ఆపాలి : కొడాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న ఆలయ అర్చకులను బదిలీ చేయాలని దేవస్థానం ఉన్నతాధికారులు నోటీసులు ఇవ్వడంపై సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం ఇవ్వనున్నట్టు మహబూబాబాద్ తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గం ఉపాధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్ తెలిపారు. భద్రాద్రి ఆలయ నిర్మాణం తర్వాత భక్త రామదాసు ఐదు కుటుంబాలను తమిళనాడు నుంచి అర్చకత్వం చేయడానికి తీసుకువచ్చారని, వారి కుటుంబికులే అప్పటి నుంచి ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్నారని, అనువంశిక అర్చకులుగా ఉన్నారని కొడాలి శ్రీనివాసన్ తెలిపారు. ఎంపీ పోరిక బలరాం నాయక్‌కి, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అలాగే ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్యకి కూడా ఈ విషయమై వినతిపత్రం ఇస్తామని కొడాలి శ్రీనివాసన్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కుంచాల రాజారామ్, యస్.కే.అజీమ్, కంభంపాటి సురేష్, కోనేరు రాము, అబ్బినేని శ్రీనివాస్, తాళ్లూరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల ఆగ్రహం...

సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కార్యాలయాలు ముట్టడి, ధర్నా

- భారీగా తరలి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొనసాగిన ధర్నా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుతో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు క్యాంపు కార్యాలయాన్ని భద్రాచలం నియోజకవర్గం అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం ముట్టడించి, ధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటలకే నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం చేరుకొని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు జిలకర పద్మ మాట్లాడారు. జీవో నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలను బలవంతపు పదవి విరమణ ఆపివేయాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ పొందిన అంగన్వాడీ కార్యకర్తలకు సగం జీతం పెన్షన్ రూపంలో అందించాలని కోరారు. అదేవిధంగా అంగన్వాడీ కార్యకర్తలు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న పెండింగ్ బిల్లుల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరసన శిబిరాల వద్దకు వచ్చి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని ఆరోపించారు.

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తా ఎమ్మెల్యే తెల్లం హామీ

అంగన్వాడీ ధర్నా విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు వెంకట్రావు హుటాహుటిన క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకొని అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నారు. అనంతరం అంగన్వాడీ సమస్యలపై ఈనెల 24 నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సంబంధించిన కమిషనర్ శిశు సంక్షేమ శాఖ మంత్రికి ఉత్తరాలు రాసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చి నిరసనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంపీ నర్సారెడ్డి, సీనియర్ నాయకులు గడ్డం స్వామి, ఎర్రంశెట్టి వెంకట రామారావు, బండారు శరత్ బాబు, సంతోష్ కుమార్, అప్పారి రాము, చుక్కా మాధవరావు, నాగరాజు, లక్ష్మణ్, అజయ్ కుమార్, అంగన్వాడి కార్యకర్తలు నాగశీల, సావిత్రి, రాధా కుమారి, విజయశీలి, వీరభద్రమ్మ కమలాదేవి, సరూప, రమణ, సావిత్రి, విజయ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం

కొత్తగూడెం : అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నష్టం కలిగించే జీవో నెంబర్ 10ని రద్దు చేయాలని, టీచర్‌కు రూ.2లక్షలు హెల్పర్‌కు రూ.1లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించే విధంగా కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్ చేస్తు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్త్రీ, సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకి, ఐసీడీఎస్ డైరెక్టర్‌కి ఎమ్మెల్యేలు అందరూ లేఖలు రాయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎమ్మెల్యేల కార్యాలయాల ముట్టడి సందర్భంగా సోమవారం కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇచ్చిన వాగ్దానాలను కూడా ప్రభుత్వం అమలు చేయని కారణంగానే పోరాటంలోకి రావాల్సి వచ్చిందన్నారు. ఎన్నికల ముందు అంగన్వాడీల సమ్మెని, సమ్మె డిమాండ్లను బలపరిచిన నాయకులకు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తర్వాత ఆ డిమాండ్ల పరిష్కారానికి వారు ఎందుకు స్పందించడం లేదని..? ప్రశ్నించారు. ఎమ్మెల్యేలందరూ త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో కార్మికుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేశారు. చివరి నెల జీతంలో సగం జీతం పెన్షన్‌గా ఇవ్వాలని, ఐసిడిఎస్ శాఖ ద్వారా పెన్షన్ పంపిణీ జరగాలని సిఐటియు డిమాండ్ చేసింది. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అందుబాటులో లేని కారణంగా వారితో సిఐటియు నాయకులు ఫోన్‌లో మాట్లాడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీసీకి వినతి పత్రం అందజేశారు. తొలుత ఎమ్మెల్యే కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య, ఉపాధ్యక్షులు దొడ్డ రవి, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, అంగన్వాడీ టీచర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు నాయకులు పద్మ, కళావతి, రమ్య భాను, శైలజ అచ్చమ్మ, పద్మ లక్ష్మి, సుజాత, వరలక్ష్మి, రత్నకుమారి జుబేదా, నాగమణి, శశికళ, భాగ్యమ్మ, రమా తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలం : ఎమ్మెల్యేకి వినతి ఇస్తున్న దృశ్యం


కొత్తగూడెం : ఎమ్మెల్యే కార్యాలయం సీసీకి వినతి ఇస్తున్న దృశ్యం


ఇల్లందు

సమస్యలు పరిష్కరించాలి

ఇల్లందు : అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుతో ఎమ్మెల్యే కార్యాలయం, ఐసీడీఎస్ ఇల్లందు, టేకులపల్లి ప్రాజెక్టుల వద్ద అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకొని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నేతలు ఈసం వెంకటమ్మ, అబ్దుల్ నబి మాట్లాడారు. జీవో నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలని, అంగన్‌వాడీ కార్యకర్తలను బలవంతపు పదవి విరమణ ఆపివేయాలని డిమాండ్ చేశారు.

సమస్యను అసెంబ్లీ సమావేశంలో ప్రసావిస్తాం ఎమ్మెల్యే కోరం కనకయ్య

అంగన్వాడీ సమస్యలపై ఈనెల 24 నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కల్లేపల్లి మరియా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ మాట్లాడారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఆలేటి కిరణ్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బయ్యా అభిమన్యులు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ రెండు ప్రాజెక్టుల లీడర్లు రాంబాయి, ఫాతిమా, పాయం సారమ్మ, ధనమ్మ, కోమరం జయశ్రీ, ఆలేటి సంధ్య, సోమలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.


మణుగూరు : ఎమ్మెల్యే పాయంకి వినతి ఇస్తున్న దృశ్యం

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పట్ల నిర్లక్ష్యం

మణుగూరు : అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను ఉత్తి చేతులతో బయటకు పంపిస్తే ఊరుకునేది లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.విఅప్పారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వి.అప్పారావు మాట్లాడారు. జీవో నెంబర్ 10 రద్దు చేయాలని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, టీచర్‌కి రెండు లక్షలు, హెల్పర్‌కు లక్ష పెంచి కొత్త జీవోను జారీ చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ హెల్పర్ల సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా కేంద్రంతో ముడిపడి ఉన్నాయని, సమస్యలు పరిష్కారం కోసం మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి విశాఖలో ప్రధాన కార్యదర్శికి నా లెటర్ ప్యాడ్‌తో పంపిస్తానని తెలిపారు. అసెంబ్లీలో మాట్లాడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సభ్యులు గద్దల శ్రీనివాసరావు, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుల నెల్లూరి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు హేమలత, జిల్లా నాయకులు సత్ర పల్లి సాంబశివరావు, అంగన్వాడీ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.


దమ్మపేట

దమ్మపేట : కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడి సమస్యలు చర్చించి జీవో నెంబర్ 10 నిరద్దుచేసి టీచర్‌కి రెండు, ఆయాకు లక్ష రూపాయలు బెనిఫిట్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే పీఏ కొర్స రవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరమ్మ, జ్యోతి, శాంతి, రాధ, కృష్ణవేణీ, రాజేశ్వరి, లక్ష్మీ, రాజ్యలక్ష్మి వెంకటేశ్వరమ్మ, ప్రవీణ, యూటీఎఫ్ మండల కార్యదర్శి రమేష్, శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మోరంపుడి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు దొడ్డ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమలు నివారణ కోసం బ్లీచింగ్

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

సీజనల్ వ్యాధులు ప్రారంభం కావడంతో పంచాయతీ ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకూడదని ముందస్తుగానే నర్సాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి పాషా సోమవారం పంచాయతీ కార్మికులతో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ష కాలం కావడం చిన్నపాటి వర్షాలకు కూడా నీళ్ళు నిల్వ ఉండడం వలన దోమలు పెరిగే అవకాశం ఉందని, దోమలు వలన విష జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కావునా దోమలు నియంత్రణ కోసం డ్రైనేజీల్లో అదేవిధంగా నీటి నిల్వలు వున్న దగ్గర రోడ్డుకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది వెంకటకృష్ణ, కన్నయ్య, సత్యం, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

పడవను సీజ్ చేసిన ఎంపీఓ

నవతెలంగాణ-పినపాక



అనుమతి లేకుండా మండల పరిధిలో గల భూపతిరావుపేట గోదావరిలో నావ నడుపుతున్నారని సమాచారం రావడంతో ఎంపీఓ వెంకటేశ్వరరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనుమతి లేకుండా ప్రయాణికుల రవాణా చేస్తున్న నావను గుర్తించి సీజ్ చేసినట్లుగా ఎంపీఓ తెలియజేశారు. అనంతరం వెంకటరావుపేట గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రధాన రహదారులపై వర్షపు నీరు చేరడంతో జేసీబీల సహాయంతో ఆ నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే సెక్రటరీలకు తెలియజేయాలని తెలిపారు. బ్లీచింగ్ పనులను చేయడమే కాకుండా దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ సైతం చేస్తున్నామని తెలిపారు. బయ్యారం క్రాస్ రోడ్‌లో డ్రయినేజీ పనులను పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా త్వరగతిన పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా పోలీస్ స్టేషన్ ముందు నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నారని అనేకమంది ఫిర్యాదు చేయడంతో గత 20 రోజులుగా ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో డ్రైనేజీ క్లీనింగ్ పనులు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు జైపాల్ రెడ్డి, చంద్ర కుమార్, ఆదినారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలి

- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-చర్ల



మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బస్టాండ్ సెంటర్, ఆర్ అండ్ బీ రోడ్డు నుండి ఎంపీడీవో కార్యాలయం, జూనియర్ కాలేజీకి వెళ్లే ప్రధాన రహదారికి పెద్ద ఎత్తున గుంతలు పడి ప్రజలు నడవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మోటార్ సైకిల్లు, ఆటో నడిపేందుకు కూడా తీవ్ర ఇబ్బందిగా ఉన్నది. వర్షం పడితే రోడ్డు మొత్తం బురద మయం అవుతుంది. అత్యంత భయంకరంగా ఉన్న రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గుంతలుపడి రహదారిపై మొత్తం బురదమయం అయిన రహదారిపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మేజర్ గ్రామపంచాయతీ నుండి గాని మండల పరిషత్ అభివృద్ధి నిధుల నుండి గాని తక్షణమే రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తామని పేర్కొన్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కూడా గ్రామపంచాయతీ, మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు పామర్, బాలాజీ, సీఐటీయూ నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే బదిలీలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాల, కళాశాలలో పనిచేయుచున్న జూనియర్ అసిస్టెంట్లు నాలుగో తరగతి సిబ్బందికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు చేసినట్టు ఆర్‌సీఓ గురుకులం ఖమ్మం రీజియన్ వెంకటేశ్వరరాజు అన్నారు. సోమవారం పీఎంఆర్సి భవనంలోని సమావేశ మందిరంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు కమిటీ సభ్యుల సమక్షంలో గురుకుల పాఠశాల కళాశాలలో పనిచేయుచున్న జూనియర్ అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, మల్టీ పర్పస్ వర్కర్, కిచెన్ సహాయకులకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 శాతం సిబ్బందికి బదిలీలు చేయవలసి ఉండగా 26 మందిని బదిలీ చేశామని, అందులో జూనియర్ అసిస్టెంట్‌లు 05, ల్యాబ్ అసిస్టెంట్లు 07, కార్యాలయం సహాయకులు 05, మల్టీపర్పస్ వర్కర్లు 07, కిచెన్ సహాయకులు 02 కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేశామని ఆయన అన్నారు. ఈ బదిలీల ప్రక్రియ ఎటువంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఏవో నరేందర్, పర్యవేక్షకుడు కృష్ణార్జున, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్, గురుకులం సిబ్బంది చంటి, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పానుగంటే చిత్ర పటానికి ఆయిల్ ఫెడ్ అధికారులు నివాళి

నవతెలంగాణ-దమ్మపేట

ఇటీవల అనారోగ్యంతో మరణించిన ప్రజా నాయకుడిగా పేరుందిన పానుగంటే సత్యం చిత్రపటానికి అప్పారావుపేట ఆయిల్ ఫెడ్ అధికారులు సోమవారం నివాళులు అర్పించారు. సత్యం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఆకుల బాలకృష్ణ, మేనేజర్ కళ్యాణ్ గౌడ్, రాధాకృష్ణ కార్తీక్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఇన్‌చార్జి ఎంపీడీవో బి.శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండలంలో ప్రజలు ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఈతకు, చేపల వేటకు వాగులు, చెరువులు, తదితర వాటి దగ్గరకు వెళ్లకుండా కట్టడి చేయాలని స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీవో బత్తిన శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం రాయిపాడు గ్రామ సమీపాన గల బ్రిడ్జి వద్ద కిన్నెరసాని వాగు వరద ఉధృతిని నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో కిన్నెరసాని వాగు పొంగి ప్రవహిస్తున్న కారణంగా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున దాటరాదని చెప్పారు.

త్రివేణి పాఠశాలలో హౌస్ ఎలక్షన్స్

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



స్థానిక లక్ష్మీదేవి పల్లి మండలంలో గల త్రివేణి పాఠశాలలో హౌస్ ఎలక్షన్స్ సోమవారం పాఠశాల సిబ్బంది నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను విద్యార్థి దశనుంచే అలవర్చాలని సదుద్దేశంతో బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు చేసి ఓటరు స్లిప్పులు వంటి నమూనాలతో కెప్టెన్, వైస్ కెప్టెన్, ఎంపిక చేయడంలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా హౌస్ ఎలక్షన్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాలల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, గొల్లపూడి జగదీష్, సీఆర్ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, ప్రిన్సిపల్స్ వైవి సురేష్, శ్రీనివాస్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్స్ సౌజన్య, ఫాతిమా, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి 'మహిళా శక్తి పథకం'

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ

మహిళలను ఆర్థికంగా బలోపేతానికి మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ జితేష్ వి. పాటిల్. అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా శక్తి పథకంపై అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీఎంలు, మహిళా సంఘ సభ్యులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ సభ్యులు, ఆఫీస్ బేరర్లకు మహిళా శక్తి పథకంపై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలకు జీవనోపాధి కల్పించాలని, వారిని ఆర్థికంగా కోటీశ్వరులని చెయ్యాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ పథకాన్ని జిల్లాల్లో విజయవంతంగా అమలుపరచాలని తెలిపారు. స్వయం సహకారక సంఘాల ద్వారా పలు రకాల పరిశ్రమలను ఏర్పాటు చేసి మహిళలు అభ్యున్నతికి ఈ పథకం తోడ్పడుతుందని ఆయన తెలిపారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేసే చిన్న పరిశ్రమలు వాటి ద్వారా తయారయ్యే వస్తువుల మార్కెట్ మరియు ప్రజలకు అవసరమైన వస్తువులు చేయడం ద్వారా విజయం సాధించవచ్చని సూచించారు. అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీఎం లు వారి లక్ష్యాల కోసం మహిళా సంఘాలపై ఒత్తిడి తేవద్దని వారికి అవగాహన ఉన్న పరిశ్రమల ఏర్పాటుపై ప్రోత్సహించాలని సూచించారు. రానున్న సంవత్సర కాలంలో జిల్లా లక్ష్యం వ్యవసాయం, చేపల పెంపకం, పాడి పరిశ్రమ, కోల్డ్ స్టోరేజ్ ప్రయోగాత్మకమైన పద్ధతుల ద్వారా అభివృద్ధి సాధించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ విద్యాచందన, జడ్పీ సీఈవో చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, పశుసంవర్థక శాఖ అధికారి పురందరేశ్వర్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఆటో డ్రైవర్ మృతి

నవతెలంగాణ- బూర్గంపాడు

ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి సమయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరు మండలం సీతారామనగరం గ్రామానికి చెందిన ఐతంరాజు శ్రీను(34) చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా శనివారం అర్ధరాత్రి సమయంలో ఆటో వేసుకుని భద్రాచలం నుంచి ఇంటికి వెళుతున్నట్లు తెలిపారు. భద్రాచలం డిపోకు బస్సు ఖమ్మం నుంచి భద్రాచలం వైపునకు వెళ్తుండగా గొమ్మూరు ఇసుక ర్యాంపు సమీపంలో ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జు నుజ్జు కావడంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసు కున్న ఎస్ఐ రాజేష్ ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆటోలో ఇరుక్కుపోయిన మృతదేహన్ని స్థానికుల సహాయంతో బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఐతంరాజుల రత్నకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై రాజ్ కుమార్

నవతెలంగాణ-పినపాక

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ.బయ్యారం ఎస్హెచ్ఓ రాజ్ కుమార్ సూచించారు. సోమవారం ఈ బయ్యారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. గుర్తుతెలియని (ఫేక్ కాల్స్) నెంబర్ నుంచి ఫోన్ కాల్ వస్తే ఎవరూ లిఫ్ట్ చేయవద్దన్నారు. ఫోన్ చేసేవారు బ్యాంకు సిబ్బందిమని ఏటీఎం బ్లాక్ అయిందని చెప్పి ఓటీపీ పంపి వాటిని పంపించాలని కోరుతారన్నారు. వారు అడిగిన సమాచారం ఇస్తే బ్యాంకు ఖాతాలోని డబ్బులు దొంగిలిస్తారని తెలిపారు. అలాగే మొబైల్‌కి వచ్చే అనవసరమైన లింకులను అసలు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎవరైనా ఆన్ లైన్ మోసాల బారిన పడితే వెంటనే సైబర్ క్రైమ్ స్టేషన్‌లో, 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఓటీపీలు, లింక్లు, ఇతర ఆన్ లైన్ మోసాలకు గురైన బాధితులు సైబర్ స్టేషన్ లో లేదా స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు ఘన స్వాగతం

నవతెలంగాణ-బూర్గంపాడు

మండలంలోని అంజనాపురం ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు విద్యార్థులు, గ్రామస్తులు కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన విద్యార్థులను ఉన్నంతగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు సైతం స్వాగతం పలికిన తీరుకు ఆనందం వ్యక్తం చేశారు. బదీలిపై వచ్చిన వారిలో బాబురావు తెలుగు, శంకర్ గణితం, సునీత ఆంగ్లం, పద్మ తెలుగు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తేజావత్ కిషన్ రావు, మాజీ ఉప సర్పంచ్ భూక్యా ఆనందరావు, తేజావత్ గాంధీ, బోడ దిలీప్, బోడ అశోక్ పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-కరకగూడెం



మండల పరిధిలోని బట్టుపల్లి గ్రామపంచాయతీలోని ప్రధాన రహదారి నుంచి లక్ష్మీపురం గ్రామం వరకు రహదారులు అద్వానంగా మారాయని స్థానికులు తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టిచ్చుకున్న పాపానపోలేదనని ప్రజలు వాపోయారు. వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణం నరకంగా మారిందని గ్రామ ప్రజలు వాపోతున్నారు. పేరుకే బీటీ, సీసీ రోడ్లు కానీ అవి మట్టి రహదారులకంటే అధ్వానంగా వున్నాయి. మండలంలో చాలా రోడ్లు ఇలానే ఉన్నాయని తెలిపారు. రోడ్లు బురదతో నిండడంతో వాహనదారులు భయంతో నడపవలసిన పరిస్థితి ఉందన్నారు. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయక పోవడంతో పాదాచారులు సైతం పడరాని కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కనీసం రోడ్లకు మరమ్మతులు చేసి వాహనదారుల ప్రయాణ కష్టాలు తీర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్య పరిష్కరించాలి : భట్టుపల్లి గ్రామస్తుడు మిట్టపల్లి మోహంత్



రోడ్డు అధ్వాన్నంగా తయారయింది. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా తయారై వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఈ రహదారి పై ప్రయాణం చేయాలంటేనే భయం వేస్తోంది.

ఘనంగా రోటరీ క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక భద్రాచలంలోని జూనియర్ కాలేజ్ సెంటర్లో గల గుప్తా కన్వెన్షన్ హాల్ నందు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రరావు ఇన్స్టాలేషన్ ఆఫీసర్ గా రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మల్లాది వాసుదేవరావు, గెస్ట్ ఆఫ్ హానర్ రోటరీ డిప్యూటీ గవర్నర్ సాంబశివరావు, ఇన్స్టాలేషన్ ఆఫీసర్గా పాస్ట్ ప్రెసిడెంటు పలివెల భూషణ్ రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా దారా బాలాజీ రావు, కార్యదర్శిగా నూకల విద్యాసాగర్, ట్రెజరర్‌గా వందవాసు శ్రీనివాసరావుచే రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మల్లాది వాసుదేవరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ ప్రెసిడెంట్ శ్రీమహాలక్ష్మి నూతన అధ్యక్షుడు దారా బాలాజీ రావుకి బాధ్యతలు అప్పగించారు. నూతన సభ్యులుగా పచ్చినీలం బాల శ్రీ కృష్ణ మహేంద్ర, తోటమల్ల బాలయోగి, డాక్టర్ సంతోష్, కొండవీటి సందీప్, పోకాల మోహన్ కృష్ణ, మారం వెంకటేశ్వర రెడ్డి, కొదమూరు రామకృష్ణారావు, శేషు కుమార్‌తో అసిస్టెంట్ గవర్నర్ పలివెల భూషణ్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం స్వాధీనం

నవ తెలంగాణ - జూలూరుపాడు

బేతాళ పాడు గ్రామంలో ఒక వ్యక్తి రేషన్ బియ్యాన్ని అక్రమంగా డంపు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాణా ప్రతాప్ దాడి చేసి పట్టుకున్నారు. 7 క్వింటాళ్ల రేషన్ స్వాధీనం చేసుకున్నారు. సదరు గోపయ్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మా పాఠశాలకు టీచర్లను కేటాయించండి

- ప్రజావాణిలో గుమ్మడి వల్లి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు

అశ్వారావుపేట : మండలంలోని గుమ్మడి వల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల లేమి కలెక్టరేట్‌కు చేరింది. మా పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని సోమవారం పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు స్థానిక ఎంపీటీసీ తిరుపతి రావు నేతృత్వంలో జిల్లా కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు. అక్కడే ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటాచారి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని భరోసా ఇచ్చారు. పాఠశాలకు ఐదుగురికి డిప్యుటేషన్ ఇవ్వగా సోమవారం మాత్రం తెలుగు ఉపాధ్యాయురాలు మాత్రం జాయిన్ అయినట్లు హెచ్.ఎం తాళ్ళపాటి వీరేశ్వరరావు తెలిపారు.

రూ.10 వేలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

అశ్వారావుపేట : బ్యాంకు ఖాతాకు సంబంధించి ఈ కేవైసీ వివరాలు అప్డేట్ పేరుతో సైబర్ నేరగాళ్లు నగదు స్వాహా చేసిన ఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తిరుమలకుంటకు చెందిన మామిడి వెంకట మహాలక్ష్మికు వాట్సాప్‌కు ఓ లింకు రాగా ఓపెన్ చేసిన కొద్ది సేపటి తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి యూనియన్ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని, ఈ కేవైసీ అప్డేట్ చేయకపోతే బ్యాంక్ అకౌంట్ నిలిచిపోతుందని చెప్పాడు. బాధిత యువతి ఫోన్ మాట్లాడుతున్న క్రమంలోనే తన రెండు బ్యాంకు ఖాతాల్లో నుంచి రూ.10,700 లు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. అనంతరం వినాయకపురం యూనియన్ బ్యాంకు వద్దకు వెళ్లి ఆరా తీయగా, సైబర్ మోసగాళ్లు నగదు కాజేసినట్లు గుర్తించారు. దీనిపై బాధిత యువతి సైబర్ క్రైం హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేసింది.

గోదావరి జలాలు ఏ ఒక్కరి సొత్తు కాదు

- అందరికీ నీరందించే బాధ్యత ప్రజా ప్రతినిధులదే
- నియోజవర్గ ప్రాంతానికి నీరందించాలి
- జిల్లా ఎమ్మెల్యేలకు అఖిలపక్షం వినతి

నవతెలంగాణ-ఇల్లందు



భద్రాద్రిలో పారే గోదావరి జలాలు ఏ ఒక్కరి సొత్తు కాదని అందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిదులదేనని అఖిలపక్షం పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టు డిజైన్ వల్ల ఇల్లందు నియోజకవర్గానికి చుక్క సాగునీరుపారదని దీనిపై పునరాలోచన చేసి డిజైన్ మార్పు ద్వారా ఏజెన్సీ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని కోరింది. ఈ మేరకు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న పినపాక, భద్రాచలం, ఇల్లందు ఎమ్మెల్యేలకు అఖిలపక్ష నేతలు వినతి పత్రం అందజేశారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, బంధం నాగయ్య, ఆలేటి కిరణ్, నూతన పాటి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేలకు వివరిస్తూ గోదావరి నది జలాలపై నిర్మించే ఎత్తిపోతల దుమ్ములగూడెం ప్రాజెక్టును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2006 సం.లో ఇందిరా సాగర్ రాజీవ్ సాగర్ పేర్లతో శంకుస్థాపన చేసి శ్రీకారం చుట్టారని మరల నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దానిని సీతారం ప్రాజెక్టుగా నామకరణం చేసి రోళ్లపాడు చెరువు వద్ద శంకుస్థాపన చేసారు. మొదట ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలనే సంకల్పంతో ప్రారంభించారని తెలిపారు. కాని పాలకులు స్వార్థపూరిత ఆలోచనలతో ప్రాజెక్టు డిజైన్లను మార్పులు చేస్తు ఏజెన్సీ ప్రాంతానికి చుక్క నీరు రాకుండా చేస్తున్నారు. ప్రస్తుతం ఇప్పుడు ఉన్న డిజైన్ వల్ల మొదటి దశలో ఉమ్మడి ఖమ్మం వరంగల్ జిల్లాల పరిధిలోని 26 మండలాలకు నీరు అందుతుందని తరువాత దశలో మిగిత ప్రాంతాలకు విస్తరింపజేస్తామని, అందులో 16 ఏజెన్సీ ప్రాంత మండలాలు ఉన్నప్పటికీ మైదాన ప్రాంత 10 మండలాల ఆయకట్టులో సగం కూడా ఉండదు. సీతారాం ప్రాజెక్టు కింద పేర్కొన్న ఆయకట్టులో మూడింట రెండువంతులు పాత ఆయకట్టు స్థితికరణకే కేటాయించారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇల్లందు నియోజకవర్గ ప్రాంతానికి సాగునీరు అవసరాలు తీర్చాలని, ఆ తరువాతే బయటి ప్రాంతాలకి తీసుకెళ్ళాలని డిమాండ్ చేశారు.



జూలూరుపాడుకు నీళ్లు ఇవ్వాలని సీతారామ పనులు అడ్డగింత

తహసీల్దార్‌కి వినతి పత్రం

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు మండలానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందించాలని కోరుతూ సోమవారం వినోబ నగర్ గ్రామం వద్ద ప్రాజెక్టు పనులను మండలానికి చెందిన రైతాంగం అఖిలపక్ష రాజకీయ పార్టీలు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ మన ప్రక్క నుండి కాలువ పోతున్నప్పటికీ జూలూరుపాడు ప్రాంతానికి నీళ్లు ఇవ్వక పోవడం సరైనది కాదని ఇది ప్రభుత్వం ద్వందనీతికి నిదర్శనమని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతారాం ప్రాజెక్టు కాలవలు నిర్మించే క్రమంలో ఈ జిల్లాలో పాత డిజైన్ ప్రకారం నిర్మాణం చేసి నీళ్లు ఇవ్వాలని అఖిలపక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మొదటి దపాలోనే జిల్లాలో నీళ్లు ఇవ్వాలని, దానికి పిల్ల కాలువలు నిర్మించేందుకు నిధులను తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలంలో దండాల చెరువు, శనగచెరువు, ఎర్ర చెరువు, కప్పలకుంట చెరువు, జమ్మికుంట చెరువులకు పిల్ల కాలువలు నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా కాకతీయుల కాలంలో నిర్మించిన పోలారం చెరువు గండి పూడ్చి, రిజర్వాయర్‌గా నిర్మించి సీతారామ ప్రాజెక్టు నీళ్లను నింపి మండలాన్ని సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం నిధులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతంలో నీళ్లు ఇవ్వకుండా పక్క జిల్లాకు తరలించేందుకు నిర్మిస్తున్న లింకు కెనాల్ నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని ఈ సందర్భంగా అఖిలపక్షం డిమాండ్ చేసింది. మా నీళ్లు మాకని తెలంగాణ పోరాటం చేసామని, నేడు తెలంగాణలోనే పక్క జిల్లాకు నీళ్లు తరలించేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రయత్నం చేయటం సరైనది కాదని అఖిలపక్షం ఆరోపించింది. ఏకపక్షంగా నీళ్లదోపిడీకి ప్రభుత్వం పూనుకుంటే ఈ ప్రాంత రైతాంగం సరైన గుణపాఠం చెప్తుందని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్‌కే ఉమర్ మియా, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు, సీపీఐ మండల కార్యదర్శి గుండెపెన్ని వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యాస నరేష్, ప్రజాపంథా మండల కార్యదర్శి బానోత్ ధర్మ, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్, బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, వివిధ పార్టీల నాయకులు రైతులు ఎస్కే చాంద్ పాషా, బానోత్ మధు, వల్లమల చంద్రరావు, లకావత్ శ్రీను, పొన్నగంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీలో రేషన్ కార్డు నిబంధనలు తొలగించాలి

- 2018 డిసెంబర్ 12 గడువు లేకుండా
- రుణమాఫీ చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ

నవతెలంగాణ-పాల్వంచ



రైతు రుణమాఫీలో రేషన్ కార్డు నిబంధనలు తొలగించాలని, గత పదిహేను సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయలేదని రైతు కుటుంబం గుర్తింపుకి ఆహార భద్రత కార్డు క్రైటీరియాగా తీసుకోవటం సరైందని వెంటనే నిబంధన తొలగించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పాల్వంచలో జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన రుణమాఫీ నిబంధనలు వల్ల అనేక మంది రైతులు రుణమాఫీకి అర్హత కోల్పోతారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయలేదని ఈ పది సంవత్సరాలలో వివాహం అయ్యి వేరే కుటుంబాలుగా ఉంటూ వ్యవసాయం చేస్తున్న యువ రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఉన్న రద్దు అయ్యే పరిస్థితి లేదని వెంటనే రేషన్ కార్డు నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టాదార్ పాస్ పుస్తకం కలిగిన రైతులకు రుణమాఫీ అంటే ధరణి పాసుపుస్తకాలు కంటే ముందు చేతి రాత పహణీనకల, మీ పహణి ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు వర్తించకుండా పోయే అవకాశం ఉందని, రాష్ట్రంలో అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతు కుటుంబాల వారసులకి ధరణి పాస్ పుస్తకాలు మంజూరు కాక పెండింగ్లో ఉన్నాయని, అలాంటి రైతులకు కూడా రుణమాఫీ వర్తించే అవకాశం లేదని అన్నారు. 2014 సంవత్సరం నుంచి కేసిఆర్ ప్రభుత్వం రెండు దఫాలుగా అమలు చేసిన రుణమాఫీ కాకుండా రైతులు ఇంకా ఉన్నారని, ఆ రైతులు బ్యాంకు రుణాలు 2018 డిసెంబర్ 12 గడువు లేకుండా రైతు రుణమాఫీ వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీవోలో పేర్కొన్న నిబంధనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి బ్యాంకులో అప్పు ఉన్న రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష కార్యదర్శులు అచ్చయ్య, పాకాల వెంకట్రావు, నాగిరెడ్డి, నాగభూషణం, నరేందర్, కుర్రాజులు భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గుట్కా అమ్ముతున్న షాపుల తనిఖీలు

నవతెలంగాణ - జూలూరుపాడు

మండల కేంద్రంలో నిషేధిత గుట్కా అమ్ముతున్న షాపులపై జూలూరుపాడు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెండు వేరు వేరు దుకాణాల వద్ద నుండి సుమారు 12,500 రూపాయల విలువగల ప్యాకెట్లను స్వాధీనపరుచుకున్నారు. షాపు యజమానులైన మిట్టపల్లి మణికంఠ, బానోతు ప్రసాద్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినారు. ఈ సందర్భంగా గుట్కా, మట్కా, జూదం, పేకాట వాడే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

చెరుకుమల్లి సురేష్‌కు ఘన నివాళులు

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడుకు చెందిన చెరుకుమల్లి సురేష్ మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి సందర్శించి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకురి మధుసూదన్ రావు, ధరావత్ రాంబాబు, నున్న రంగారావు, నర్వనేని పుల్లారావు, ఎల్లంకి చిన్న నాగేశ్వరావు పాల్గొన్నారు.



ప్రత్యామ్నాయ కాలువ ద్వారా వేంసూరుకు నీటి విడుదల

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్దచెరువు నీటి సామర్థ్యం అధిగమించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ కాలువపై ఏర్పాటు చేసిన లాకులను అధికారులతో కలిసి సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ప్రత్యామ్నాయ కాలువకు నీటిని వదిలారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో నిర్మించిన ఈ కాలువ నుంచి నీటిని విడుదల చేయటం పట్ల వేంసూరు మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వేతుపల్లి పెద్ద చెరువుకు ఇన్ఫ్లో 350 క్యూసెక్కులు వస్తుండగా 250 క్యూసెక్కుల నీటిని అవుట్ ఫ్లో తో ఆక్విడెక్ట్ ద్వారా వేంసూరు మండలంలోని 48 చెరువులు సత్తుపల్లి మండలంలోని ఆరు చెరువులకు నీరు చేరుతుందని సత్తుపల్లి ఐబి డీఈఈ సంపతి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పోలేపల్లిలో అంగన్‌వాడీల బడిబాట

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



మండలంలోని పోలేపల్లి పంచాయతీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, సాయి కృష్ణ నగర్, వికలాంగుల కాలనీలోని మూడు అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలను అంగన్వాడీ బడిలో చేర్చుకునేందుకు అవగాహన కోసం వారం రోజులపాటు జరిగే అవగాహన ప్రదర్శన ఆయా ఏరియాలలో సోమవారం నిర్వహించారు. పిల్లలను అంగన్వాడీ బడిలో చేర్పించాలన్నారు. చిన్నారులకు పౌష్టికరమైన ఆహారం అందిస్తూ విద్యాబుద్ధులు నేర్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వారం రోజులు "అమ్మ మాట అంగన్వాడీ బడిబాట" కార్యక్రమం అన్నారు. ఈ అవగాహన ప్రదర్శనలో అంగన్వాడీ సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు మీ పిల్లలను అంగన్వాడీ బడికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అత్తర్ బేగం, మణిమాల, పుష్పలత, ఆశా వర్కర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నాడు స్వాతంత్ర్యం కోసం సమరం

నాటి నుండి నేటి వరకు చింతలచెరువు కుటుంబం ఏజెన్సీ అభివృద్ధికి కృషి

- శాసనసభ్యులు తెల్ల వెంకట్రావు

నవతెలంగాణ-చర్ల



స్వాతంత్ర్య సమరం ఉవ్వెత్తున వురకలేస్తున్న రోజుల్లో గాంధీజీ ఆదేశాలనుసారం ఏజెన్సీ ప్రాంతం చర్లలో ఉప్పు సత్యాగ్రహం చేపట్టి తెల్ల దొరల పాలిట స్నేహ స్వప్నంగా నిలిచి తనదైన ముద్ర వేసుకున్న చింతలచెరువు వెంకటాద్రి, నాటి నుండి నేటి వరకు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న చింతలచెరువు కుటుంబ సభ్యులు అభినందనీయులని భద్రాచలం శాసనసభ్యులు తెల్ల వెంకటరావు కీర్తించారు. సోమవారం తామర పత్ర గ్రహీత ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు చింతలచెరువు వెంకటాద్రి 38వ వర్ధంతి స్మారక సభ కీస్తు శేషులు సివికే రావు స్వగృహం(శైలజ విహార్), వెంకటాద్రి స్మృతి వన్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఏజెన్సీ అభివృద్ధి చెందడం కోసం చింతలచెరువు వెంకటాద్రి అనునిత్యం కృషిచేసారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో జొన్న అన్నం తిని జీవనం సాగిస్తున్న రోజులను రూపుమాపడానికి సివికే రావు ఆనాటి జలగం వెంగళరావు ప్రభుత్వంలో తాలిపేరు మధ్యతర ప్రాజెక్టు నిర్మాణానికి విశేష కృషి చేశారని తెల్లం అన్నారు. తాలి పేరు నదిపై ఐ లెవెల్ వంతెన నిర్మాణం కోసం పలుమార్లు వైయస్ రాజశేఖర్ రెడ్డి వంటి ముఖ్యమంత్రిని కలిసి నిధులు తీసుకురావడంలో సివికే రావు విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఏజెన్సీ అభివృద్ధి కోసం పరితపించే తన తాత, తండ్రి కలల సాకారం కోసం హైకోర్టు న్యాయవాది సిహెచ్ సతీష్ కుమార్ కృషి చేయడం మన ఏజెన్సీ ప్రాంతానికి ఒక వరమని పలువురు వక్తలు కీర్తించారు. తొలుత రాళ్ల గూడెం లో ఉన్న వెంకటాద్రి ఘాటులో లాయర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించి అనంతరం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఉన్న వెంకటాద్రి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. సమకాలీకులైన కొవ్వూరు వెంకట్రావు సైకిల్ షాప్ సూర్యనారాయణలను లాయర్ శాలువాలతో సత్కరించి నూతన వస్త్రాలు అందించారు. స్థానిక రైస్ పేట కేజీబీవీ విద్యార్థులకు అడ్వకేట్ సిరుకానుకలు అందించారు. ఆయా కార్యక్రమంలో ఎంపీడీవో ఈదయ్య, చింతూరి వెంకట్రావు రౌతు నరసింహారావు, డీసీసీబీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, ఎర్రంకి బాబ్జి, బండారు రామకృష్ణ, లంక రాజు, ఎంపీటీసీ మడకం పద్మజ, గొట్టుముక్కల సీతారామరాజు, తడికల లాలయ్య, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, సివికె రావు కుమార్తె బేబీ పెద్ద ఎత్తున అభిమానులు నాయకులు పాల్గొన్నారు.



పాఠశాల స్థలంలో నిర్మించిన కాంప్లెక్స్‌ల ఆదాయం పాఠశాల అభివృద్ధికే కేటాయించాలి

- మున్సిపాలిటీ ఖాతాలో వేసుకోవడం సరికాదు
- కమిషనర్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల వినతి

నవతెలంగాణ-ఇల్లందు



మెయిన్ రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలంలో రోడ్డు వెంట నిర్మించిన కాంప్లెక్స్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని పాఠశాల అభివృద్ధికి కేటాయించాలని, వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్యు, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు బయ్యా అభిమన్యు, జె.గణేష్, గంగాధర గణేష్ ల ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాల నుండి కాంప్లెక్స్ ల ద్వారా వచ్చిన ఆదాయం నుండి 40 శాతం మెయిన్ రోడ్డు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కేటాయిస్తామని చెప్పిన మున్సిపల్ పాలకవర్గం సంవత్సరాలు గడుస్తున్నా నోరు మెదపకుండా తమ పని తాము చేసుకుంటూ పోతున్నారని, మున్సిపల్ పాలకవర్గం అనుసరించే వైఖరి ప్రభుత్వ పాఠశాలలో చదివే బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అన్యాయం చేసే విధంగా ఉండడం సరైన వైఖరి కాదని వారు అన్నారు. విద్యార్థి సంఘాలు పలుమార్లు వచ్చే ఆదాయంపై చర్చించిన సందర్భంలో మున్సిపల్ పాలకవర్గం ఎటువంటి ఫండింగ్ రావడం లేదని చెబుతూ దాటవేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయని, బిల్డింగ్ మరమ్మత్తులు, స్కావెంజర్ లేక మరుగుదొడ్లు ఇబ్బందికరంగా మారాయని, ఈ సమస్య పరిష్కరించుకునేందుకు కనీసం కాంప్లెక్స్‌ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పాఠశాల అభివృద్ధికి ఉపయోగించుకుంటే మోడ్రన్ పాఠశాలగా అభివృద్ధి చేసుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం విద్యార్థుల అభివృద్ధిని ఆకాంక్షించి, వచ్చే ఆదాయ వనరులను ఉపయోగించాలని వారు డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE AT HANUMAKONDA
O.S.NO. 2615 OF 2022.

Between:-
Kanaparthi Sarojana @ Swarajyam ...Plaintiff
And
Papishetti Sadanandam and others ...Defendants

NOTICE

To
D-6) Mootha Suresh, S/o. late Ramaiah, Age: 45 years, Occu: Employee, R/o. Kothagudem, Khammam (presently Bhadrachalam) District.

Please take notice that the above suit vide O.S.No.2615/2022 filed by the plaintiff for partition & separate possession in respect of the suit schedule property and the same is posted for your appearance on 26-07-2024. You are hereby required to appear on 26-07-2024 either in person or through an advocate before the Hon'ble I Addl. Junior Civil Judge Court, Hanumakonda at 10.30 AM. If you fail to appear on 26-07-2024 the matter will be decided as per the documents presented before the Hon'ble Court.

// BY ORDER OF THE COURT //
P.V. VIDYADHAR RAJ
Advocate, Hanumakonda.



డ్రయినేజీ నిర్మాణంలో జాప్యతను నిరసిస్తూ రోడ్డెక్కిన గ్రామస్తులు

- రహదారిపై బైఠాయించి నిరసన

నవతెలంగాణ-చంద్రుగొండ

మండల కేంద్రమైన చంద్రుగొండలో డ్రయినేజీ నిర్మాణ పనుల జాప్యయతను నిరసిస్తూ గ్రామస్తులు సోమవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. డ్రయినేజీ పనులను వెంటనే ప్రారంభించాలని రహదారిపై కూర్చొని ధర్నాకు దిగారు. నాయకులు డౌన్ డౌన్, అధికారుల నిర్లక్ష్యం నశించాలి అంటూ ఫ్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకుల మధ్య విభేదాలు, ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. వందేళ్ల చరిత్ర కలిగిన చంద్రుగొండలో డ్రయినేజీ లేకపోవడంతో వర్షాకాలంలో వీధులు జలమయమై ఇళ్లల్లోకి, పాఠశాలల్లోకి వర్షపు నీరు చేరుతుందని దీంతో గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురికి కాలువలో మురికి నీరు నిలువతో దుర్గంధంతో అనేక రకాల వ్యాధులతో గ్రామస్తులు బాధపడుతున్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పందించి మురికి నీటి కాల్వ పనులు ప్రారంభించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల నుండి స్పష్టమైన హామీ వచ్చేవరకూ ధర్నా విరమింపచేసేది లేదని భీష్మించుకూర్చున్నారు. ఆందోళన వద్దకు చేరుకున్న ఎస్సై గంజి స్వప్న ఆందోళనకారులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని చెప్పడంతో ధర్నాను విరమింప చేసుకున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం...

- న్యాయవాదులకు హెల్త్ కార్డులు అందజేసిన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి

నవతెలంగాణ-ఇల్లందు



మనం ఆరోగ్యంగా ఉంటేనే ఏ పనులైనా చేయగలుగుతామని, ప్రతి రోజూ వాకింగ్, యోగా చేస్తూ న్యాయవాదులందరూ మంచి ఆరోగ్యంతో ఉండాలని ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు సోమవారం ప్రభుత్వం న్యాయవాదులకు జారీ చేసిన హెల్త్ కార్డుల పంపిణీని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. హెల్త్ కార్డు న్యాయవాది, వారి కుటుంబాలకు రూ.2 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంటుందని, ఏదైనా అనుకోని అనారోగ్య సంఘటనలు ఎదురైనప్పుడు సంబంధిత హాస్పిటల్ నందు న్యాయవాదులు క్లైమ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూక్య రవికుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి కాంపల్లి ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తిక్, కోశాధికారి సిహెచ్ నవీన్ కుమార్, ఎన్.చెన్నకేశవరావు, ఎన్.మల్లికార్జునరావు రావు, ఎస్.వెంకట నరసయ్య, దంతాల ఆనంద్, పి.బాలకృష్ణ, టి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) నాయకులు వలమల చందర్ రావు

నవతెలంగాణ-జూలూరుపాడు

గుండేపూడి గ్రామ పంచాయతీలో ప్రజలు ఎదురుకొంటున్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శికి సోమవారం సీపీఐ(ఎం) శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వలమల చందర్ రావు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు పేరుకుపోతున్నాయని, వర్షా కాలం ప్రారంభం అయిన దృష్ట్యా పారిశుధ్యం అక్కడేవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వున్నదన్నారు. దీనితో విష జ్వరాలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి రోగలకు గురవుతున్నారన్నారు. అదే విదంగా గ్రామంలో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా వుండటంతో ప్రజలు, విద్యార్థులు బయటకు రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని, వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దోమల నియంత్రణకు ఫాగ్గింగ్, బ్లీచింగ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు భానోత్ మధు, పార్టీ గ్రామ శాఖ సభ్యులు వల్ల మల్ల దానయ్య, బోడ లక్ష్మ జమ్మి యశ్వంత్, అనగంటి దానమాయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కారేపల్లి పీహెచ్‌సీకి 108 సాధన

- ఫలించిన గిరిజన సంఘం కృషి

నవతెలంగాణ-కారేపల్లి



జనాభా, విస్తీరణంపరంగా పెద్దమండలమైన సింగరేణికి 108 వాహనం లేక వైద్య సేవలు అందక ఎజన్సీ గ్రామీణుల అవస్థలపై తెలంగాణ గిరిజన సంఘం, సీపీఐ(ఎం) పెద్ద ఎత్తున పోరాడి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రం ఇచ్చింది. దీనిపై ప్రభుత్వంలో స్పందన వచ్చి కారేపల్లి పీహెచ్‌సీకి 108 వాహనాన్ని కేటాయించిందని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. సోమవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం హాయంలో వైద్యశాఖ మంత్రి హరీష్‌రావుతో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గిరిజన సంఘం లేఖలు రాసిందన్నారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత 108 అవశ్యకత, పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్‌పై వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ వివరించటం, కలెక్టర్ కు వినతిపత్రాలు రూపంలోను సమర్పించటం జరిగిందని తెలిపారు. ఏజెన్సీ గిరిజన మండలం కారేపల్లికి 108 వాహనం కావాలని ఈనెల 12న ఖమ్మం కలెక్టరేట్‌లో గిరిజన సమస్యలపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో వైద్య సమస్యలను లెవనెత్తిన ఫలితంగా స్పందించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కారేపల్లి పీహెచ్‌సీకి 108ను కేటాయించారన్నారు. ఇక కారేపల్లి పీహెచ్‌సీని సీహెచ్‌సీ మార్చేటానికి గిరిజన సంఘం ఐక్యపోరాటాలు చేస్తుందని భూక్యా వీరభద్రం అన్నారు. 108 సాధనకు కృషి చేసిన భూక్యా వీరభద్రంను కారేపల్లి మండల గిరిజన సంఘం అధ్యక్షకార్యదర్శులు అజ్మీర శోభన్‌నాయక్, బానోత్ బన్సీలాల్, తేజావత్ చందర్‌లు అభినందించారు.

తప్పుబాట పట్టొద్దు ఇబ్బందులు పడొద్దు

- మత్తు పదార్థాల అవగాహన సదస్సులో ఎస్సై గజ్జెల నరేష్

నవతెలంగాణ-ముదిగొండ

తప్పుడు మార్గంలో పయనించి ఇబ్బందులు పడద్దని ఎస్సై గజ్జెల నరేష్ విద్యార్థులకు ఉద్బోధించారు.ముదిగొండ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన మాదకద్రవ్యాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం,విద్యార్థిని,విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తారం దేవస్థానం కమిటీ సభ్యుల ఎన్నిక

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో ముత్తారం సీతారామచంద్రస్వామి దేవస్థానం కమిటీ సభ్యులుగా ఏడుగురిని నియమించినట్లు సోమవారం దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేవాలయం కమిటీ సభ్యులుగా తాళ్లూరి జీవన్ బాబు (వనంవారికిష్టాపురం),కాకి వీరభద్రం (వివికెపురం),చెన్ను అమ్మయ్య(వివికెపురం) వనం వెంకటేశ్వరరావు,(వివికెపురం),గుండపనేని శ్రీనివాసరావు(వివికెపురం),లంజపల్లి మమత (ముత్తారం),తాళ్ల ఉపేందర్ (ముత్తారం) దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా దేవాదాయ శాఖ నియమించింది.ఆలయ ప్రధాన అర్చకులుగా బోర్రా వాసుదేవరావుచార్యులు కొనసాగుతున్నారు.

ప్రజా సమస్యలపై పల్లె యాత్ర

నవతెలంగాణ-మణుగూరు



ప్రజా సమస్యలపై పల్లెయాత్ర ప్రారంభించినట్టు మణుగూరుకు చెందిన సామాజిక కార్యకర్త కర్నె రవి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు మండలంలోని తోగూడేం గ్రామ నుండి పల్లెయాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. ప్రజలతో మాట్లాడి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యాత్రలో భాగంగా ప్రజల ప్రధాన సమస్యలైన సైడ్ డ్రైనేజీ, విద్యుత్ లైన్లు, పోడు భూములకు పట్టాలు లేవన్నారు. నీళ్ళు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమ్మక్క, సారక్క గుడి ఎదురుగా ఫారెస్ట్ అధికారులు ఫేంచింగ్ వైర్ ఏర్పాటు చేయడం వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్సు స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

కమిషనరేట్‌లో యాంటి నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ- ఖమ్మం

డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం నియంత్రణపై ఈ బృందాలు నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. ప్రధానంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, డీ అడిక్షన్, ప్రి వెన్షన్ పైనా ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీస్ శాఖ యాంటి నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసి సమాచారం వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. మాధకద్రవ్యాల క్రయ విక్రయాల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం వాట్సప్ ద్వారా కాని సెల్‌ఫోన్ ద్వారా ఫిర్యాదులు, సమాచారం అందజేసేందుకు అందుబాటులో ఉండే యాంటీ డ్రగ్ కంట్రోల్ విభాగం 8712659123 సెల్ ఫోన్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాచారం అందజేసిన వారి వివరాలకు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. పల్లెల్లో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘాతో అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అటు గంజాయి వాడుతున్న వారిని సైతం గుర్తించి వైద్య సదుపాయం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్ నుంచి రోడ్డు మార్గాల ద్వారా మత్తు పదార్థాలు రవాణా జరుగకుండా తనిఖీలు పటిష్ఠం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

టీచర్‌గా మారిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



మండలంలోని జల్లేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కలెక్టర్ విద్యార్థులకు పాఠాలు బోధించారు. తాను ఐఏఎస్ స్థాయికి ఎదగడానికి పడిన కష్టాలను విద్యార్థులకు వివరించారు. చదువుతో పాటు ఆటల్లో కూడా ముందుండాలన్నారు. ఒక్కసారి పరీక్షలో పెయిల్ అయినా మరోసారి ప్రయత్నించాలన్నారు. కష్టం వచ్చినప్పుడు ధైర్యం కోల్పోకుండా ఉండాలని తెలిపారు. పాఠశాలకు కావల్సిన మౌళిక సదుపాయాల గురించి కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డీ. రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కష్టం కలిగితే సంప్రదించండి

- రూరల్‌లో మాజీ ఎమ్మెల్యే కందాళ పర్యటన...

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



కష్టం వస్తే తనను సంప్రదించాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో సోమవారం కందాళ పర్యటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణపురం, పొలిశెట్టిగూడెం, గోళ్ళపాడు, గొల్లగూడెం, గుండాల తండా తదితర గ్రామాల్లో వివిధ కారణాలతో ఇటీవల మరణించిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. ఏ కష్టం అర్ధరాత్రి అయిన తనను సంప్రదించాలని తెలిపారు. అనారోగ్యానికి గురైన ఏదులాపురం సొసైటీ చైర్మెన్ లక్ష్మణ్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, వైస్ ఎంపీపీ దర్గయ్య, నాయకులు గూడా సంజీవరెడ్డి, కృష్ణారావు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి : మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సోమవారం మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల మరణించిన వారి కుటుంబాల వద్దకు వెళ్లి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండలంలోని నాయకన్‌గూడెం గ్రామ మాజీ ఉప సర్పంచ్ కిన్నెర శ్రీకాంత్ తండ్రి ముత్తయ్య ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న ఆయన స్వగృహంలో ముత్తయ్య చిత్ర పటానికి పూలువేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం పలు కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వేముల వీరయ్య మండల కార్యదర్శి ఆసిఫ్ పాషా, నాయకన్‌గూడెం మాజీ సర్పంచ్ కాసాని సైదులు, పడిశాల గోపి, దాసరి వెంకన్న, నూకల మల్లయ్య, కొలిశెట్టి శీను, ప్రభాకర్ రెడ్డి, ఉపేందర్, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఆ గ్రామాల్లోని పలు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మండల పరిధిలోని రాజారం గ్రామంలో ఇటీవల మరణించిన మద్ది చిన్న అప్పారెడ్డి, దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై,వారి చిత్రపటానికి పూలువేసి, నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాష బోయిన వీరన్న, బిఆర్ఎస్ యూత్ మండల నాయకులు కొప్పుల ఉపేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొప్పుల మధుసూదన్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు న్యాయవాది రంగాపురం బాలకృష్ణ గౌడ్, మాజీ ఎంపిటిసి వేల్పుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ పట్టా ఇచ్చిన పేదలకు భూమి అప్పగించాలి

నవతెలంగాణ-కారేపల్లి



సింగరేణి మండలం కమలాపురం రెవిన్యూ గ్రామ పరిధిలో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమి ఆక్రమణలకు గురైందని దానిని లబ్ధిదారులకు అప్పగించాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. కమలపురం రెవిన్యూ పరిధిలోని సర్వే నెం.147లో 112 ఎకరాలు అసైన్డ్ భూమి ఉంది. ఆ భూమి 1995 సంవత్సరంలో చీమ్నాతండా, బొటితండాలకు చెందిన 18 మంది పేదలకు 80 ఎకరాలు, రోడ్ల కింద 10 ఎకరాలు రోడ్డు కింద పోగా మిగిలినా 22 ఎకరాలను 2011లో మేకలతండా, దుబ్బతండా చెందిన పేదలతో పాటు లొంగిపోయిన నక్సల్స్‌కు పునరావాసం కింద ప్రభుత్వం పంపిణి చేసింది. పేదలకు అసైన్డ్ పట్టాలిచ్చిన అధికారులు వాటికి హద్దులు చూపకపోవటంతో లబ్దిదారులు సాగు చేయలేదు. అప్పటి నుండి ఆ భూమిని కొందరు గిరిజన, గిరిజనేతరులు ఆక్రమించుకున్నారు. అసైన్డ్ హక్కులున్న పేదలు భూమిపై వెళ్లితే దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు అఖిలపక్షాన్ని ఆశ్రయించారు. దీనిపై కలెక్టరేట్ ప్రజావాణిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో బాధితులు వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, బానోత్ బన్సీలాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, గుగులోత్ మంగ్యానాయక్, ఎన్డీ మండల అధ్యక్షులు వై.ప్రకాష్, మాస్ లైన్ జిల్లా నాయకులు గుగులోత్ తేజానాయక్, దారావత్ సక్రు, బాధితులు సఫావట్ రమేష్, వనోత్ నందరాం, భూక్యా భగవాన్, గుగులోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-వైరాటౌన్

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి (రిలీఫ్ ఫండ్) లబ్ధిదారులైన 59 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వైరా, ఏన్కూర్, జూలూరుపాడు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శీల వెంకట్ నర్సిరెడ్డి, స్వర్ణ నరేందర్, మంగీలాల్ నాయక్, రాష్ట్ర మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ బొర్రా రాజా శేఖర్, వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, పాలేటి నరసింహారావు, పమ్మి అశోక్, బోళ్ళ గంగారావు, బత్తుల గీత శ్రీను, కట్ల సంతోష్, శీలం చంద్రశేఖర్ రెడ్డి, పసుపులేటి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పణితి రాజమ్మకు నివాళి

కాంగ్రెస్ పార్టీ నాయకులు పణితి శ్రీను అమ్మ కి.శే పణితి రాజమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎర్రుపాలెం : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో ఏర్పాటు చేయబడిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇనగాలి గ్రామంలో లబ్దిదారులు కోట లక్ష్మయ్యకు 26 వేల రూపాయలు, దుదేకులపుల్ల సాహెబ్‌కు 30వేల రూపాయలు, శీలం నర్సిరెడ్డికి 60వేల రూపాయలు, లక్కిరెడ్డి చిన్న నాగిరెడ్డికి 25వేల రూపాయలు, వంగూరి ప్రభాకర్ రావుకు 60వేల రూపాయల చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అనుమోలు కృష్ణారావు, యరమల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని చాటుతున్న పీర్ల పండుగ

- గత 40 ఏళ్లుగా నిర్వహణ
- బాబు క్యాంపులో ప్రజలను అలరిస్తున్న పీరీలు

నవతెలంగాణ-కొత్తగూడెం



పీర్ల పండుగ మతసామ్రాస్యాన్ని చాటి చెబుతుందని చెప్పవచ్చు. అనేక సంవత్సరాలుగా ఈ పండుగను కుల, మత, ప్రాంతాలకు అతీతంగా చేసుకోవడం జరుగుతుంది. కొత్తగూడెం పట్టణంలో అనేక చోట్ల పీర్ల పండుగ వాతావరణం కనిపిస్తుంది. కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో పీర్ల పండుగ ప్రజలను అలరిస్తుంది.....బాబు క్యాంపులో గత 40 ఏళ్ళు ఉత్సాహంగా యువకులు జరుపుకుంటున్నారు. మత సామ్రాజ్యాన్ని చాటే విధంగా అన్ని కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పీర్ల పండుగను చేయడం వీరికి పరిపాటిగా మారిపోయింది. నెల వంక కనిపించిన రోజున పీరీల పెట్టెలు దింపిన దగ్గర నుండి పది రోజులపాటు కఠినమైన నియమాలు పాటిస్తూ పీరీ సవారీలను ఏర్పాటు చేస్తారు. ముందుగా ఆశ్రఖాన్ ఏర్పాటు చేసి పీర్లను ఏర్పాటు చేస్తారు. అశ్రుఖానలో హజ్రత్ మౌలాలి, హజ్రత్ నాగులమీరా, హజ్రత్ బడే హుస్సేన్, హజ్రత్ ఇమామ్ ఖాసీం సవారీలు ఉంటాయి. పది రోజులు పాటు పీర్లను మోసే వారు (గోడలు) అత్యంత భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తుంది. ఈ పండుగకు గత పూరణ గాధలు, చరిత్ర ఉందని వారి నమ్మకం. నమ్మినవారికి వారి సమస్యలు పరిష్కరిస్తారని, వారి కుటుంబాల్లో ఆనందం నింపుతుందని వారి నమ్మకం. ఈ పండుగ సందర్భంగా ప్రత్యేక వంటకాలు, ద్రవాలు, మిఠాయిలు తీసుకుని రావడం, ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశ్రఖాన్ సమీపంలో ఉన్న వారికి ప్రసాదంగా పంచడంతో వారికి తృప్తిగా భావిస్తారు. పది రోజుల అనంతరం కర్బల నిర్వహిస్తారు. బాబు క్యాంపులో గత 40 సంవత్సరాలుగా సిరా రామచందర్ ఆధ్వర్యంలో పీర్ల పండుగ నిర్వహించడం పరిపాటిగా మారిపోయింది. పీర్లను నమ్ముకున్న వారు పండుగ రోజుల్లో ఒకరోజు వచ్చి పూజలు చేస్తారు. ఇందులో అనేక దూరప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి రావడం విశేషం. 40 ఏండ్లుగా రామ్‌చందర్ పీర్లను నిర్వహిస్తు ప్రజల్లో ప్రత్యేక ఆదరణ సంపాదించుకున్నారు. ఆయనతోపాటు పలువురు ఆయనకు సహాయకులుగా పనిచేస్తున్నారు. ఈనెల 17వ తేదీన మోహ్రం పండుగ రోజు రాత్రికి పీరీలను డప్పు వాయిద్యాలతో పట్టణంలో ఊరేగింపుగా తీసుకు వెళ్లి ఆయా పట్టణ, గ్రామాల్లోని చెరువులు, నదుల వద్ద నిమజ్జనం చేయడంతో పండుగ ముగుస్తుంది. ముఖ్యంగా ఈ పండుగ భారతీయ సంస్కృతిలో కుల, మత, ప్రాంతాలకతీతంగా ధనిక, పేద అనే తేడాలేకుండా పీర్ల పండుగను జరుపుకోవడం మతసామరస్యాన్ని స్నేహభావాన్ని చాటి చెబుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

రుణమాఫీని ఆంధ్రాలో బ్యాంకుల నుండి పొందిన వారికి వర్తింపజేయాలి

- ఏవో విజయభాస్కర్‌రెడ్డికి రైతులు వినతి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వర్తింప చేయనున్న రైతు రుణమాఫీని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని బ్యాంకుల నుండి అప్పు తీసుకున్న రైతులకు రుణమాఫీని వర్తింపజేయాలని సోమవారం మండల వ్యవసాయ అధికారి వీ.జయభాస్కరరెడ్డికి రైతులు వినతి పత్రం అందించారు. మండల పరిధిలోని రామన్నపాలెం, ఇనగాలి మొలుగుమాడు, సకినవీడు, అయ్యవారిగూడెం, భీమవరం తదితర గ్రామాల రైతులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం గోసవీడు గ్రామంలో గల భారతీయ స్టేట్ బ్యాంకు నుండి గత 20 సంవత్సరాలుగా అప్పు తీసుకుంటున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్న కాలం నుండి పంట రుణాలు తీసుకుంటూ ఆ రుణాలను తిరిగి రెన్యూవల్ చేసుకుంటున్నట్లు తెలిపారు. మా గ్రామాలకు బ్యాంకులు అందుబాటులో లేని కారణంగా గోసవీడు ఎస్బిఐ నందు అకౌంట్ పొంది వ్యవసాయ రుణాలు పొందుతున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరిచే రైతు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, బాలాజీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అల్యూమినియం వైరును పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-వైరాటౌన్

మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలానికి చెందిన మునగాల నరసింహారావు తన ఆటోలో తరలిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే సంస్థకు చెందిన అల్యూమినియం వైరును స్థానిక పోలీసులు పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో వైరా పాత బస్టాండ్ సెంటర్ నందు పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి తన ట్రాలీ ఆటోతో ఖమ్మం వైపు వెళుతుండగా పోలీసులు ఆపినా ఆటోను ఆపకుండా వెళుతుండగా పోలీసులు వెంబడించి ఆటోను పట్టుకొని తనిఖీ చేశారు. ఆటోలో గ్రీన్ ఫీల్డ్ హైవే సంస్థకు చెందిన అల్యూమినియం వైరు ఉండటంతో దాని గురించి విచారించగా తన పేరు మునగాల నరసింహారావు అని, ఇందిరమ్మ కాలని, వైరా అని తెలిపాడు. ఈనెల11న ఏఎంసీ మార్కెట్ ఎదురుగా ఉన్న ఫ్రెండ్స్ రెస్టారెంట్ గోడౌన్‌లోని వైరును దొంగిలించానని తెలిపాడని చెప్పారు. వైరును స్వాధీనపరుచుకుని సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

27వ డివిజన్లో అమ్మ మాట.... అంగన్వాడీ బాట

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ 27వ డివిజన్లో సోమవారం అమ్మ మాట... అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. తొలుత 27వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డ నగేష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ చెప్పినట్టుగా ప్రభుత్వ అంగన్వాడి స్కూల్లో చిన్న పిల్లలు చక్కగా వెళ్లి చదువుకోవాలని, అంగన్వాడి స్కూల్ టీచర్లు కూడా వారికి అమ్మలా ఆడిస్తూ, పాడిస్తూ, చదువు నేర్పించాలని అన్నారు. అంగన్వాడి స్కూల్స్‌లోకి తల్లిదండ్రులకు తమ పిల్లల్ని పంపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 27వ డివిజన్ అంగన్వాడి స్కూల్ నుండి 27వ డివిజన్‌లో ఉన్న అంబేద్కర్ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 27వ డివిజన్ జవాను దుర్గాప్రసాద్, అంగన్వాడీ టీచర్లు మమత, విజయలక్ష్మి, జానీ బేగం, అంగనవాడి ఆయాలు సైదమ్మ బూదెమ్మ, ధనమ్మ మమతా కాలేజ్ నర్సింగ్ విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్

నవతెలంగాణ-వేంసూరు

మండలంలో ఆరుగురు గ్రామపంచాయతీ కార్యదర్శులు బదిలీ కాగా వారి స్థానంలో భీమవరం చీకటి చైతన్య, దుద్దెపూడి చావా నిరోషా, మర్లపాడు పుల్లారావులు రాగా కందుకూరు, వెంకటాపురం, లింగపాలెం వేకెన్సీలో ఉన్నాయి, శంభునిగూడెం కార్యదర్శి రాజీనామా చేయగా ఆ స్థానంలో గోరంట్ల స్వాతి సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన బదిలీల కౌన్సిలింగ్లో నియమించబడ్డారు.

రాపల్లి పులిగుట్ట వద్ద జోరుగా గంజాయి విక్రయం?

- పోలీసులు అదుపులో విక్రయదారుడు?

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని రాపల్లి పులి గట్టుతో పటు పలు గ్రామాలలో గత కొంతకాలంగా యువకుడు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. వివిధ ప్రాంతాలలో గంజాయిని తీసుకువచ్చి మండల వ్యాప్తంగా యువకులకు ఈ గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే స్థానికుల సమాచారంతో బోనకల్ పోలీసులు ఆ యువకుడిని సోమవారం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. రాపల్లి గ్రామానికి చెందిన శ్రీనాథ్ అనే యువకుడు అదే గ్రామంలో ఒక యువతతో కలిసి గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల కాలంలో బోనకల్ మండలంలో గంజాయి కలకలం సష్టిస్తుంది. మండలంలోని ప్రధానంగా బోనకల్, రాపల్లి, రావినూతల గ్రామాలకు చెందిన కొంతమంది యువకులు గంజాయికి బానిసగా మారారు. ఇదే అదునుగా భావించిన కొంతమంది యువకులు గంజాయిని తీసుకువచ్చి యువతకు విక్రయిస్తున్నట్లు గత కొంతకాలంగా మండలంలో జోరుగా ప్రచారం సాగుతుంది. రాపల్లి యువకుడిని అతనితో కలిసి గంజాయి విక్రయిస్తున్న యువతిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. మండల పరిధిలోనే జానకిపురం, నారాయణపురం, చిన్న బీరవల్లి, బ్రాహ్మణపల్లి, సీతానగరం, వైరా మండలం పాలడుగు గన్నవరం తదితర గ్రామాలలో యువకులకు గంజాయి విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. రాపల్లి గ్రామ సమీపంలో గల పులి గుట్ట వద్ద రాత్రి సమయంలో ఎక్కువగా విక్రయాలు జరుగుతున్నట్లు ప్రచారం. ఆయా గ్రామాలకు చెందిన యువకులు రాత్రి సమయంలోనే ఆ పులి గుట్ట వద్దకు వస్తున్నట్లు తెలుస్తుంది.



మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాజ్ కుమార్

- అభినందనలు తెలిపిన కాలేజ్ సిబ్బంది

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.రాజ్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ ఎల్.లక్ష్మణరావు అనేక ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం అతన్ని హైదరాబాద్‌కు బదిలీ చేసింది. ఆయన స్థానంలో జిల్లా మెడికల్ కళాశాలలో పాథాలజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.రాజ్ కుమార్‌కు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలను ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడేంతత వరకు డాక్టర్ రాజకుమార్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించనున్నారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు. అభినందించిన వారిలో ఏఓ. ఖలీల్, నాగేశ్వరరావు, విలియమ్స్, కెర్రి వెంకటేశ్వర్లు, ఎం.రామబాబు, పి.ప్రభాకర్, బి.వెంకట్, ఈసం నాగమణి, మోకాళ్ల వెంకట్, అమ్మని తదితరులు ఉన్నారు.

రైతు వేదికల్లో కొత్త హంగులు

నిర్వహణ ఖర్చుల్లేక నిరుపయోగంగా ఉన్న రైతు వేదికలను రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఆధునిక సాంకేతిక సదుపాయాల కల్పనలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు అవసరమైన దృశ్యశ్రవణ పరికరాల్ని సమకూర్చు తుంది. పరికరాల కోసం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన రైతు వేదికకు రూ.3.50 లక్షల నిధుల్ని కేటాయించింది. రైతుల సమస్యల్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నివృత్తి చేయనుంది. సాగుబడిపై అవగాహనా శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వం ఐదు వేల ఎకరాలకో వ్యవసాయ క్లస్టర్‌ను ఏర్పాటు చేసి రైతు వేదికల్ని నిర్మించింది. వాటిని వినియోగంలోకి తెచ్చేలోపే ప్రభుత్వం మారడంతో కొత్త ప్రభుత్వం వాటిపై దృష్టి సారించింది.

ఆధునిక సాంకేతిక సదుపాయాల కల్పన

- రైతు నేస్తం కార్యక్రమాల నిర్వహణ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు సమస్యల పరిష్కారం
- సాగుబడిపై అవగాహన, శిక్షణా కార్యక్రమాలు
- రాష్ట్రంలో 2601.. ఉమ్మడి మెదక్ జిల్లాలో 319 రైతు వేదికలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వ్యవసాయ రంగంలో పెరుగుతున్న యాంత్రీకరణ, ఆధునికతను రైతులు అందిపుచ్చుకునేలా గత ప్రభుత్వంలో సాగు విస్తీర్ణాన్ని బట్టి 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున ఏర్పాటు చేశారు. ఆరేడు గ్రామాలకు ఒక క్లస్టర్‌గా విభజించి రైతు వేదికల్ని నిర్మించారు. ఒక్కో రైతు వేదిక నిర్మాణం కోసం రూ.22 లక్షలు వెచ్చించారు. ప్రభుత్వం వాటి నిర్వహణ కోసం ప్రతి నెలా రూ.9 వేలు సమకూరుస్తామని చెప్పి కొంత బడ్జెట్‌ను కూడా కేటాయించింది. ఆ తర్వాత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించిన సమయంలో కనీసం మంచినీళ్లు, టీ కోసం డబ్బుల్లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతు వేదికలు తెరవని పరిస్థితి నెలకొంది. చాలా చోట్ల కరెంట్ బిల్లులు కట్టకపోవడంతో సరఫరా నిలిచింది. ఊరికి దూరంగా ఉండి నిర్వహణ గాలికి వదిలేయడంతో ఫ్యాన్లు, ఫర్నీచర్ చోరీకి గురయ్యాయి.

2601 రైతు వేదికలు

రాష్ట్రంలో 2601 రైతు వేదికల్ని నిర్మించారు. ప్రతి వేదికలోనూ రెండు గదులు, మీటింగ్ హాల్, కుర్చీలు, బీరువా, మైక్‌సెట్ సమకూర్చారు. రైతు వేదిక కేంద్రంగా మండల వ్యవసాయ అధికారులు నిధులు నిర్వహించాలి. రైతు వేదికల నిర్వహణ కోసం నెలకు రూ.9 వేల చొప్పున ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. కొంత కాలం నిధుల్ని విడుదల చేసింది. స్వీపర్‌కు రూ.3 వేలు, కరెంట్ బిల్లు రూ.వెయ్యి, సమావేశం నిర్వహణకు రూ.2500, స్టేషనరీ, జిరాక్స్‌కు రూ.వెయ్యి, ఇతర ఖర్చులకు రూ.వెయ్యి చొప్పున ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 319 రైతు వేదికల్ని నిర్మించారు. సిద్దిపేట జిల్లాలో 127, సంగారెడ్డి జిల్లాలో 116, మెదక్ జిల్లాలో 76 చొప్పున రైతు వేదికలున్నాయి.

బహుల ప్రయోజనాలు

మండల వ్యవసాయ అధికారులు రైతు వేదిక కేంద్రంగా విధులు నిర్వహిస్తూ క్లస్టర్ పరిధిలో ఉన్న గ్రామాల్లో పర్యటించాలి. పంటల సాగుకు సంబంధించిన పర్యటన వివరాల్ని నోటీస్ బోర్డులో ఉంచాలి. పని దినాల్లో యాప్ ద్వారా అటెండెన్స్ వేస్తారు. సేంద్రీయ సాగు విధానం, పంట రుణాలు, ఉత్తమ సాగు పద్ధతులు, రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, పంటల నమోదు, కొనుగోళ్లు, ఆయిల్‌పామ్, పండ్లు, కూరగాయల సాగు పెంపు, ఎరువులు, విత్తనాల పంపిణీ, ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీలు, సస్యరక్షణ పద్ధతులు, మార్కెట్, మద్దతు ధరలు, వర్మీ కంపోస్ట్ వంటి విషయాల్లో రైతులకు అవగాహన కల్పించడం కోసం రైతు వేదికలను ఉపయోగించడం ద్వారా ఎంతో మేలు చేకూరనుంది.

నిధులిస్తేనే నిర్వహణ

గత ప్రభుత్వం రైతు వేదికల్ని నిర్మించి వాటి నిర్వహణ కోసం ఒకసారి మాత్రమే నిధులిచ్చి వదిలేసింది. ఇప్పుడు రైతు నేస్తం కార్యక్రమాలు, రైతు వేదికల నిర్వహణ కోసం నెలకు కనీసం రూ.10 వేల చొప్పున కేటాయించాలని రైతులు కోరుతున్నారు. ఆధునిక పరికరాలు ఏర్పాటు చేసి నిర్వహణను విస్మరిస్తే మళ్లీ రైతు వేదికలు పడావు పడే అవకాశముందని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఎక్కువ రైతు వేదికలను స్థల సేకరణ సమస్యతో ఊరికి దూరంగా నిర్మించడంతో చాలా చోట్ల ప్యాన్లు, పర్నీచర్ లూటీకి గురయ్యాయి. ఇటీవల సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలంలో రైతు వేదికలో ప్యాన్లు, కుర్చీలు ఎత్తుకెళ్లడంతో కేసు పెట్టాల్సి వచ్చింది.

దృశ్యశ్రవణ పరికరాల ఏర్పాటు

రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు అవసరమైన దృశ్య శ్రవణ పరికరాల్ని సమకూరుస్తున్నారు. బీఎస్ఎన్ఎల్‌కు ఆధీనంలో ఉన్న టి.ఫైబర్ నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తారు. వీడియో కాన్ఫరెన్స్ కోసం హై-రిజల్యూషన్ కెమెరాతో పాటు వీడియో తెర, ఇతర పరికరాల ఏర్పాటుకు ఒక్కో రైతు వేదికకు రూ.3.50 లక్షల చొప్పున కేటాయించారు. రాష్ట్రంలో ముందస్తుగా 110 వేదికల్లో ఆధునిక సాంకేతిక పరికరాల్ని సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంగారెడ్డి జిల్లాలో సిర్గాపూర్, కొండాపూర్, డాకూర్, రాయికోడ్, అల్లిపూర్, సోలక్‌పల్లి రైతు వేదికల్లో దృశ్యశ్రవణ పరికరాల్ని ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాలో రామాయంపేట, నర్సాపూర్, కొల్చారం మండల కేంద్రాల్లో ఉన్న రైతు వేదికల్లో ఆధునిక పరికరాల్ని ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలోనూ ఆరు రైతు వేదికల్ని ఎంపిక చేసి పరికరాల్ని సమకూర్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 15 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ కోసం అవసరమైన పరికరాల్ని సమకూర్చారు. ఇప్పటికే వీటిల్లో రైతు అవగహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మెదక్ జిల్లా కొల్చారం రైతు వేదికలో దృశ్యశ్రవణ పరికరాలు ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. అదే రోజు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలో మనురు, కల్హేర్, గుమ్మడిదల, మునిపల్లి, వట్‌పల్లి, సంగారెడ్డి, కోహీర్, సదాశివపేట, నాగిల్‌గిద్ద, మావినేలి, దౌల్తాబాద్, గొగ్లూర్, తడ్కల్, రుద్రారం వెలిమెలా, బిద్రుప్ప, మడ్డికుంట, బర్దీపూర్, గుడుపల్లి, ముంగి రైతు వేదికల్లోనూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సచివాలయ ముట్టడి ఉద్రిక్తం
- మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ సహా పలువురి అరెస్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2021-22, 2022-23, 2023-24 విద్యాసంవత్సరాలకు సంబంధించి సుమారు రూ.ఎనిమిది వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన సచివాలయ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్‌కే భవన్ వద్దకు ప్రదర్శనగా వచ్చిన విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో తోపులాట జరిగింది. అనంతరం మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ సహా పలువురు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందు వారు మీడియాతో మాట్లాడుతూ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాలేజీ యాజమాన్యాలు



ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఆఫీసు బేరర్లు ఇటిక్యాల రామకృష్ణ, గ్యార నరేష్, రఘురామ్, నాగజ్యోతి, ప్రవీణ్, రాజు, నాయకులు చైతన్య యాదవ్, శివ, మచ్చ రమేష్, వెంకటేశ్, అన్వర్, వంశీ లక్ష్మణ్, సంతోష్, మురళి, అంజి, ప్రేమ్‌కుమార్, హరీశ్, నరేష్, శరత్, పార్థసారథి, జోసెఫ్, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల్లో ప్రొటోకాల్ రగడ

నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గంలో ప్రొటోకాల్ వివాదం రాజుకుంది. బోనాల పండుగ చెక్కుల పంపిణీ సందర్భంగా అధికారులు ప్రొటోకాల్‌ను పూర్తిగా ఉల్లంఘించారంటూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కింద కూర్చొని నిరసన తెలిపారు. ప్రొటోకాల్ పాటించకుండా ప్రజలచే ఎన్నికైన ఎమ్మెల్యేలను అగౌరపరుస్తున్నారని, ప్రజాప్రతినిధులను గౌరవించే సంప్రదాయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని అన్నారు. వివరాల్లోకెళ్తే.. ఆషాఢ మాసం బోనాల దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆర్కేపురం డివిజన్‌లోని ఖిల్లా మైసమ్మ దేవాలయం ఆవరణలో సోమవారం దేవాలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు హాజరయ్యారు. అయితే, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని స్టేజ్‌పైకి పిలవడంతో వివాదం తలెత్తింది. అలాగే ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మద్దతుదారులను ఆలయంలోకి అనుమతించలేదు. దాంతో ఎమ్మెల్యే ఎగ్జిక్యూటివ్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తులను వేదికపైకి అనుమతించడం ప్రొటోకాల్ ఉల్లంఘ నేనంటూ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నేలపై బైటాయించి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇక్కడ ఎమ్మెల్యేతో పాటు ఓడిపోయిన అభ్యర్థి కూడా స్టేజ్ మీద ఉన్నారంటే, కొడంగల్‌లో కూడా ఓడిపోయిన అభ్యర్థిని తీసుకొచ్చి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ఒక చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. తనపై ఓడిపోయిన లక్ష్మారెడ్డిని ప్రభుత్వ కార్యక్రమాల్లో స్టేజీపై కూర్చోబెట్టడం సరైంది కాదన్నారు. ఓడిపోయిన వారిపై ప్రేమ ఉంటే వారి పార్టీ కార్యక్రమాల్లో నెత్తిపై కూర్చోబెట్టుకొని ఊరేగొచ్చని తెలిపారు. ప్రభుత్వం తమదేనని ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమప్పుడు ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులతో తులం బంగారం పంపిస్తే హర్షిస్తామని అన్నారు. ఏ ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్లినా ప్రొటోకాల్ సమస్య తలెత్తుతోందని, ఈ విషయంలో స్పీకర్ కలగ జేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమయ్యాయని విమర్శించారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేను స్టేజీపై కూర్చోవాలని కోరినా కూర్చోలేదని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సాజిద్, బేర బాలకిషన్, మహేందర్ యాదవ్, బండి మధు సుధన్ రావు తదితరులు పాల్గొన్నారు.ఓ వైపు నిరసన కొనసాగు తుండగానే.. దేవాదాయశాఖ అధికారులు 34 చెక్కులను మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, చల్లా నరసింహారెడ్డి, టీపీసీసీ ప్రతి నిధి దేప భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయ కులు చిలుక ఉపేందర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధు లతో కలిసి పలు ఆలయ కమిటీలకు పంపిణీ చేసి వెళ్లిపోయారు.

పదికి చేరిన ఫిరాయింపులు

- హస్తం గూటికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఆయనతోపాటే గాలి అనిల్ కుమార్, ఇతర నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్‌కు చెందిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. సోమవారం సీఎం రేవంత్ సమక్షంలో ఆయన మూడు రంగుల కండువా కప్పుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహా, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కాంగ్రెస్ నేతలు నీలం మధు, శశికళ యాదవ్‌తో కలిసి సీఎంతో భేటీ అయిన మహిపాల్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ప్రధాన ప్రతిపక్షం నుంచి అధికార పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల సంఖ్య పదికి చేరింది. మహిపాల్‌తోపాటు జహీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నేత గాలి అనిల్ కుమార్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు పలువురు కార్పొరేటర్లు, వారి అనుచరులు సైతం హస్తం గూటికి చేరిపోయారు. మహిపాల్ రెడ్డి 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పఠాన్‌చెరు నుంచి గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. గత డిసెంబరులో జరిగిన ఎలక్షన్‌లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌పై ఏడు వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. ఇటీవల మహిపాల్ నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. దీంతో ఆయన బీజేపీలో చేరబోతున్నారనే ప్రచారం జరిగింది. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్‌లో మిగిలిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు అధికార పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీని వీడుతున్న ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శతవిధాలా ప్రయత్నించారు. కానీ అవేవీ ఫలించ లేదు. ఆ పార్టీ అధినేత కేసీఆర్ సైతం కొద్ది రోజులపాటు ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీలు నిర్వహించినప్పటికీ ఫిరాయింపులను నిరోధించలేకపోయారు. మొత్తం 39 ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు ఉండగా, వీరిలో ఇప్పటికే 10 మంది అధికార పార్టీ పంచన చేరారు. మిగతా వారిలో ఎవరెప్పుడు పార్టీ మారతారో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల్లోపే బీఆర్ఎస్ శాసనసభాపక్షం కాంగ్రెస్‌లో విలీనమైనా ఆశ్చర్యపోనక్కర్లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటి వరకూ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు

1) దానం నాగేందర్ 2) కడియం శ్రీహరి 3) తెల్లం వెంకటరావు 4) పోచారం శ్రీనివాసరెడ్డి 5) డాక్టర్ సంజయ్ కుమార్ 6) కాలె యాదయ్య 7) బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి 8) ప్రకాశ్ గౌడ్ 9) అరికెపూడి గాంధీ 10) గూడెం మహిపాల్ రెడ్డి



బోడుప్పల్ మేయర్ పీఠం 'హస్త'గతం

- మేయర్‌గా అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్‌గా స్రవంతిగౌడ్ ప్రమాణ స్వీకారం
- ఫలించిన తోటకూర వజ్రేష్ యాదవ్ వ్యూహం

నవతెలంగాణ-బోడుప్పల్

హస్తం ఖాతాలో మరో కార్పొరేషన్ చేరింది. బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్‌గా కాంగ్రెస్‌కు చెందిన తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్‌గా కొత్త స్రవంతి గౌడ్ ఎన్నికయ్యారు. సోమవారం బోడుప్పల్ కార్పొరేషన్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన మేయర్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నిక గురించి ఆర్డీవో ఎజెండా అంశాన్ని ప్రకటించగా.. మేయర్ అభ్యర్థిగా తోటకూర అజయ్ యాదవ్ పేరును కాంగ్రెస్ 17వ డివిజన్ కార్పొరేటర్ పోగుల నరసింహారెడ్డి ప్రతిపాదించారు. అనంతరం 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్ బలపరిచాక.. సభ్యులందరూ ఏకగ్రీవంగా అజయ్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. దీంతో మేయర్‌గా తోటకూర అజయ్ ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయర్ పదవికి ఎన్నిక నిర్వహించగా.. 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్‌ను 3వ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్ ప్రతిపాదించగా, 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి బలపరిచారు. దీంతో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రజా పాలనను తీసుకొస్తాం..మేయర్ తోటకూర అజయ్‌యాదవ్

బోడుప్పల్ కార్పొరేషన్‌లో నాలుగేండ్ల కాలంగా అరాచక పాలన సాగిందని, ఇక నుంచి ప్రజాపాలన అందిస్తామని నూతన మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. మేయర్‌గా ప్రమాణస్వీకారం అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోడుప్పల్‌లో కుంటుపడిన అభివృద్ధి ఇక నుంచి పరుగులు పెడుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో ముందుకెళ్తామన్నారు. బోడుప్పల్ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. తనపై నమ్మకంతో మేయర్‌గా అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతిగౌడ్, కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మునిగిపోయిన నావ.. : మైనంపల్లి హన్మంతరావు

బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లాలో కనుమరుగైపోయిందని.. ఆ పార్టీ మునిగిపోయిన నావ అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బోడుప్పల్ మేయర్ ఎన్నిక సందర్భంగా పర్యవేక్షణ బాధ్యతల్లో హాజరైన ఆయన మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్‌తో కలిసి నూతన మేయర్, డిప్యూటీ మేయర్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పాలనలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఆయన అనుచరులు చేసిన అరాచకాలను కచ్చితంగా వెలికి తీస్తామన్నారు.

సీఎంకు కేజీకేఎస్ ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లు గీత వృత్తిలో ప్రమాదాల నివారణకు గీత కార్మికులకు సేఫ్టీ మోకులు పంపిణీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) ధన్యవాదాలు తెలిపింది. గీత వృత్తిలో ఏడాదికి 500 మందికిపైగా చెట్టుపై నుంచి పడి చనిపోతున్నారని ఆ సంఘం పేర్కొంది. కొందరు వికలాంగులవుతున్నారని తెలిపింది. ఈ విషయమై పలు సార్లు కేజీకేఎస్ ప్రభుత్వాలకు విన్నవించిందని గుర్తు చేసింది. కల్లుగీత కార్మిక సంఘం చేసిన పలు సూచనలతో రూపుదిద్దుకొన్న సేఫ్టీ మోకులను సీఎం పరిశీలించి వాటిని పంపిణీ చేయటం అభినందనీయమని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లకొండ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజన గురుకుల అడ్మిషన్లలో అవకతవకలు



- నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి : సంక్షేమ భవన్ ముందు ధర్నాలో గిరిజన సంఘాల నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన గురుకుల అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయనీ, రాజకీయ పలుకుబడి, మధ్యదళారీల పైరవీలకు తలొగ్గి నిబంధనలకు నీళ్లొదిలారని గిరిజన సంఘాల నేతలు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌ముందు ఆయా గిరిజన సంఘాల నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, బంజారా జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివానాయక్, తెలంగాణ గిరిజన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్, లంబాడి పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ నాయక్ ప్రసంగించారు.శ్రీరాం నాయక్ మాట్లాడుతూ గిరిజన గురుకుల సొసైటీల్లో సీట్ల కేటాయించే విషయంలో పారదర్శకత లోపించిందని చెప్పారు. దరఖాస్తు పెట్టుకున్న వారికి ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మౌఖిక ఆదేశాలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మధ్యదళారీల పైరవీలతో వచ్చిన వారికే సీట్లు కేటాయించటమేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా డబ్బు చేతులు మారిందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ చెప్పారనే కారణంతో ఒక్క నల్లగొండ జిల్లాలో 150 సీట్లకు పైగా కేటాయిస్తూ లిస్టు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఈ లిస్టుల తయారీలో పైరవి కారుల చేతి వాటం ఎంతుందో తేల్చాలని డిమాండ్ చేశారు. ఏ నిబంధన ప్రకారం ఈ పద్ధతిని పాటించారో ప్రకటించాలన్నారు. నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటుకేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అంజయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో సీట్ల కోసం వేలాదిమంది పరీక్షలు రాశారనీ, మొదటి కౌన్సిలింగ్‌లో సీట్లు రానివారు తిరిగి దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని చెప్పారు. రెండు నెల్లుగా తమ పిల్లల సీటు కోసం తల్లిదండ్రులు ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. నిబంధనలు పాటించకుండా పైరవీలకు పీట వేయటమేంటని ప్రశ్నించారు. సీట్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. తిరిగి పారదర్శకంగా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో గిరిజన సంఘం హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం బాలు, అమర్ సింగ్, గిరిజన సమాఖ్య నాయకులు శివా ప్రచండ, నారాయణ, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్ పరిధిలో డ్రగ్స్ పట్టివేత

నవతెలంగాణ-మియాపూర్



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రాజేంద్రనగర్ పోలీసులు భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ.35 లక్షల విలువ చేసే 119 గ్రాముల మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ సోమవారం మీడియాకు వెల్లడించారు. నైజీరియన్ ముఠా ఫేక్ పాస్‌పోర్టు ద్వారా భారత దేశంలోకి ప్రవేశించి.. వివిధ నగరాల్లో డ్రగ్స్ విక్రయిస్తున్నది. ఈ ముఠాకు చెందిన ఒనౌహా బ్లెస్సింగ్ (వెస్ట్ ఆఫ్రికా) అనే మహిళ ఈ డ్రగ్స్ విక్రయిస్తోంది. ఈ ముఠా హైదరాబాద్‌లో సైతం డ్రగ్స్ విక్రయాలు చేపట్టింది. ఈ క్రమంలో రాజేంద్రనగర్ పరిధిలోని హైదర్శకోట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నైజీరియాకు చెందిన ముఠా మత్తు పదార్థాలు అమ్ముతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు దాడి నిర్వహించగా.. ఐదుగురు నిందితులు ఒనౌహా బ్లెస్సింగ్, అజీజ్ నోహీం, అల్లం సత్య వెంకట గౌతమ్, సానబోయిన వరుణ్‌కుమార్, మహ్మద్ మహబూబ్ షరీఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు 13 మందికి డ్రగ్స్ విక్రయించినట్టు గుర్తించారు. వారిలో ఆరుగురికి కొకైన్ టెస్టులో పాజిటివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన వారిలో ప్రముఖ హీరోయిన్ తమ్ముడు అమాన్ ప్రీత్‌సింగ్‌తోపాటు పలువురు ఉన్నారు. వీరిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇప్పటివరకు ఈ ముఠా ఇరవై సార్లు నగరానికి మత్తు పదార్థాలను సరఫరా చేసినట్టు పోలీసులు గుర్తించారు. వీరి నుంచి 119 గ్రాముల డ్రగ్స్, 2 పాస్‌పోర్టులు, 10 సెల్ ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీసీపీ తెలిపారు.

'రైతుబంధు'ను 'రాబందు'గా మార్చిన బీఆర్ఎస్

- పదెకరాల రైతులు, కౌలుదార్లకు 'భరోసా' ఇవ్వాలి
- రైతుభరోసా క్యాబినెట్ సబ్‌కమిటీలో రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



రైతుబంధు పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రాబందు పథకంగా మార్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చి అన్ని సబ్సిడీ పథకాలను ఎత్తేసి రైతులకు అన్యాయం చేసిందన్నారు. పంటకు నష్టపరిహారం ఇవ్వడానికి సైతం చేతులు రాలేదన్నారు. పదెకరాలున్న రైతులకు, కౌలుదార్లకు రైతు భరోసా వర్తింపచేయాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. మరికొందరు రైతులు, కౌలుదార్లను గుర్తించడానికి వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతోపాటు ఐదుగురు రైతులతో కమిటీ వేయాలని సూచించారు. సోమవారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించిన రైతు భరోసా క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మెన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరారవు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు పంటలకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వాలని, దీనివల్ల రైతుకు ఎక్కువ లాభం జరుగుతుందని అన్నారు. విత్తనాలు, ఎరువులు, పప్పుధాన్యాల సాగుకు సబ్సిడీలిచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న చాలా మంది రైతులకు పట్టాలు లేక రైతుబంధు పొందలేకపోయారని, 'ధరణి'తో గందరగోళంతో తీవ్రంగా నష్టపోయామని, క్షేత్రస్థాయిలో విచారణ చేసి రికార్డులను కరెక్ట్ చేయాలని కోరారు. ప్రతి రైతుకూ పింఛన్ ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. రైతు కమిషన్ వేసి నిత్యం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని మేధావులు సూచించారు.

శాసనసభలో మీ అభిప్రాయాలపై చర్చిస్తాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు

రైతు భరోసా పథకం రూపకల్పన విషయంలో ఇక్కడ మీరు చెబుతున్న అభిప్రాయాలను శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి, రైతు భరోసా క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల సమక్షంలోనే ప్రజల అభిప్రాయాల మేరకే ప్రభుత్వ ఉత్తర్వులుండేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పాన్‌కార్డ్ ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వరని చేస్తున్న దుష్ప్రచారం సరికాదన్నారు. రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సూచనల మేరకు ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టులో అమలు చేయనున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే రూ.7,562 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతుబంధులో జరిగిన అక్రమాలు, అవకతవకలు రైతు భరోసాలో జరుగకూడదనే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. రైతు భరోసా విషయంలో నేరుగా రైతులతో చర్చించడానికే సీఎం అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, పశువులకు బీమా అమలు చేస్తే బాగుంటుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అసలైన రైతులకు రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, యశస్విని‌రెడ్డి, డాక్టర్ మురళీనాయక్, 'కుడా' చైర్మెన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, హన్మకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, రిజ్వాన్ భాషా షేక్, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, దివాకర, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'భరోసా' ఇవ్వాలి

క్షేత్రస్థాయిలో 40శాతం పైగా కౌలు రైతులే సాగు చేస్తున్నందున వారికీ రైతు భరోసాను ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య తెలిపారు. కౌలు రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించడానికి వ్యవసాయ శాఖాధికారులు కృషి చేయాలన్నారు. సాగుదారులందరికీ రైతు భరోసా అందించాలని చెప్పారు.

ఎం. చుక్కయ్య, రైతు సంఘం
జిల్లా కార్యదర్శి, హన్మకొండ జిల్లా

బ్లాక్ కాఫీ గుండెకు ఎంతో మేలు..

ఉదయం లేవగానే గొంతులో కాఫీ పడనిదే బెడ్ కూడా దిగరు చాలా మంది. ఎక్కువ మంది టీ కంటే కాఫీనే ఇష్ట పడతారు. సరైన మోతాదులో తాగితే కాఫీతో ఎన్నో రకాల ఉపయోగాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజూ కాఫీ తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిదని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.

బ్లాక్ కాఫీలో ఎన్నో రకాల యాంటీ ఆక్సిడెంట్లు



ఉంటాయి. కాబట్టి ఒత్తిడి, ఆందోళన వంటివి దరి చేరకుండా ఉంటాయి. ఒత్తిడిగా అనిపించినప్పుడు, టెన్షన్‌గా ఉన్నప్పుడు ఒక కప్పు బ్లాక్ కాఫీని తీసుకుంటే చాలా మంచిది. కాఫీ తాగితే కేంద్ర నాడీ వ్యవస్థ యాక్టీవ్ అవుతుంది. దీంతో రీఫ్రెష్‌గా ఉంటుంది.

బ్లాక్ కాఫీ.. లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో హెల్ప్ చేస్తుంది. ఫ్యాటీ లివర్, హైపటైటిస్, కాలేయ క్యాన్సర్, ఆల్కహాలిక్ సిర్రోసిస్ ప్రమాదాన్ని కూడా నివారిస్తుంది. బ్లాక్ కాఫీ తాగడం వల్ల పొట్ట ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. చక్కెర లేని కాఫీ శరీరంలో ఉండే టాక్సిన్స్, బ్యాక్టీరియాను సులభంగా బయటకు పంపిస్తుంది.

జ్యూరీ మెంబర్‌గా మొదటి మహిళ



బిల్కిస్ మీర్... కాశ్మీరీ వాటర్ స్పోర్ట్స్ అథ్లెట్. ఎన్నో పోరాటాలు చేసి గొప్ప అనుభవమున్న క్రీడాకారిణిగా, కోచ్ గుర్తింపు తెచ్చుకుంది. కాశ్మీర్ లోయ నుండి మొదటి మహిళా వాటర్ స్పోర్ట్స్ అథ్లెట్‌గా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు చరిత్ర పుటల్లో తన పేరు లిఖించుకునేందుకు మరో పేజీని సిద్ధం చేసుకుంది. జూలై 26 నుండి ఆగస్టు 11 వరకు పారిస్‌లో జరగనున్న సమ్మర్ ఒలింపిక్స్‌కు ఆమె జ్యూరీ మెంబర్‌గా ఎంపికయ్యారు. దాంతో ఈ ఒలింపిక్స్‌కు జ్యూరీ మెంబర్‌గా వ్యవహరించే మొదటి భారతీయ మహిళగా నిలిచిన ఆమె పరిచయం నేటి మానవిలో...

'నేను చాలా సంతోషంగా ఉన్నాను. కానీ ఎంతో కష్టపడి ఇక్కడికి చేరుకున్నాను. ఇప్పుడు నేను పోషించబోయే పాత్ర అత్యంత బాధ్యతతో కూడుకున్నది. పోటీల్లో నాయాన్యాయాలను బేరీజు వేయడం అంటే అంత తేలికైన విషయం కాదు. అయితే నా దేశానికి నేను ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఓ అథ్లెట్‌గా ఒలింపిక్స్‌లో ఆడాలనే నా కలను నేను నెరవేర్చుకోలేకపోయాను. కానీ ఇప్పుడు న్యాయనిర్ణేతగా ఉండబోతున్నాను' అంటూ మీర్ తన ఆనందాన్ని పంచుకుంది.

అపచారంగా భావించేవారు

పాఠశాల నుండి తడి బట్టలతో ఇంటికి తిరిగి వస్తుండగా చుట్టుపక్కల వారి నుండి ఎన్నో అవమానాలు ఎదుర్కొంది. అప్పట్లో ఆడపిల్లలు క్రీడల్లో పాల్గొనడం అపచారంగా భావించే సమాజం వారిది. అందుకే తల్లిదండ్రులు ఆమెను తిట్టారు. అవేవీ ఆమె లెక్క చేయలేదు. వాటర్ స్పోర్ట్స్ క్లాసులకు హాజరు కావడానికి పాఠశాలను సైతం కోల్పోతుంది. తాను ఏం చేయాలనుకుంటుందో దానికే కట్టుబడి ఉంది. ఇక ఆమె ఆగలేదు. 1997లో దేశవాళీ టోర్నీలో పాల్గొని పతకం సాధించింది. 'మహిళల పోరాటం వారి ఇంటి గుమ్మం నుండే ప్రారంభమవుతుంది. నా తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు, కానీ చాలా కోపంగా ఉన్నారు' ఆమె జతచేస్తుంది.

ప్రధాన కోచ్‌గా

2009లో హంగేరిలోని స్జెడ్‌లో కయాకింగ్, కానోయింగ్‌లో జరిగిన ఐసీఎఫ్ స్ప్రింట్ రేసింగ్ ప్రపంచ కప్‌లో పోటీ పడింది. 2007, 2008లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో కూడా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. 2007 నుండి ఇండియన్ క్యాంప్‌లో మీర్ కోచింగ్ ప్రారంభించింది. ఒక్క ఏడాదిలోనే దేశంలోని వివిధ ప్రాంతాల్లో కానోయింగ్, కయాకింగ్ శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆమె 2013 వరకు కోచింగ్‌లో కొనసాగింది. తర్వాత జమ్మూ-కాశ్మీర్‌కు తిరిగి వచ్చింది.



2011లో కయాకింగ్, కానోయింగ్ క్రీడాకారులతో కూడిన భారత మహిళల జట్టుకు ప్రధాన కోచ్‌గా ఎంపికయ్యింది.

మద్దతు ఇచ్చేందుకు

2020లో ఇండోనేషియాలో జరిగే 18వ ఆసియా క్రీడల కానో స్ప్రింట్‌కు మీర్‌ను ఏషియన్ కానో ఫెడరేషన్ న్యాయనిర్ణేతగా ఎంపిక చేసింది. సెప్టెంబర్ 2023లో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన 19వ ఆసియా క్రీడలకు ఆమె జ్యూరీ సభ్యురాలు. యువ క్రీడాకారులు తన కెరీర్‌లో తాను చూసిన సవాళ్లను ఎదుర్కోకూడదని మీర్ అభిప్రాయపడ్డారు. అందుకే కాశ్మీర్‌కు తిరిగి వచ్చిన తర్వాత ఆమె స్థానిక యువ క్రీడాకారులకు కయాకింగ్, కానోయింగ్ పాఠాలను అందించడం ప్రారంభించింది. ఆమె మార్గదర్శకత్వంలో దాదాపు 110 మంది విద్యార్థులు రాష్ట్రం నుండి జాతీయ పోటీలలో గెలుపొందారు. 'ఒక ఆటగాడికి మార్గదర్శకత్వం, మద్దతు ఎంత ముఖ్యమో నేను గ్రహించాను. ప్రోత్సాహం, చేయూత ఇచ్చే వారి అవసరం ఉంటుంది. అటువంటి సహకారం నాకు అందలేదు. కాబట్టి అలాంటి మద్దతు నేను యువ క్రీడాకారులకు అందించాలనుకుంటున్నాను' ఆమె జతచేస్తుంది.

పోరాడుతూనే ఉంది

మీర్ క్రీడా ప్రయాణమంతా పోరాటాలతో నిండిపోయింది. ఓ కాశ్మీరీ అమ్మాయిగా క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడం ఆమె చేసిన అత్యంత సాహసవంతమైన పని. 'ఆమె ఇతర అమ్మాయిలను చెడగొడుతుంది', 'నువ్వు ఆడపిల్లవి, నువ్వు ఎలా ఆడగలవు?' వంటి మాటలతో ఆమెను ఇబ్బంది పెట్టిన వ్యక్తులను ఆమె గుర్తుచేసుకుంది. అలాగే తను కోచ్‌గా మారిన తర్వాత పురుషుల జట్టుకు ఆమెను కేటాయించిన రోజును మీర్ ఇలా గుర్తు చేసుకుంది.. 'నేను వారికి శిక్షణ ఇవ్వగలనా అని ప్రజలు ఎగతాళిగా నవ్వారు, సందేహించారు. కానీ మన గురించి మనకు తెలిస్తే చాలు. మనల్ని ఎవ్వరూ ఓడించలేరు అనేది నేను నమ్ముతున్నాను'. మీర్ తల్లి కూడా అనేక బాధలు భరించింది. 'మీర్ కాశ్మీర్ పేరును చెడగొడుతుందని అందరూ అనేవారు. ఇలాంటి ఎన్నో మాటలు నేను వినాల్సి వచ్చింది' అంటూ ఆమె తల్లి పంచుకుంది. ఇన్ని నిరుత్సాహపరిచే వ్యాఖ్యల మధ్య మీర్ పోరాటం చేస్తూనే ఉంది. కానీ ఆమె తల్లి ఆమెను విడిచిపెట్టకుండా ప్రోత్సహించింది.

దేశం గర్వించేలా...

తన కెరీర్‌ను ప్రారంభించినప్పుడు అవసరమైన వనరులు, మద్దతు, రోల్ మోడల్ అంటూ ఎవ్వరూ లేరని ఆమె నొక్కి చెప్పింది. ఇవన్నీ ఆమెను ఒలింపిక్స్‌కు చేరుకోకుండా నిరోధించాయని అంటున్నారు. ఇప్పుడు కాలం మారుతోంది. మహిళలు క్రీడల్లో ముందుకు వస్తున్నారు. వివిధ ఆటల్లో భారతదేశం గర్వించేలా చేస్తున్నారు.



నిజానికి జ్యూరీ సభ్యురాలిగా పురుషాధిపత్య రంగంలో నిర్ణయం తీసుకునే పాత్రలలో పెరుగుతున్న మహిళా ప్రాతినిధ్యానికి ఇప్పుడు మీర్ ఓ నిదర్శనం. 'మహిళలు తమ మనసును నిర్దేశిస్తే ఏదైనా చేయగలరు. అయితే ఉజ్వల భవిష్యత్తును సృష్టించుకోవడానికి వారు వదలకుండా పోరాడాలి. కంఫర్ట్ జోన్‌ల నుండి బయటపడాలి' ఆమె చెప్పింది.

చిన్ననాటి కల

మీర్ తన చిన్నతనం నుండి బాక్సర్ కావాలనుకుంది. తన ఇంటి ముందరి చెట్టును ఎప్పుడూ గుద్దుతూ ఉండేదని ఆమె తల్లిదండ్రులు గుర్తు చేసుకున్నారు. అయితే ఏడేండ్ల వయసులో ఆమె తన స్నేహితురాలితో కలిసి దాల్ లేక్‌లోని వాటర్ స్పోర్ట్స్ క్లాస్‌ని చూసేందుకు వెళ్ళింది. అంతే అంతా మారిపోయింది. కోచ్ ఆమెను సమీపంలోని పార్క్‌లో కూర్చోమని లేదా ఇతర విద్యార్థులతో పాటు ప్రాక్టీస్ చేయవల్సిందిగా కోరాడు. ఇక ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా విద్యార్థులతో చేరాలని నిర్ణయించుకుంది. 'ఆ రోజు నా జీవితాన్ని మార్చేసింది. పడవను బ్యాలెన్స్ చేయడం చాలా కష్టంగా ఉన్నప్పటికీ మళ్లీ మళ్లీ ప్రయత్నించేందుకు నిర్ణయించుకున్నాను' ఆమె పంచుకుంది.

అవగాహన లేకనే...

వాటర్ స్పోర్ట్స్ కోసం తల్లిదండ్రులను ఒప్పించేందుకు తనకు 15 రోజులు పట్టిందని ఆమె గుర్తుచేసుకుంది. 'అప్పట్లో క్రీడల గురించి ఎటువంటి అవగాహన లేదు. కానోయింగ్, కయాకింగ్ తప్ప మహిళలు ఆడటం, క్రీడలను వృత్తిగా కొనసాగించడం అనేది లేదు. అందుకే నా తల్లిదండ్రులు అర్థం చేసుకోవడానికి సమయం పట్టింది. కానీ వారు చివరికి నా ఇష్టాన్ని అంగీకరించారు' ఆమె చెబుతుంది. అతి తక్కువ కాలంలోనే ఆమె వివిధ కానోయింగ్ పోటీలలో పాల్గొనడం మొదలుపెట్టింది. మొత్తం 12 జాతీయ పోటీల్లో జమ్మూ కాశ్మీర్‌కు ప్రాతినిధ్యం వహించింది.

మోడీ నాయకత్వంలో
బీజేపీ మునిగిపోతుంది

(మొదటిపేజీ తరువాయి)

హోం మంత్రి అమిత్ షా వంటి బీజేపీ సీనియర్ నేతలకు వ్యతిరేకంగా ధ్వజమెత్తుతున్నారు. జూన్ 25వ తేదీని మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని హత్య చేసిన రోజుగా అభివర్ణించడంపై ఆయన స్పందిస్తూ 'ఎమర్జెన్సీని వ్యతిరేకించేందుకు మోడీ, అమిత్ షా నిర్వహించిన పాత్ర ఏమిటి?' అని ప్రశ్నించారు. క్రెడిట్‌ను లాక్కోవడం ఓ పెద్ద వ్యాధి అని ఎత్తిపొడిచారు. రష్యాలో ఇటీవల మోడీ జరిపిన పర్యటనపై కూడా ఆయన మాట్లాడారు. ఈ పర్యటన భారత్-అమెరికా సంబంధాలపై ప్రభావం చూపుతుందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మోడీపై సుబ్రమణ్య స్వామి విరుచుకుపడ్డారు. 'ఎన్నికల ప్రచార సమయంలో ఆయన తన ఎదుట హాజరైన ప్రజలను చూసి నమస్తే అని అభివాదం చేయకముందే ఆ జనసమూహం అదృశ్యమైపోయింది' అని ఎద్దేవా చేశారు.

ఉప ఎన్నికల్లో ఇండియా కూటమికి 10 స్థానాలు లభించగా ఎన్డీఏ కేవలం రెండు సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బద్రీనాథ్‌లో కూడా కాంగ్రెస్ గెలవడాన్ని కమలదళం జీర్ణించుకోలేకపోతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో సైతం ఆ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. హిందువుల ప్రార్థనా స్థలాల్లో సైతం కాషాయ పార్టీ మట్టికరవడంతో దాని హిందూత్వ భావజాలానికి, సిద్ధాంతానికి కాలం చెల్లిందని చెప్పవచ్చు.

భగ్గుమన్న నిత్యావసరాల ధరలు

(మొదటిపేజీ తరువాయి)

మేలో టోకు ధరల ద్రవ్యోల్బణం పెరిగిందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.ఆహార వస్తువులు, ఆహార పదార్థాల తయారీ, ముడి పెట్రోలియం, సహజ వాయువు, ఖనిజ చమురులు, ఇతర ఉత్పత్తి వస్తువుల ధరలు పెరగడంతో టోకు ద్రవ్యోల్బణంలో పెరుగుదల కన్పించింది. ఆహార ధరల ద్రవ్యోల్బణ రేటు ఏప్రిల్‌లో 5.52 శాతం, మేలో 7.40 శాతం ఉండగా జూన్‌లో 8.7 శాతానికి పెరిగింది. అన్ని ప్రధాన వస్తువులతో పోలిస్తే ఇదే అత్యధికం. ఉత్పత్తి చేసిన వస్తువుల ధరలు కూడా మేతో పోలిస్తే జూన్‌లో రెట్టింపు అయ్యాయి. మేలో వీటి ధరలు 0.64 శాతం ఉంటే జూన్‌లో 1.43 శాతానికి చేరాయి. ఆహారధాన్యాలు, వరి, గోధుమ, పప్పులు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు వంటి ఆహార వస్తువులు సహా ప్రజలకు అవసరమైన వస్తువుల ద్రవ్యోల్బణ రేటు మేలో 7.20 శాతం ఉండగా జూన్ నాటికి 8.80 శాతానికి పెరిగింది.

ఇదే సమయంలో కూరగాయల టోకు ధరల్లో ద్రవ్యోల్బణం కూడా 32.42 శాతం నుంచి 38.76 శాతానికి పెరిగింది. పండ్ల ధరల్లో ద్రవ్యోల్బణం 5.81 శాతం నుంచి 10.14 శాతానికి పెరిగిపోయింది. అయితే ఇంధనం, విద్యుత్‌కు సంబంధించిన ద్రవ్యోల్బణ రేటు 1.35 శాతం నుంచి 1.03 శాతానికి తగ్గింది.

ఎస్‌బీఐ రుణాలు భారం

(మొదటిపేజీ తరువాయి)



ఖాతాదారులు రిటైల్, వాహన, గృహ రుణాల వాయిదాలపై అదనంగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. వాహన రుణాలు ఒక సంవత్సరం, పర్సనల్ రుణాలు రెండు సంవత్సరాల ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానించి ఉంటాయి. ఒక్క రోజు నుంచి మూడేళ్ల వరకు వివిధ కాలపరిమితులకు ఎంసీఎల్ఆర్ వేర్వేరుగా ఉంటుంది. ఆ తర్వాత ఒకే వడ్డీ రేటు ఉంటుంది. సిబిల్ స్కోర్ ఆధారంగా ప్రస్తుతం ఎస్‌బీఐ గృహ రుణాల వడ్డీ రేటు శ్రేణి 8.50 శాతం నుంచి 9.65 శాతంగా ఉంది.

మాకు తెలిసింది మీకు చెబుతాం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యంపై న్యాయ కమిషన్ విచారణ కీలకమలుపు తిరిగింది. సోమవారం పలువురు సీనియర్ ఐఏఎస్‌లతోపాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు సైతం కమిషన్ ముందు హాజరయ్యారు. విచారణలో న్యాయ కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ అడిగిన ప్రశ్నలకు 'మాకు తెలిసిందంతా.. మీకు చెబుతామని.. ఇందులో దాచాల్సింది ఏమీ లేదని' సమాధాన మిచ్చినట్టు తెలిసింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, కేసీఆర్ పేషీలో కీలకంగా వ్యవహరించిన స్మితాసబర్వాల్, సాగునీటి శాఖ మాజీ కార్యదర్శులు వికాస్‌రాజ్, మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ తదితరులు కమిషన్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా కమిషన్ చైర్మెన్ ఘోష్ ఒక్కో అధికారిని పది నుంచి 15 నిమిషాల పాటు విచారించారు. సాగునీటి శాఖ, కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారాల్లో సంబంధమున్న ప్రతిఒక్కరినీ విచారిస్తామని గతంలోనే కమిషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా పరమైన అంశాల ఆధారంగా కమిషన్ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఐఏఎస్‌ల విచారణ సందర్భంగా కీలక సమాచారాన్ని ఘోష్ కమిషన్ రాబట్టినట్టు తెలిసింది. రామకృష్ణారావు దీర్ఘకాలికంగా ఆర్థిక శాఖను పర్యవేక్షిస్తున్న సంగతి తెలిసిందే. ప్రాజెక్టులకు ఈయన కాలంలోనే అధికంగా నిధులు విడుదల చేశారు. రజత్‌కుమార్ రాష్ట్ర ఎలక్టోరల్ సీఈవోగా పనిచేసిన అనంతరం సాగునీటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. మెగా కంపెనీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. ఆయన కూతురు పెండ్లి నిమిత్తం మెగా కంపెనీ నుంచి ఆర్థికంగా లాభపడ్డారనే విమర్శలు వెల్లువెత్తిన విషయం విదితమే. పాత బీఆర్ఎస్ సర్కారు మాత్రం ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ అంశాలపై జస్టిస్ ఘోష్ ఆయా అధికారులను ప్రశ్నించారని తెలిసింది. డీపీఆర్ ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులిచ్చామని రామకృష్ణారావు, తాము ఏ కంపెనీ నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం తీసుకోలేదని రజత్‌కుమార్ చెప్పినట్టు సమాచారం. అలాగే మాజీ సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను సైతం కమిషన్ దాదాపు గంటసేపు ప్రశ్నించింది. 'నేను సీఎంవో కార్యదర్శిగా ఉన్న మాట వాస్తవమేనని.. తమకు కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేదనీ, పరిపాలన పరమైన వ్యవహారాలు మినహా ఇతర విషయాలతో తనకు లింక్ లేదని' సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఇతర అధికారుల కంటే స్మితా సబర్వాల్ ఎక్కువ సేపు కమిషన్ చైర్మెన్ చాంబర్‌లో ఉన్నారు. దీంతో ఆమెను విచారించడానికి సమయం ఎక్కువ పట్టినట్టు తెలిసింది. తొలుత వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానని చెప్పిన మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ చివరకు సాయంత్రం నాలుగు గంటలకు కమిషన్ ముందుకు ప్రత్యక్షంగానే వచ్చారు. ఆయన హయాంలో జరిగిన పరిపాలనాపరమైన అంశాలపై ఘోష్ కమిషన్ ఆయన్ను ప్రశ్నించినట్టు సమాచారం. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , సాగునీటి శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ అనంతరం సలహాదారుగా పనిచేసిన ఎస్‌కే జోషి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. అనారోగ్యం మూలంగా వీసీ ద్వారా హాజరయ్యేందుకు కమిషన్ అనుమతించింది. అలాగే ఆయా అధికారుల హయాంలో జరిగిన కీలక నిర్ణయాలు, అందుకు గల కారణాలు, అమలుచేసిన విధానం తదితర అంశాలపై కామన్‌గా అందరిని ప్రశ్నించినట్టు సమాచారం. విచారణలో చెప్పిన అంశాలను అఫిడవిట్ల రూపంలో సమర్పించాలని కమిషన్ చైర్మెన్ ఘోష్ ఐఏఎస్‌లకు సూచించినట్టు తెలిసింది. వీరందరికీ ఈనెలాఖరు వరకు గడువిచ్చారు. ఒక్క ఆర్థిక శాఖ రామకృష్ణారావుకు మాత్రం ఆగస్టు ఐదు వరకు సమయమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పనలో ఆర్థిక శాఖ ప్రధానాధికారిగా రామకృష్ణారావు తీరికలేకుండా ఉండటంతో ఆయనకు అదనపు సమయం కేటాయించినట్టు కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలావుండగా మాజీ ఆర్థిక శాఖ అధికారి నాగిరెడ్డి కమిషన్ నోటీసులకు స్పందించ లేదు. నోటీసులు అందగానే ఐఏఎస్‌లు అంతా స్పందించడం పట్ల కమిషన్ వర్గాలు హర్షం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

పీపీటీ ఇచ్చిన రఘు

కాళేశ్వరం విచారణకు హాజరైన ఇంజినీర్, జేఏసీ నేత రఘు సోమవారం కమిషన్‌కు కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దాదాపు అరగంటకుపైగా ఆయన్ను కమిషన్ విచారించింది. ఈసందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ దగ్గర నుంచి పూర్తయ్యేవరకు చోటుచేసుకున్న లోపాలను చెప్పాలని చైర్మెన్ ఘోష్, రఘును అడిగినట్టు సమాచారం. అనంతరం రఘు బీఆర్‌కేఆర్ భవన్ దగ్గర మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్పుపై సమాచారం అందజేసినట్టు చెప్పారు. పంపుహౌజ్‌లపై చర్చ వచ్చిందనీ, పీపీటీ ద్వారా విషయాలు చెప్పానని అన్నారు. నీళ్లు లేకనే తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చామని గత ప్రభుత్వం చెప్పిందని అన్నారు. కాగా తాను తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు ఉన్నాయనే సమాచారాన్ని తాము కమిషన్‌కు అందజేసినట్టు చెప్పారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం ఇంజినీరింగ్ వైఫల్యంగానే తాను భావిస్తున్నట్టు కమిషన్‌కు చెప్పామన్నారు. బ్యారేజీలు, పంపుహౌజ్‌ల నిర్మాణం కోసం ఖర్చును అధికంగా చూపారని తెలిపారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీ తరలించడమనేది అశాస్త్రీయమని, దానికి సంబంధించిన ఆధారాలను కమిషన్‌కు సమర్పించినట్టు చెప్పారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారు కాకముందే బ్యారేజీల నిర్మాణం చేపట్టారనీ, అంతేగాక నిర్మాణంలోనూ తప్పిదాలు జరిగాయని కమిషన్‌కు తెలియజేసినట్టు రఘు మీడియాకు చెప్పారు.

డీఎస్సీ నిర్వహణకు సర్వంసిద్ధం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభమవనున్నాయి. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విభాగం (సీబీఆర్టీ) విధానంలో పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వంసిద్ధం చేశారు. మొదటి సారిగా డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలూ చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎఎఎ. ఎష్ప్రశీశీశ్రీవఎబ్.వశ్రీఖఅస్త్రుఅఖ.ప్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా డీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 11 నుంచే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 2,24,851 మంది అభ్యర్థులు ఈ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

డీఎస్సీకి 2,79,957 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు వెంటనే చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి సూచించారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈనెల 18 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు రోజూ రెండు విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు జరుగుతుంది. రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు నిర్వహిస్తారు. మొదటి విడతకు ఉదయం 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు గేట్లను మూసేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం 1.45 గంటలకు గేట్లను మూసేస్తారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లను మూసేస్తామని అధికారులు స్పష్టం చేశారు. మొదటి విడతలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడతలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. డీఎస్సీ అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తారు. అందుకే పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు. కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, లాగరిథమ్ టేబుళ్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్షా కేంద్రాల్లోకి తెచ్చుకోవడం నిషేధమని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాపాడాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ పార్టీ ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారపూరితంగా ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నదని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాదని కాంగ్రెస్ నేతలకు సంక్షేమ పథకాల పంపిణీ బాధ్యతలు అప్పగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల హక్కులు, ప్రొటొకాల్ ఉల్లంఘనలు జరగకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం సీఎస్, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలివ్వాలని కోరారు. అవసరమైతే ఈ అంశాన్ని అసెంబ్లీ సమావేశాలు లేవనెత్తుతామని తెలిపారు.

ప్రాజెక్టులకు చేరుతున్న వరద



(మొదటిపేజీ తరువాయి)

ప్యారడైజ్, చిలకలగూడ, ప్యాట్నీ, మారేడుపల్లి, అడ్డగుట్ట తదితర ప్రాంతాల్లో రోడ్లపై పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. దాంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇదిలావుండగా వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరిక నేపథ్యంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, అత్యవసర అయితేనే ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలని సూచించారు. నగరంలో 140 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద నీరు నిలువకుండా ఎప్పటికప్పుడూ తొలగించేందుకు స్టాటిక్ బృందాలు, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలతోపాటు సీఆర్ఎంపీ, ఈవీడీఎం బృందాలను రంగంలోకి దించారు.

హుస్సేన్ సాగర్ రెండు గేట్లు ఎత్తివేత

గ్రేటర్‌లో కురుస్తున్న వర్షాలతో హుస్సేన్‌సాగర్ నిండు కుండలా మారింది. హుస్సేన్‌సాగర్ ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జీహెచ్ఎంసీ అధికారులు రెండు గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ట్యాంక్‌బండ్ పూర్తిస్థాయి సామర్థ్యం 514.75 అడుగులుకాగా, ప్రస్తుతం 513.43 అడుగుల మేర నీరు ఉంది.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఓ మోస్తారు వర్షం పడింది. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని కురిసన వర్షానికి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని ప్రభుదాస్ వాటిక ఆశ్రమంలో భారీ వృక్షాలు విరిగిపడి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దాంతో పలు గ్రామాలకు ఆదివారం అర్ధరాత్రి 12గంటల నుంచి సోమవారం సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ డీఈ సంజీవ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎంతో శ్రమించి చెట్ల కొమ్మలు తొలగించి, రెండు స్తంభాలు వేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. విద్యుత్ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు నిలిచిపోయాయి.

జూరాలకు వరద

జూరాల ప్రాజెక్టుకు సోమవారం ఎగువ నుంచి 2,894 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 1,806 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నెట్టెంపాడు లిఫ్టుకు 656, భీమా లిఫ్ట్-1కు 650, ఎడమ కాల్వకు 390, భీమా లిఫ్ట్-2కు 766 క్యూసెక్కులను వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 4.014 టీఎంసీలు ఉన్నది. అలాగే, కర్నాటకలోని టీబీ డ్యాంకు 15,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 211 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. డ్యాం గరిష్ఠ స్థాయి నీటి నిల్వ 105.855 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 33.074 టీఎంసీల నిల్వ ఉన్నది.

చాంపియన్ అర్జెంటీనా



కోపా అమెరికా టైటిల్ సొంతం
ఫైనల్లో కొలంబియాపై గెలుపు

ఫ్లోరిడా : లియోనల్ మెస్సి మళ్లీ మాయ చేశాడు. ఫిఫా ప్రపంచకప్‌తో చిరకాల స్వప్నం సాకారం చేసుకున్న సాకర్ సూపర్ స్టార్.. కోపా అమెరికాలో అర్జెంటీనాకు రికార్డు టైటిల్ అందించాడు. ఆదివారం జరిగిన (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) టైటిల్ పోరులో కొలంబియాపై 1-0తో విజయం సాధించిన అర్జెంటీనా.. రికార్డు 16వ కోపా టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన టైటిల్ పోరులో కొలంబియా గట్టి పోటీ ఇచ్చింది. అదనపు సమయంలో గోల్ కొట్టిన మార్టినెజ్ అర్జెంటీనాకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

కొలంబియా, అర్జెంటీనా నడుమ కోపా అమెరికా టైటిల్ పోరు ఆద్యంతం ఉత్కంఠ రేపింది. అభిమానుల గోల, భద్రతా కారణాలకు పూర్తి సమయం మ్యాచ్‌లో గోల్ నమోదు కాలేదు. దీంతో ఫ్లోరిడాలోని మియామి గ్రౌండ్స్‌లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మ్యాచ్‌లో 66వ నిమిషంలో లియోనల్ మెస్సి గాయంతో మైదానం వీడాడు. దీంతో మైదానం లోపల, బయట ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది. 90 నిమిషాల అనంతరం.. అదనపు సమయంలో 112వ నిమిషంలో గోల్ కొట్టిన లాటారో మార్టినెజ్.. అర్జెంటీనాలో సంబురాలకు తెరలేపాడు. కోపా అమెరికా టోర్నీలో మార్టినెజ్‌కు ఇది ఐదో గోల్ కావటం విశేషం. కెప్టెన్ లియోనల్ మెస్సి మ్యాజిక్‌తో అర్జెంటీనా గోల్ అవకాశాలను సృష్టించినా.. కొలంబియా డిఫెన్స్‌ను ఛేదించలేదు. 2021లో కోపా అమెరికా టైటిల్‌తో మొదలైన లియోనల్ మెస్సీ మాయ.. 2022 ఫిఫా ప్రపంచకప్, 2024 కోపా అమెరికా టైటిల్‌తో అప్రతిహతంగా సాగుతోంది.

ఆ బెంగ తీరినట్టే!


- దూబె, అభిషేక్ ఆల్‌రౌండ్ నైపుణ్యం
- ఆల్‌రౌండ్ విభాగం సమస్యలకు చెక్

ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, ఓ వికెట్ కీపర్, ఓ ఆల్‌రౌండర్ సహా నలుగురు స్పెషలిస్ట్ బౌలర్లు. కొంతకాలంగా టీమ్ ఇండియా తుది జట్టు కూర్పు ఇదే. బ్యాట్‌తో, బంతితో స్పెషలిస్ట్ ఆటగాళ్లతో ఐసీసీ ఈవెంట్లలో దండయాత్ర చేసినా ఫలితం దక్కలేదు.

నలుగురు బ్యాటర్లు, నలుగురు ఆల్‌రౌండర్లు, ముగ్గురు బౌలర్లు.. ఈ కూర్పుతో ఓ సారి ప్రయత్నించిన టీమ్ ఇండియా.. ఐసీసీ టైటిల్ వేటలో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయంలో భారత జట్టులోని ఆల్‌రౌండర్ల ఘనత వెలకట్టలేనిది.

అత్యంత వేగంగా దూసుకెళ్తోన్న ఆధునిక టీ20 క్రికెట్‌లో అవసరాలకు తగినట్టు మార్పు చెందకుంటే పోటీలో ఉండలేం. నలుగురు ఆల్‌రౌండర్ల ఫార్ములాతో హిట్ కొట్టిన టీమ్ ఇండియా.. భవిష్యత్‌లోనూ అదే విజయ సూత్రం పాటించేందుకు అడుగులు వేస్తోంది. జింబాబ్వేతో టీ20 సిరీస్‌లో భారత్ ఆల్‌రౌండర్ల సమస్యకు చెక్ పడింది.

నవతెలంగాణ క్రీడావిభాగం



> బంతితోనూ నాపై నమ్మకం ఉంచటం సంతోషం. జట్టు కోసం నేను బౌలింగ్ చేయడానికి సైతం కఠోరంగా సాధన చేస్తున్నాను. మరింత మెరుగ్గా మాయ చేసేందుకు కష్టపడుతున్నాను
> - అభిషేక్ శర్మ

> ఆల్‌రౌండర్‌గా రాణించటం ప్రత్యేక అనుభూతి. బ్యాట్‌తో, బంతితో జట్టుకు ఉపయుక్తంగా ఉండటం గొప్పగా ఉంటుంది. పరుగులు చేస్తూ వికెట్లు పడగొట్టడం మంచిగా అనిపిస్తుంది
> - శివం దూబె

నాణ్యమైన బౌలింగ్ నైపుణ్యం కలిగిన బ్యాటర్లు.. నమ్మదగిన బ్యాటింగ్ నైపుణ్యం కలిగిన బౌలర్లు.. భారత క్రికెట్ ఎంతోకాలంగా అన్వేషిస్తున్న అంశం. హార్దిక్ పాండ్య ఒక్కడే ఆల్‌రౌండర్‌గా జాతీయ జట్టులో ఇంతకాలం కొనసాగాడు. అతడు ఫిట్‌నెస్ కోల్పోతే తుది జట్టు సమతూకం కోల్పోయే ప్రమాదకర పరిస్థితి టీమ్ ఇండియాది. వర్థమాన క్రికెటర్లు వెలుగులోకి వస్తున్న తరుణంలో భారత క్రికెట్ సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న ఆల్‌రౌండర్ల సమస్యకు చెక్ పడినట్టే కనిపిస్తుంది. ఇటీవల భారత్ చాంపియన్‌గా నిలిచిన ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్ నలుగురు ఆల్‌రౌండర్లతో బరిలోకి దిగింది. స్పెషలిస్ట్ బ్యాటర్లు తడబడిన చోట.. ఆల్‌రౌండర్ల అండతో రోహిత్‌సేన మెరుపు విజయాలు నమోదు చేసిన సంగతి తెలిసిందే. పొట్టి ఫార్మాట్‌లో విజయవంతం కావడానికి ఏ జట్టుకు అయినా లోతైన బ్యాటింగ్ లైనప్ అవసరం. టీ20 వరల్డ్‌కప్ జట్టులో టాప్-8 బ్యాటర్లు.. బ్యాట్‌తో ధనాధన్ దంచికొట్టేవాళ్లే కావటం గమనార్హం. సీనియర్ క్రికెటర్లు వీడ్కోలు పలుకటంతో టీ20 జట్టు సరికొత్త రూపం సంతరించుకోనుంది. కొత్త జట్టులోనూ ఆల్‌రౌండర్లకు కొదవ లేకపోవటం శుభపరిణామం.

దూబె, అభిషేక్ అదుర్స్ : శివం దూబె టీ20 ప్రపంచకప్ జట్టులోనూ నిలిచినా.. అక్కడ ఆల్‌రౌండర్‌గా రాణించేందుకు అవకాశం, అవసరం ఏర్పడలేదు. జింబాబ్వే పర్యటనలో శివం దూబె తనలోని ఆల్‌రౌండర్‌ను బయటపెట్టాడు. ఆఖరు టీ20లో జింబాబ్వే 168 పరుగుల ఛేదనలో మెప్పించాడు. సహకారం లభించని హరారే పిచ్ నుంచి పేస్ రాబట్టాడు. కీలక వికెట్లు పడగొట్టడంతో పాటు పరుగుల నియంత్రణ పాటించాడు. అంతకుముందు బ్యాట్‌తోనూ 12 బంతుల్లోనే 26 పరుగుల ధనాధన్ ఇన్నింగ్స్‌తో దంచికొట్టాడు. శివం దూబె ఆల్‌రౌండర్ ప్రదర్శనతో భారత్ ఘన విజయం సాధించింది.

యువ ఆటగాడు అభిషేక్ శర్మ ఐపీఎల్ క్వాలిఫయర్2లో చెపాక్‌పై స్పిన్ మ్యాజిక్ చూపించాడు. జింబాబ్వేతో ఆరంభంలో బంతితో అంచనాలు అందుకోలేదు. కానీ ఆఖరు మ్యాచ్‌లో అభిషేక్ లయ అందుకున్నాడు. మూడు ఓవర్లలో 20 పరుగులకు ఓ వికెట్ పడగొట్టాడు. మిడిల్ ఓవర్లలో జింబాబ్వే బ్యాటర్లను కట్టడి చేశాడు. ఇక రెండో టీ20లో అభిషేక్ శర్మ బ్యాట్‌తో చేసిన శతక బీభత్సం అభిమానులు ఎప్పటికీ మరువలేరు. టాప్ ఆర్డర్‌లో ధనాధన్ బ్యాటర్‌గా, నాణ్యమైన స్పిన్నర్‌గా అభిషేక్ శర్మ సత్తా చాటాడు. అంతర్జాతీయ స్థాయిలో సవాల్‌కు సిద్ధమని నిరూపించుకున్నాడు. జింబాబ్వేతో టీ20 సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా సైతం స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ నిలువటం భారత్‌కు అదనపు అనుకూలత.

భవితకు భరోసా : భారత టీ20 జట్టు భవిష్యత్ ఉజ్వలంగా కనిపిస్తుంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజాలు వీడ్కోలు పలికినా.. యువ క్రికెటర్లు మెగా సవాల్‌కు సిద్ధమవుతున్నారు. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ లైనప్‌లో ప్రధానం కానున్నారు. అభిషేక్ శర్మ రూపంలో టాప్ ఆర్డర్‌లో బలమైన పోటీదారుడు వచ్చాడు. రుతురాజ్ గైక్వాడ్, సంజు శాంసన్, రియాన్ పరాగ్‌లు జట్టులో చోటు కోసం చెమటోడ్చక తప్పదు. హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్లుగా టీ20 ప్రపంచకప్‌లో చిరస్మరణీయ ప్రదర్శన చేశారు. టీ20 జట్టులో ఈ ఇద్దరికి తోడు యువ ఆల్‌రౌండర్లు శివం దూబె, అభిషేక్ శర్మలు సిద్ధమయ్యారు. శివం దూబె తనదైన ఆఫ్ కట్టర్‌కు తోడుగా స్లో బాల్ వైవిధ్యం అందుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. అభిషేక్ వర్మ పవర్‌ప్లే, మిడిల్ ఓవర్లలో మాయ చేయగలనని ముందుకొస్తున్నాడు. ప్రపంచ క్రికెట్‌లో అన్ని జట్లు ఆల్‌రౌండర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. కాస్త ఆలస్యమైనా.. భారత జట్టులోనూ ఆల్‌రౌండర్లు వస్తున్నారు. భారత క్రికెట్‌కు ఇది శుభ సూచకం.



యూరో స్పెయిన్‌దే


- టైటిల్ పోరులో ఇంగ్లాండ్ ఓటమి
- చాంపియన్‌గా నిలిచిన స్పెయిన్

యుఈఎఫ్ఏ యూరో కప్ 2024

బెర్లిన్ (జర్మనీ) : ఇంగ్లాండ్ అర్థ శతాబ్దపు నిరీక్షణకు తెరపడలేదు. ప్రతిష్టాత్మక యూరో కప్ వేటలో త్రీ లయన్స్‌కు వరుసగా రెండోసారి భంగపాటు తప్పలేదు. యూరో కప్ ఫైనల్లో ఇంగ్లాండ్ 1-2తో పరాజయం పాలైంది. టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన స్పెయిన్ 2-1తో యూరో చాంపియన్‌గా అవతరించింది. నాల్గోసారి యూరోపియన్ చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం చేసుకున్న స్పెయిన్ ఉత్తమ ప్రదర్శనకు అద్భుత ముగింపు పలికింది. ఆదివారం (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) జరిగిన యూరో కప్ 2024 ఫైనల్లో స్పెయిన్ మెరుపు విజయం సాధించింది. నికో విలియమ్స్ (47వ నిమిషం), మైకల్ ఒయర్‌జాబల్ (86వ నిమిషం) స్పెయిన్‌కు టైటిల్ విన్నింగ్స్ గోల్స్ కొట్టగా.. ఇంగ్లాండ్ తరపున కోలె పాల్మెర్ 73వ నిమిషంలో ఊరట గోల్ సాధించాడు.

బెర్లిన్ ఒలింపియ స్టేడియంలో స్పెయిన్ ఫేవరేట్‌గా బరిలోకి దిగినా.. ఓ మెగా టైటిల్ కోసం 50 ఏండ్లకు పైగా ఎదురుచూస్తున్న ఇంగ్లాండ్‌పై ఆశలు ఉన్నాయి. కానీ మైదానంలో ఇంగ్లాండ్ తేలిపోయింది. 66 శాతం బంతిని నియంత్రణలో ఉంచుకున్న స్పెయిన్ 16 సార్లు ఇంగ్లాండ్ గోల్‌పోస్ట్‌పై దాడి చేసింది. ఇంగ్లాండ్ కేవలం 9 సార్లు మాత్రమే స్పెయిన్ గోల్‌పోస్ట్‌పైకి దూసుకెళ్లింది. 89 శాతం పాస్ కచ్చితత్వంతో స్పెయిన్ ఆటగాళ్లు వేగంగా అవకాశాలు సృష్టించుకున్నారు. నికో విలియమ్స్ 47వ నిమిషంలోనే గోల్ కొట్టి.. స్పెయిన్‌ను 1-0తో ఆధిక్యంలో నిలిపాడు. కానీ ఇంగ్లాండ్ 73వ నిమిషంలో గోల్ కొట్టి స్కోరు సమం చేసింది. కోలె పాల్మెర్ మెరుపు గోల్‌తో ఇంగ్లాండ్ ఆశలను సజీవంగా నిలిపాడు. 86వ నిమిషంలో స్పెయిన్ ఆనందం రెట్టింపు అయ్యింది. మైకల్ మరో గోల్‌తో స్పెయిన్‌ను 2-1తో మళ్లీ ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. పూర్తి సమయంలోపు ఇంగ్లాండ్‌ను సమర్థవంతంగా నిలువరించి ఆధిక్యం నిలుపుకున్న స్పెయిన్.. నాల్గోసారి యూరో కప్‌ను సొంతం చేసుకుంది.

వరమా? శాపమా..?



'భారతీయుడు 2'లో కమల్‌హాసన్

అప్పుడు 'పుష్ప', ఇప్పుడు 'కల్కి', 'భారతీయుడు 2' సినిమాలను చూసిన తర్వాత అసలు రెండు భాగాలుగా సినిమాలు చేయాల్సిన అవసరం ఏముందని అనిపించక మానదు. విషయం లేకుండా సాగతీత ధోరణితో బోర్ కొట్టిస్తున్న ఈ రెండు భాగాల సినిమాల విషయంలో ప్రేక్షకులు చాలా అసంతృప్తితో ఉన్నారు. ఇదే తీరు కొనసాగితే వారి నిరాదరణతో తెలుగు సినిమా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

కంటెంట్ లేకుండా సహనానికి పరీక్ష పెడితే ప్రేక్షకులు ఎలాంటి తీర్పు ఇస్తారో ఇటీవల విడుదలైన 'భారతీయుడు 2' చిత్రం చెప్పకనే చెప్పింది.

అవినీతిపై పోరాటం నేపథ్యంలో కమల్‌హాసన్, శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'భారతీయుడు' సినిమా అప్పట్లో ఒక సంచలన చిత్రం. దీనికి కొనసాగింపుగా ఇటీవల 'భారతీయుడు 2' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు.

కమల్, శంకర్ కాంబినేషన్ కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఆ అంచనాలకు తగ్గట్టుగా సినిమా లేకపోగా, ప్రతి సన్నివేశంలో విపరీతమైన సాగతీత ధోరణి ఉండటంతో ప్రేక్షకులను మరింత చిరాకు పెట్టింది. దీంతో అసలు ఎందుకు రెండో పార్ట్‌గా సినిమా తీశారు?, పైగా దీనికి కొనసాగింపుగా పార్ట్ 3 అవసరమా.. అని తీవ్ర అసంతృప్తిని సైతం వ్యక్తం చేశారు. ఈ అసంతృప్తి సెగ మేకర్స్‌కి అర్థం అవటంతో దాదాపు మూడు గంటల నిడివి ఉన్న ఈ రెండో భాగంలో ఏకంగా 20 నిమిషాల సన్నివేశాలను కట్ చేశారు.

విందు భోజనానికి పిలిచి సగం భోజనం పెట్టి పంపిస్తే ఎలా ఉంటుందో, సగం సగం కథలతో వస్తున్న సినిమాల విషయంలోనూ ప్రేక్షకుల పరిస్థితి అలాగే ఉంది. జయాపజయాల విషయం పక్కన పెడితే ఈ సినిమాల కోసం ప్రేక్షకులు ఒక సినిమాకే రెండు టిక్కెట్లు పెట్టి చూశారు. పైగా అధిక ధరలతో టిక్కెట్లను కొనుగోలు చేసి మరీ చూశారు.

మొదటి భాగంలో జస్ట్ కథని, పాత్రల తీరుని పరిచయం చేసి, రెండో భాగంలో అసలు కథని చెబుతున్నారు. కానీ అప్పటి వరకు ప్రేక్షకుడి సహనాన్ని పరీక్షిస్తున్నారు. అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప' సినిమా మూడేళ్ల క్రితం వచ్చి పెద్ద విజయం సాధించింది. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సగం కథనే చెప్పారు. అసలు కథ స్టార్ట్ అవుతుందనే సమయంలోనే, విలన్‌తో హీరోకి ఉన్న రివేంజ్‌ని పరిచయం చేసి మొదటి భాగాన్ని ముగించారు. ఇక రెండో భాగం 'పుష్ప2' చిత్రాన్ని అదిగో రిలీజ్, ఇదిగో రిలీజ్ అంటూ రకరకాల రిలీజ్ డేట్స్‌ని మారుస్తూ చివరకు డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ రూపొందించిన 'సలార్' విషయంలోనూ అదే జరిగింది. ఈ మూవీ గతేడాది డిసెంబర్‌లో వచ్చింది. ఇందులోనూ అసలు కథ చెప్పలేదు. పాత్రల పరిచయం చేసి, కథ ఊపందుకునే లోపు మొదటి భాగాన్ని ముగించారు. అసలు కథని రెండో భాగానికి దాచి పెట్టారు. ప్రభాస్ ఎలివేషన్లు, పాత్రల పరిచయానికే మూడు గంటలు తీసుకోవడం గమనార్హం. ఇక 'సలార్ 2' ఎప్పుడొస్తుందో మేకర్స్‌కే ఎరుక. ఇక తాజాగా వచ్చిన 'కల్కి2898ఏడీ' సినిమా విషయంలో ఇదే తీరు జరిగింది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ రూపొందించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఇప్పటికే రూ.1000కోట్లకుపైగా కలెక్షన్లని సాధించింది. అయితే ఈ సినిమా ఫస్టాఫ్‌లో అసలు కథే ఉండదు, పాత్రల పరిచయంతో పాటు కథేంటో సింగిల్ లైన్‌లో చెప్పినట్టు చేశారు. సెకండాఫ్‌లో అసలు కథ స్టార్ట్ అవుతుంది. కథ ఊపందుకునే లోపే ఎండ్ కార్డ్ పడుతుంది. పైగా సినిమా ఎండ్ వరకు స్లో నెరేషన్‌తో లాక్కుంటూ వచ్చి, ఎండ్‌లో మహాభారతం ఎలిమెంట్లు, ప్రభాస్ ఎలివేషన్లు ఇచ్చి ముగించారు.

ఇక అసలు కథ ఏంటో తెలియాలంటే 'కల్కి 2' రిలీజ్ వరకు వేచి చూడాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే 'కల్కి' సినిమా ఫస్టాఫ్ స్లోగా ఉండటాన్ని దర్శకుడు నాగ్ అశ్విన్ అంగీకరించడం, కావాలనే చేశామని చెప్పడం గమనార్హం. కానీ ఈ సినిమాలోని విజువల్స్ హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని అందరూ మెచ్చుకోవడం విశేషం.

సినిమా అనేది వ్యాపారం. సినిమాని రెండు భాగాలుగా తీసుకురావడం వెనుక భారీ వాణిజ్య కోణం ఉంది. దీన్ని మేకర్స్ బాగానే క్యాష్ చేసుకుంటున్నారు.

కానీ ఈ సినిమాలను తీసుకున్న బయ్యర్లు నష్టపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 'కల్కి' సినిమా వెయ్యి కోట్లని సాధించింది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాని తీసుకున్న బయ్యర్లకు ఇంతవరకు బ్రేక్ ఈవెన్ రాలేదని వినిపిస్తోంది.

బలమైన కథ ఉన్నప్పుడు రెండు భాగాలుగా చెప్పడంలో తప్పులేదు. కానీ అవసరం లేని, పెద్దగా కథలేని సినిమాల విషయంలోనూ అదే ఫార్మూలాని ఫాలో అవుతుండటం తెలుగు చిత్ర సీమకు క్షేమదాయకం కాదని మేకర్స్ తెలుసుకోవాలి.

- అయితగోని రాజు



దేవి శ్రీ ప్రసాద్

హైదరాబాద్‌లో తొలిసారి లైవ్ షో..

హైదరాబాద్ మహానగరంలో సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ తొలి లైవ్ షో పర్ఫార్మెన్స్ ఇవ్వబోతున్నారు. డిఎస్‌పి లైవ్ ఇండియా టూర్‌లో భాగంగా ఆయన హైదరాబాద్‌లో ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. 25 ఏండ్లుగా సంగీత ప్రపంచంలో ఎన్నో విజయాలు సాధించిన దేవీశ్రీ ప్రసాద్ మొదటి సారి హైదరాబాద్‌లో లైవ్ షోతో సంగీత ప్రియుల్ని పలకరించబోతున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏసీటీసీ ఈవెంట్ సంస్థ నిర్వహిస్తోంది. ఈ హై వోల్టేజ్ డీఎస్‌పీ కాన్సర్ట్‌ని చూడాలనే ఆసక్తి ఉన్నవారు ఏసీటీసీ ఈవెంట్‌లు, డిఎస్‌పి సోషల్ మీడియా ఖాతాలను గమనిస్తూ ఉండండి. అలాగే అక్టోబర్ 19న హైదరాబాద్‌లో జరగబోయే ఈ ఈవెంట్ వివరాలను ఏసీటీసీ ఈవెంట్ అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. హైదరాబాద్ కాన్సర్ట్ కోసం టిక్కెట్లు పొందాలంటే ఏసీటీసీ అధికారిక వైబ్ సైట్, పేటీఎమ్ ఇన్‌సైడర్‌లో టిక్కెట్స్ కొనుగోలు చేయవచ్చు. ఈనెల 14 నుంచి టికెట్లు అందు బాటులో ఉంటాయి.

నవచిత్రం

వైవిధ్యమైన కంటెంట్‌తో రేవు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'రేవు'. ఈ చిత్రాన్ని సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్, పారుపల్లి ప్రొడక్షన్ పై నిర్మాత డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నిర్మాణ సూపర్ విజన్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా ఫిల్మ్ జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు వ్యవహరిస్తున్నారు. హరినాథ్ పులి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

తాజాగా ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను డైరెక్టర్ బాబీ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమా విజువల్స్ చూశాను. చాలా బాగున్నాయి. సినిమాటోగ్రాఫర్ ప్రతిభ చూపించారు. ఈ సినిమాకు ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ అంతా కొత్త వారు చేశారు. ఇంతమంది కొత్త వాళ్లకు ఈ సినిమాలో అవకాశం ఇవ్వడం నాకు ఆనందంగా ఉంది' అని చెప్పారు. నిర్మాణ పర్యవేక్షకుడు ప్రభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాంబాబు మాట్లాడతూ, 'ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా తుది దశకు వచ్చాయి. ఆగస్టు రెండో వారంలో ఈ సినిమాను థియేటర్స్ లోకి తీసుకొస్తున్నాం' అని తెలిపారు.

ఘనంగా 'క' టీజర్ విడుదల



కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాను శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాని త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురాబోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఈ చిత్ర టీజర్ రిలీజ్ లాంచ్ వేడుకను హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు.

నిర్మాత చింతా గోపాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, 'మూడు 'క' లను నమ్ముకుని ఈ సినిమా నిర్మించాను. అందులో మొదటి క.. కథ. చాలా కథలు విన్న తర్వాత ఈ సినిమా కథలో డిఫరెన్స్, కంటెంట్ ఉన్నాయని బలంగా అనిపించింది. రెండో క.. కథానాయకుడు కిరణ్ అబ్బవరం. మూడో క.. కల. ఇండస్ట్రీలో ఒక మంచి సినిమా నిర్మించి పది మందికి తోడుగా ఉండాలని, ఇండస్ట్రీకి ఉపయోగపడాలని సంకల్పించుకున్నాను. ఈ సినిమాతో పరిచయం అవుతున్న దర్శకులు సందీప్, సుజీత్ మొదటి చిత్రంతోనే మంచి పేరు తెచ్చుకుంటారు' అని తెలిపారు.

'మా ప్రొడ్యూసర్ సపోర్ట్ మరువలేనిది. ఏ కథనైనా తెరపైకి తీసుకొచ్చేందుకు ధైర్యం కావాలి. ఆ ధైర్యాన్ని ఇచ్చింది కిరణ్. టీజర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నాం' అని దర్శకులు అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, "క" సినిమా తెలుగు నుంచి వచ్చిన ఒక మంచి సినిమా అని మీరంతా చెప్పుకుంటారు. ఇప్పుడున్న టికెట్ రేట్స్, పోటీలో ఎంతమంచి సినిమా ఇస్తే ఆడియెన్స్ థియేటర్స్‌కు వస్తారు అనేది మా డైరెక్టర్స్ బాగా ఆలోచించారు. ఇవాళ మా టీమ్ అంతా హ్యాపీగా మాట్లాడుతున్నాం అంటే కారణం మా ప్రొడ్యూసర్ గోపాలకృష్ణ రెడ్డి' అని చెప్పారు.

సారంగదరియాకు విశేష ఆదరణ



రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో సాయిజా క్రియేషన్స్ పతాకంపై చల్లపల్లి చలపతిరావు దివ్య ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మాతలుగా పద్మారావు అబ్బిశెట్టి (అలియాస్ పండు) దర్శకుడిగా పరిచయమైన చిత్రం 'సారంగ దరియా'. ఈ సినిమా ఈనెల 12న విడుదలై, ప్రేక్షకుల నుంచి మంచి స్పందనని రాబట్టుకుంది.

ఈ చిత్రానికి ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ రావడంతో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది.

రాజా రవీంద్ర మాట్లాడుతూ, 'మాకు మంచి థియేటర్లు దొరికాయి. ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. టెక్నికల్ టీమ్ చాలా కష్టపడింది. మోయిన్, మోహిత్, యశస్విని నా కంటే చాలా బాగా నటించారు. అందరి పాత్రలకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇండస్ట్రీలోకి వచ్చిన తరువాత ఇదే నాకు హ్యాపియెస్ట్ మూమెంట్. నా కెరీర్‌లో ఇదొక మంచి చిత్రంగా నిలిచింది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని అన్నారు.

'విడుదలైన అన్ని థియేటర్లలో బాగా ఆడుతోంది. ఇంత రెస్పాన్స్ చూస్తూ ఉంటే నాకు సంతోషంగా ఉంది. మొదటి రోజు తక్కువ మంది చూశారు. మౌత్ టాక్ వల్ల మెల్లి మెల్లిగా కలెక్షన్లు పెరుగుతున్నాయి. మంచి కథతో సినిమా తీశాం. మంచి కాన్సెప్ట్ అనే నమ్మకం ఉంది. మున్ముందు ఇంకా కలెక్షన్లు పెరుగుతాయన్న నమ్మకం ఉంది' అని నిర్మాత శరత్ చెప్పారు.

దర్శకుడు పద్మారావు అబ్బిశెట్టి మాట్లాడుతూ, 'థియేటర్ కోసమే ఈ సినిమాను తీశాం. మా నిర్మాత చాలా సపోర్ట్ చేశారు. మ్యూజిక్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. రాజా రవీంద్రతో పాటు మిగిలిన నటీనటులు అద్భుతంగా నటించారు. మా సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886